ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org
బుధవారం 23.09.2026 | సంపుటి :13 సంచిక : 64 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఉత్తమ నటులుగా

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న గ్రహీతలు

### మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్

- ఘనంగా 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం
- గుజరాత్ కెవాడియా వేదికగా కార్యక్రమం

2లో..



## ఆసియా క్రీడల్లో భారత్‌కు

### తొలి స్వర్ణం

ఫైనల్‌లో శ్రీలంకపై ఘన విజయం సాధించి పసిడి పతకం కైవసం చేసుకున్న మహిళా క్రికెట్ జట్టు

అమ్మాయిలూ మిమ్మల్ని చూసి దేశం గర్విస్తోంది : మోదీ


న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. మహిళల క్రికెట్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో పసిడిని సొంతం చేసుకుంది. తుది పోరులో శ్రీలంకపై 147 పరుగుల తేడాతో మిగతా 2లో..



# కృష్ణానీటిని విడుదల చేయండి

కర్ణాటక సీఎంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్

- ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి జూరాలకు 5 టీఎంసీల నీళ్లివ్వండి
- 5000 క్యూసెక్కుల నీటిని నెల రోజుల పాటు విడుదల చేయాలి
- బెంగళూరులో కర్నాటక సీఎం శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- తెలంగాణ సర్కారు విజ్ఞప్తికి డీకే సానుకూల స్పందన
- తెలంగాణ రైతులకు లాభం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ



బెంగళూరు/హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి)
ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగుచేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మిగతా 2లో..

### నీటి విషయంలో తెలంగాణను ముంచింది భారాసానే..

మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు మండిపాటు

2లో..

# విద్య,ఉపాధి ద్వారానే దళిత, ఆదివాసీల అభివృద్ధి

ప్రభుత్వ పథకాలు కార్యక్రమాల్లో వారికి పెద్దపీట: సీఎం రేవంత్ రెడ్డి

- ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ భాధితులకు సత్వర న్యాయం
- హైలెవెల్ కమిటీ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):
దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్సీ ఎస్టీలపై అణిచి వేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, మిగతా 2లో..

### తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా నిర్మాణాలు

సమగ్ర ప్రణాళికతో విమానాశ్రయాల పనులు చేపట్టాలి

శాఖల మధ్య సమన్వయంతోనే పనులు వేగవంతం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..



బీఆర్ఎస్ పదేళ్ల పాలనతోనే

# తెలంగాణకు ఈ దుర్గతి

- ఎల్‌నినో వర్షాలను తగ్గిస్తే.. బీఆర్ఎస్ భూమిపై నీటి నిల్వలను లేకుండా చేసింది
- జూరాల నుంచి చేపట్టాల్సిన పాలమూరు-రంగారెడ్డిని శ్రీశైలానికి మార్చారు : మంత్రి ఉత్తమ్

- తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పథకాన్ని భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుగా మార్చారు
- అంచనాలు,కమిషన్లు పెరిగాయి.. కానీ రైతు పొలానికి నీరు చేరలేదు
- లక్షల కోట్లు ఖర్చు చేసినా పాలమూరులో ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు
- తెలంగాణకు 299 టీఎంసీలు చాలంటూ సంతకాలు చేసి ఇప్పుడు జలహక్కులపై మొసలి కన్నీరు కారుస్తున్నారు
- జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తామని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఇబ్బందులకు ఎల్‌నినో ప్రభావం ఒక్కటే కారణం కాదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన ప్రణాళికా లోపాలు, అసమర్థ నిర్ణయాలు, ప్రాజెక్టుల అంచనాల పెంపు, పెండింగ్ పథకాల నిర్లక్ష్యం కూడా అంతే కారణమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్రంలో నెలకొన్న నీటి పరిస్థితి, గత ప్రభుత్వ వైఫల్యాలు, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం ప్రకృతి పరిణామమైతే, పదేళ్లపాటు అధికారంలో ఉండి వర్షపు నీటిని నిల్వ చేసుకునే వ్యవస్థలను మిగతా 2లో..



# రిమ్స్‌లో ఘోర విషాదం

పసిపిల్లల ఐసీయూలో ఏసీ పేలి చెలరేగిన మంటలు

### ఊపిరాడక ముగ్గురు చిన్నారులు మృతి

- మరో చిన్నారి పరిస్థితి విషమం
- ప్రమాదంపై సీఎం రేవంత్ విచారం
- మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశం
- ఘటనపై దర్యాప్తుకు కమిటీ
- ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన మంత్రి దామోదర



ఆదిలాబాద్/మావల(జనంసాక్షి):
ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్‌లో ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. సోమవారం అర్ధరాత్రి ఏసీ పేలి దట్టంగా పొగ అలముకుంది. ఆ సమయంలో ఇంక్యూబెటర్లలో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యాధికారులు, అద్దాలను పగలగొట్టి పసి కందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇచ్చోడకు చెందిన సలీం ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృతి చెందింది. మిగిలిన 23 మంది మిగతా 2లో..

# ఏసీబీ వలలో 'నిమ్స్' డాక్టర్

సుమారు రూ.100 కోట్లకు పైగానే అక్రమ ఆస్తులు గుర్తించిన అధికారులు

అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు

ఖైరతాబాద్ (జనంసాక్షి) :
హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నిమ్స్ ఆస్పత్రిలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు కలకలం రేపాయి.నిమ్స్ అదనపు సూపరింటెం డెంట్ డాక్టర్ లక్ష్మి భాస్కర్‌కు సంబంధించిన నివాసం, కార్యాలయం,కుటుంబ సభ్యులు,బంధు వర్గాలు, సంబంధిత ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం ఏకకాలంలో మూడు జిల్లాలలో 12చోట్ల తనిఖీలు చేపట్టి సుమారు రూ.100 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు గుర్తించారు. చేపట్టారు.నిమ్స్ చరిత్రలో సంచలన పరిణామంవైద్య రంగంలో కీలకమైన ప్రభుత్వ వైద్య సంస్థగా ఉన్న నిమ్స్‌కు సంబంధించిన అధికారిపై ఏసీబీ సోదాలు జరగడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.మంగళవారం ఉదయం ప్రారంభమైన ఈ సోదాల్లో ఏసీబీకి చెందిన పలు బృందాలు పాల్గొన్నట్లు అధికారులు చెప్పారు. డాక్టర్ మిగతా 2లో..



# ఏడు జిల్లాకు రెడ్ అలర్ట్..

- హైదరాబాద్ నగరంలో భారీ వర్షం
- స్తంభించిన ట్రాఫిక్.. హైడ్రా అప్రమత్తం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి):
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, బోయిన్‌పల్లి, దుండిగల్, గాంధీనగర్, రామ్‌నగర్, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, అంబర్‌పేట, ఎస్ఆర్‌నగర్, బోరబండ, కోఠి, లక్డీకాపూల్ మిగతా 2లో..

వందేమాతరం ఎన్ని చరణాలు పాడాలన్నది

# పౌరుల ఇష్టం

అది వారి వ్యక్తిగత నిర్ణయం : సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ(జనంసాక్షి):పూర్తి వందేమాతరంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలు ఆలపించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.ఆరు చరణాలను తప్పనిసరి చేయడంపై ప్రముఖ సంగీత విద్వాంసుడు టి.ఎం.కృష్ణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. వందేమాతరంలోని చివరి నాలుగు చరణాల్లో హిందూ దేవతలను ఉద్దేశించిన అంశాలు మిగతా 2లో..



క్యాన్సర్ మందుల అధిక ధరలు

### అరాచకమే..

పట్టపగలే రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు

దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండటం ఆశ్చర్యకరం: సుప్రీం కోర్టు

కావేరీ జలాల విషయంలో థర్డ్ పార్టీల

### జోక్యం సరికాదు

వివాదంపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు

2లో..

### భద్రతామండలిలో సంస్కరణలు అవసరం

విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పిలుపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఐక్యరాజ్యసమితిలో జరిగిన పీ4ఎం సదస్సుకు భారత్ కో స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఆస్ట్రేలియా, బార్బడోస్, బ్రెజిల్, కెనడా, కెన్యా దేశాలు భారత్‌తో కలిసి ఈ కార్యక్రమానికి సారథ్యం వహించాయి. ఈ నేపథ్యంలో ఐరాసను సంస్కరించాలని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పిలుపునిచ్చారు. మిగతా 2లో..

అమెరికా సైనిక మోహరింపును తగ్గిస్తే

# హర్మూజ్‌ను తెరుస్తాం



త్వరగా ఓడరేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయకపోతే మరోసారి వారి స్థావరాలను లక్ష్యం చేసుకుంటాం:ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన అంశాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అమెరికా పర్యటన వేళ టెహ్రాన్ కీలక ప్రకటన చేసింది. అగ్రరాజ్యం తన సైనిక బలగాల మోహరింపును తగ్గించే దిశగా చర్యలు చేపడితే.. 7 రోజుల్లో హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని పేర్కొంది. ఇరాన్, అమెరికాల మధ్య మధ్యవర్తిత్వం వహించే ప్రయత్నాలలో భాగమవుతున్న మిగతా 2లో..



విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలు..

# అత్యంత ప్రమాదకరం

- వీటి నివారణ దిశగా చర్యలు తీసుకోండి
- రాష్ట్రాలకు కేంద్రం కీలక అడ్వైజరీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): విదేశాల్లో ఉద్యోగాల పేరుతో అక్రమ నియామకాలు చేపడుతూ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని, ఈ ధోరణి అత్యంత ప్రమాదకరంగా మారిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అధిక వేతనం పేరుతో అమాయకులను ఆకర్షించి, వారిని సైబర్ మోసాల కేంద్రాల్లో బందీలుగా చేసే ఘటనలు పెరుగుతున్నాయని మిగతా 2లో..

## ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం

టీమ్‌ఇండియా గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 216/3 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక 69 రన్స్‌కే ఆలౌటైంది. దీంతో శ్రీలంక రజతంతో సరిపెట్టుకుంది. అంతకుముందు జరిగిన కాంస్య పోరులో బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ విజయం సాధించింది.

బౌలర్ల దెబ్బకు..

భారత్ నిర్దేశించిన భారీ లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంకకు ఏదీ కలిసిరాలేదు. టీమ్‌ఇండియా బౌలర్ల దెబ్బకు బెంబేలెత్తిపోయారు. ఓ వైపు ఆ జట్టు సారథి చమరి ఆటపట్టు (29) ఒంటరి పోరాటం చేసింది. ఆమెనే శ్రీలంక తరపున టాప్ స్కోరర్. దీప్తి శర్మ (3/6), షఫాలీ వర్మ (2/3) శ్రీ చరణి (2/13), శ్రేయాంక పాటిల్ (2/9) దెబ్బకు శ్రీలంక ఏ దశలోనూ పోటీలో లేదు. ఇమేషా దులాని (3), హాసిని (0), కవిష దిల్హారి (11), హర్షిత (0), కౌషని (14), హన్సిమ (1), సుగందిక (3) పరుగులు చేశారు.

బ్యాటింగ్‌లో మెరుపులు

శ్రీలంకపై ఇప్పటికే ఆసియా కప్‌లో గెలిచి ఊపుమీదున్న టీమ్‌ఇండియా.. ఈ ఫైనల్స్‌లోనూ అదే జోరు చూపించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యం ఉంచింది. షఫాలీ వర్మ (48: 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి ఓపెనర్ స్మృతి మంధాన (79: 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 99 పరుగులు జోడించింది. ఈ క్రమంలో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 పరుగులు చేసిన బ్యాటర్‌గా మంధాన ఘనత సాధించింది. షఫాలీ హాఫ్ సెంచరీ ముంగిట ఔటైంది. అయితే, ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (19)తో మంధాన ఇన్నింగ్స్‌ను నడిపించింది. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ పెవిలియన్‌కు చేరినా.. రిచా ఘోష్ (49×: 22 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రం ఎదురు దాడి చేసింది. ఓవైపు భారతి (7)ను నాన్‌స్ట్రైకింగ్‌కు పరిమితం చేసిన రిచా.. ఆఖరి మూడు ఓవర్లలో భారత్‌కు యాభై పరుగులను అందించింది. శ్రీలంక బౌలర్లలో సుగందిక, కవిష, ప్రబోద తలో వికెట్ తీశారు.

అమ్మాయిలూ.. దేశం గర్విస్తోంది: టీమ్‌ఇండియాపై మోదీ ప్రశంసలు

వరుసగా రెండోసారి ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత మహిళా జట్టు స్వర్ణం నెగ్గింది. తాజాగా శ్రీలంకపై 147 పరుగుల భారీ వ్యత్యాసంతో టీమ్‌ఇండియా విజయం సాధించింది. దీంతో ఆసియా క్రీడలు – 2026 ఎడిషన్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించింది. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. స్వర్ణ పతకం నెగ్గిన అమ్మాయిల జట్టుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ సహా పలువురు అభినందనలు తెలిపారు."భారత మహిళ జట్టు సభ్యులందరికీ నా శుభాకాంక్షలు. చరిత్రలో నిలిచిపోయే విజయంతో ఈ ఎడిషన్‌లో తొలి బంగారు పతకం అందించారు. జాతి గర్వపడేలా చేశారు. అద్భుతమైన ప్రదర్శన, బృంద స్ఫూర్తి, నిబద్ధత.. రాబోయే తరాలకు మరీ ముఖ్యంగా ఆడబిడ్డలకు స్ఫూర్తిదాయకం" – ద్రౌపది ముర్ము

"భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన అమ్మాయిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. ఆత్మవిశ్వాసం, అద్భుతమైన నైపుణ్యం, బృందంగా ఆడిన తీరు అమోఘం. ఈ విజయం.. ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి బంగారు పతకం తీసుకొచ్చింది. దేశం గర్వించేలా చేశారు. యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచారు. ఆసియా క్రీడల్లో తొలిసారి ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం నెగ్గిన సుచిక తరియల్‌కు అభినందనలు. చరిత్ర సృష్టించే ప్రదర్శన చేశావు " అని మోదీ అన్నారు. "ఇది కదా క్రికెట్ గేమ్ అందం. భిన్నమైన ఆటగాళ్లు, భిన్నమైన క్షణాలు.. చివరికి గొప్ప ఫలితం. షఫాలీ – స్మృతి మంధాన 99 పరుగుల భాగస్వామ్యమే భారత జట్టుకు ఆత్మవిశ్వాసం తీసుకొచ్చింది. ఆఖర్లో షఫాలీ వర్మ దూకుడైన గేమ్‌తో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యం ఉంచగలిగాం. షఫాలీ, దీప్తి, శ్రేయాంక, శ్రీ చరణి దెబ్బకు శ్రీలంక కుప్పకూలింది. జట్టుగా విజయం సాధించిన టీమ్‌ఇండియాకు కంగ్రాట్స్" సచిన్ అన్నారు.

## రిమ్స్‌లో ఘోరం



పిల్లల్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వారి పరిస్థితి బాగానే ఉన్నట్లు అధికారులు, వైద్యులు తెలిపారు. ఘటనపై విచారణకు సీఎం ఆదేశం ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. పలువురు మంత్రులు సైతం రిమ్స్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

ఆసుపత్రికి వచ్చిన మంత్రి దామోదర

ప్రమాదం దృష్ట్యా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. ముగ్గురు చిన్నారుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై కమిటీ వేశామన్న మంత్రి, నివేదిక వచ్చిన అనంతరం కార్యాచరణ చేపడతామన్నారు. రిమ్స్‌లో ఎమర్జెన్సీ, హెమటాలజీ, తల్లి, పిల్లల వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించి మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రిమ్?లో 100 పడకలతో ఓఅఊ భవనం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

కేటీఆర్ దిగ్భ్రాంతి

రిమ్స్‌లో చిన్నారుల మృతిపై కేటీఆర్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్'లో అగ్నిప్రమాదంపై ఆవేదనకు గురైనట్లు తెలిపారు. చిన్నారులందరూ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్

తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు చేరింది. షేక్‌పేట ఫ్లైఓవర్ వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. వాహనాలు నెమ్మదిగా కదులుతుండటంతో వాహనదారులు ముందుకెళ్లలేక అవస్థలు పడుతున్నారు. భారీ వర్షం కురుస్తున్న సమయంలో అనవసర ప్రయాణాలు రద్దు చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో ఇవాళ, రేపు (మంగళ, బుధవారాల్లో) భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇవాళ 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి:సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్‌లో వర్షాల దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. "రోడ్లు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలి. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధం చేయాలి. కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## కృష్ణా నీటిని విడుదల చేయండి

మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు. ఈ మేరకు దక్షిణ తెలంగాణలోని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డిల బృందం మంగళవారం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో భేటీ అయ్యింది. ప్రస్తుతం జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు కీలక దశలో ఉన్నందున, వాటిని కాపాడేందుకు కర్ణాటక నుంచి కృష్ణా జలాలను విడుదల చేయాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దృష్టికి తెలంగాణ ప్రతినిధి బృందం తీసుకెళ్లింది. ఈ నాలుగు సాగునీటి పథకాల కింద దాదాపు 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ ప్రాంతాల్లో వేలాది రైతు కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. ప్రస్తుత దశలో నీటి కొరత ఏర్పడితే పంట దిగుబడులతో పాటు రైతుల ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.ఒక నెల రోజుల పాటు ఇవ్వండి5,000 క్యూసెక్కులు.. ఒక నెల పాటు ప్రస్తుత పంటలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి 5,000 క్యూసెక్కుల నీటిని నిరంతరాయంగా ఒక నెల రోజుల పాటు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ నీటితో కీలక దశలో ఉన్న పంటలకు సకాలంలో సాగునీరు అందించి రైతులను ఆదుకోవచ్చని వివరించింది. మిగిలిన రుతుపవన కాలంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రస్తుతం నియంత్రిత పద్ధతిలో నీటిని విడుదల చేస్తే అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని ప్రతినిధి బృందం వివరించింది. రైతుల పంటలు, వారి జీవనోపాధిని కాపాడటమే ప్రధాన లక్ష్యంగా కర్ణాటక ముఖ్యమంత్రితో ఈ భేటీ జరిగింది. పొరుగు రాష్ట్రాల మధ్య సహకార స్ఫూర్తితో కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు కోరారు. నీళ్లు వస్తున్నాయని తెలిసి బీఆర్‌ఎస్ హడావుడి : మంత్రి జూపల్లిజూరాల జలాల సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇప్పటికే కర్ణాటక సీఎంతో మాట్లాడామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కర్ణాటకకు లేఖ రాసిన విషయం తెలిసిన వెంటనే బీఆర్‌ఎస్ ధర్నాకు దిగిందని, రాజకీయ లబ్ధి కోసమే ఈ ధర్నాలు చేస్తుందని విమర్శించింది. జూరాల ప్రాజెక్టులో కనీసం 3 టీఎంసీల నీటిని తాగునీటి కోసం నిల్వ ఉండాలని మంత్రి జూపల్లి తెలిపారు. రైతులకు నీరు విడుదల చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే ప్రస్తుతం జూరాలలో తాగునీటి అవసరాలకు మించి సాగునీటికి సరిపడిన నీళ్లులేదన్నారు. ఈ విషయాలు తెలిసి కూడా బీఆర్‌ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆందోళనలు చేస్తోందన్నారు.

### నీటి విషయంలో తెలంగాణను ముంచింది భారాసానే..

హైదరాబాద్(జనంసాక్షి):

బీఆర్‌ఎస్ నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని, కావాలనే రైతులను రెచ్చగొడుతున్నారని మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆక్షేపించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. నీళ్ల కోసం కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తున్నామని చెప్పారు.జూరాల డ్యామ్ వద్ద బీఆర్‌ఎస్ చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదని మంత్రి వాకిటి మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతలు నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. కర్ణాటక ప్రభుత్వం కాళ్లు పట్టుకోవాలని బీఆర్‌ఎస్ అంటోందన్న ఆయన.. రైతుల కోసం కాళ్లు మొక్కితే తప్పేముందని ప్రశ్నించారు.

### భద్రతామండలిలో సంస్కరణలు అవసరం: భారత్

ప్రస్తుత అవసరాలు, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా భద్రతామండలిలో మార్పులు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భద్రతా మండలి అనుబంధ సంఘాలు పూర్తి పారదర్శకత పాటించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంఘర్షణలు, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలు వంటి సమస్యలతో ప్రస్తుతం ప్రపంచ వ్యవస్థ ఒత్తిడిలో ఉందన్నారు.ఈ పరిస్థితులను నియంత్రించకుండా వదిలేస్తే.. అది అంతర్జాతీయ సహకార స్ఫూర్తిని ప్రశ్నార్థకం చేస్తుందని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి, అంతర్జాతీయ భద్రత, వాతావరణ చర్యలు, సాంకేతికత, ఉగ్రవాద నిరోధక చర్యలు, విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం, మహమ్మారులకు సిద్ధమవడం వంటి అంశాలు కూడా ప్రమాదంలో ఉన్నాయని హెచ్చరించారు. వీటిని సమర్థవంతంగా నిర్వహించాలంటే.. దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి తమ ఐక్యతను చాటుకోవడం అవసరమని పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాలు, నియమాలు, నిబంధనలను అన్ని దేశాలు సక్రమంగా పాటించినప్పుడే ప్రపంచం ముందుకు వెళ్తుందన్నారు.

### విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలు.. అత్యంత ప్రమాదకరం

హెచ్చరించింది. ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అడ్వైజరీ జారీ చేసింది.సోషల్ మీడియా, జాబ్ పోర్టల్స్‌లో అనుమానాస్పద నియామకాల ప్రకటనలపై నిఘా పెట్టాలని రాష్ట్రాల సైబర్ విభాగాలను కేంద్రం ఆదేశించింది. మోసపూరిత నియామకాల కేసుల్లో కీలకమైన సాక్ష్యాలైన డిజిటల్ చాట్‌లు, చెల్లింపు రికార్డులను వెంటనే సీజ్ చేయాలని సూచించింది. స్థానిక రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల కోసం ధ్రువీకరణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని పేర్కొంది. విదేశాంగశాఖ పరిధిలోని వలసదారుల విభాగం నుంచి సరైన లైసెన్స్ లేకుండా పనిచేసే ఏజెన్సీలను, చట్టవిరుద్ధమైన మార్గాల్లో విదేశాలకు పంపించే సంస్థలను తక్షణమే మూసివేయాలని సూచించింది.నకిలీ ఏజెంట్లపై తీవ్రమైన అక్రమ రవాణా నిబంధనల కింద అభియోగాలు మోపి విచారణ జరపాలని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.

### వందేమాతరం ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల ఇష్టం

ఉన్నాయని, వాటిని తప్పనిసరిగా పాడేలా చేయడం రాజ్యాంగంలోని లౌకిక విలువలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా, ఒక నిర్దిష్ట మతపరమైన సందేశాన్ని ప్రోత్సహించేలా చట్ట సవరణ ఉందని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఈ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిగింది.

### అమెరికా సైనిక మొహరింపును తగ్గిస్తే హర్మూజ్‌ను తెరుస్తాం

దేశాలతో సంప్రదింపులు జరపడానికి.. ఈ వారం న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలను వినియోగించుకోవాలని ఇరాన్ భావిస్తోంది. ఈ ప్రతిపాదనను సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సైతం ఆమోదించారన్నారు. నిర్దేశిత కాలంలోగా వాషింగ్టన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయకపోతే..అమెరికా స్థావరాలను మరోసారి లక్ష్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

## విద్యా,ఉపాధి ద్వారానే దళిత, ఆదివాసీల అభివృద్ధి

న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా నిర్మాణాలు

హైదరాబాద్(జనంసాక్షి):

ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతిరూపాలుగా ఉన్న కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయం శిల్ప, వాస్తు కళను పరిశీలించి, అవి ప్రతిబింబించేలా నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు నిర్మించే ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహం మార్పు, రహదారుల మళ్లింపు, బీఎస్‌ఎన్‌ఎల్ లైన్లు, తాగు నీటి సరఫరా లైన్ల మార్పు అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆయా అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి రహదారులు నిర్మించాలని, ఆ రహదారులను సమీప జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని సూచించారు. ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనులు చేపడితే, అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యుత్, ఆర్ అండ్ బీ, తాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ అధికారులు సమావేశమై బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులతో చర్చించి, ఏకకాలంలో పనులు సాగేలా చూడాలని సూచించారు.

## ఏసీబీ వలలో 'నిమ్స్' డాక్టర్

లక్ష్మీ భాస్కర్ నివాసంతో పాటు కార్యాలయం,కుటుంబ సభ్యులకు సంబంధించిన ప్రాంతాల్లోనూ తనిఖీలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.ఆస్తులు, బ్యాంకు లావాదేవీలపై దృష్టిఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఆస్తుల పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లు, ఇతర ఆర్థిక రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం.కొన్ని ప్రాంతాల్లో నగదు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అయితే ఎంత నగదు లభించింది? ఎంత విలువైన ఆస్తులను గుర్తించారు? ఏయే పత్రాలను స్వాధీనం చేసుకున్నారు? అనే అంశాలపై ఏసీబీ నుంచి అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. డాక్టర్ లక్ష్మీ భాస్కర్ సుమారు రెండు దశాబ్దాలుగా నిమ్స్‌లో పనిచేస్తున్నారని,గత ఐదేళ్లుగా అదనపు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆయనకు సంబంధించిన సేవా కాలంలో ఆస్తుల పెరుగుదల, ఆదాయ వనరులు, ఆస్తుల కొనుగోళ్లు వంటి అంశాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించి గతంలో భూ లావాదేవీకి సంబంధించిన పోలీసు కేసు నమోదైనట్లు అప్పట్లో కొన్ని మీడియాలో కథనాలు వచ్చినట్టు సమాచారం. ఏసీబీ దర్యాప్తులో కీలక ప్రశ్నలు..ప్రస్తుత సోదాల నేపథ్యంలో ప్రధానంగా కొన్ని అంశాలు పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉంది,అధికారిక ఆదాయానికి అనుగుణంగా ఆస్తులు ఉన్నాయా సేవా కాలంలో కొనుగోలు చేసిన స్థిరాస్తుల విలువ ఎంత బ్యాంకు ఖాతాలు, డిపాజిట్లు, పెట్టుబడులకు ఆదాయ వనరులు ఏమిటి?కుటుంబ సభ్యులు లేదా సంబంధిత వ్యక్తుల పేర్లపై ఉన్న ఆస్తులకు అసలు ఆర్థిక మూలాలు ఏమిటి?సోదాల్లో లభించిన పత్రాలు, ఆర్థిక రికార్డులు ఆరోపణలను ఎంతవరకు బలపరుస్తాయి?ఈ అంశాలపై పూర్తి స్థాయి పరిశీలన చేసిన తర్వాత వెలువడనున్నాయి. ప్రస్తుతం నిమ్స్‌లో చోటుచేసుకున్న ఈ పరిణామం మాత్రం ప్రభుత్వ వైద్య రంగంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఒక ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థలో కీలక పరిపాలనా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారిపై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ సోదాలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## క్యాన్సర్ మందుల అధిక ధరలు అరాచకమే..

న్యూఢిల్లీ(జనంసాక్షి):క్యాన్సర్ మందుల అధిక ధరలపై సుప్రీం కోర్టు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రిటైలర్లకు కేవలం రూ.2,700కే సరఫరా అవుతున్న ఒక క్యాన్సర్ ఔషధంపై.. రూ.27 వేల ఎంఆర్‌పీ ముద్రించడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఇది అరాచకమని, రోగుల విషయంలో పట్టపగలే జరుగుతున్న దోపిడీ అని పేర్కొంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండటం ఆశ్చర్యకరమని తెలిపింది.ఔషధాల ధరలపై కఠినమైన నియంత్రణ, జనరిక్ మందులను సూచించని వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. "క్యాన్సర్ చికిత్సకు వాడే కొన్ని మందుల ఎంఆర్‌పీ ధర.. రిటైలర్లకు ఇచ్చే దాని కన్నా 10 రెట్లు ఎక్కువగా ఉంది. ఇది అరాచకం. దీన్ని దోపిడీ అనకపోతే ఇంకేమంటారు? క్యాన్సర్ చికిత్స కోసం ప్రజలు తమ ఇళ్లు, నగలను అమ్ముకుంటున్నారు. రోగులను ఇలా ఎలా మోసం చేస్తారు?" అని ధర్మాసనం

## బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనతోనే తెలంగాణకు ఈ దుర్గతి

నిర్మించకపోవడం బీఆర్‌ఎస్ పాలకుల వైఫల్యమని అన్నారు. ప్రకృతి తెచ్చిన వర్షాభావాన్ని ప్రజలకు తీవ్రమైన నీటి సంక్షోభంగా మార్చింది గత పాలకుల దూరదృష్టిలేమేనని ధ్వజమెత్తారు."ఎల్‌నినో ఆకాశంలో వర్షాలను తగ్గించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూమిపై నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను నాశనం చేసింది. ప్రకృతి కరువును తీసుకొస్తే.. బీఆర్‌ఎస్ అసమర్థ పాలన దానిని రైతుల పాలిట మహా సంక్షోభంగా మార్చింది" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.జూరాల నుంచి చేపట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదుపాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మొదట రూపొందించిన విధంగా జూరాల నుంచి చేపట్టి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న ఈ స్థాయి నీటి సంక్షోభం వచ్చేది కాదని మంత్రి స్పష్టం చేశారు.జూరాల రెండు తీరాలూ తెలంగాణ భూభాగంలోనే ఉన్నాయని, అక్కడి నుంచి ప్రాజెక్టును చేపడితే నీటి వనరు, ఎత్తిపోతల వ్యవస్థ, రిజర్వాయర్లు, పంపిణీ వ్యవస్థ మొత్తం తెలంగాణ నియంత్రణలోనే ఉండేదన్నారు.జూరాలకు వచ్చే వరద ప్రవాహం, నీటి లభ్యత, వరద కొనసాగే రోజులపై జాతీయస్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థలతో హైడ్రాలజీ అధ్యయనాలు కూడా నిర్వహించారని చెప్పారు. సుమారు 70 టీఎంసీల నీటిని వినియోగించుకునే విధంగా దశలవారీ ప్రణాళిక, ప్రాజెక్టు రూపకల్పన సిద్ధమైందన్నారు. జూరాల పరిసరాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిజర్వాయర్లు నిర్మించి ఉంటే వరదకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసి, వర్షాభావ పరిస్థితుల్లో పాలమూరు రైతాంగానికి అందించగలిగేవారమన్నారు."జూరాల నుంచి ప్రాజెక్టు మొదలై ఉంటే వరద వచ్చినప్పుడు నీటిని పట్టుకునేవాళ్లం.. కరువు వచ్చినప్పుడు రైతుకు అందించేవాళ్లం. కానీ బీఆర్‌ఎస్ పాలకులు జూరాలను వదిలేసి పాలమూరు రైతును ఆకాశం వైపు చూసేలా చేశారు" అని మండిపడ్డారు.ఇటు జూరాల.. అటు శ్రీశైలంజూరాల తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటి వనరైతే, శ్రీశైలం తెలంగాణ?ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి నీటి వనరని ఉత్తమ్ వివరించారు.శ్రీశైలంలో నీటి లభ్యత ఎగువ నుంచి వచ్చే ప్రవాహాలు, విద్యుదుత్పత్తి, రెండు రాష్ట్రాల అవసరాలు, ఇతర ప్రాజెక్టుల వినియోగంపై ఆధారపడి ఉంటుందన్నారు. శ్రీశైలం జలాశయంలో అవసరమైన నీటిమట్టం నమోదైన తర్వాతే పాలమూరు?రంగారెడ్డి మోటార్లను నడపగల పరిస్థితి ఉందన్నారు.అదే జూరాల వద్ద ప్రాజెక్టును కొనసాగించి ఉంటే వరద ప్రవాహాన్ని అందుబాటులోకి వచ్చినప్పుడే ఒడిసిపట్టి సమీప రిజర్వాయర్లలో నిల్వ చేసుకునే అవకాశం ఉండేదని పేర్కొన్నారు."అటు శ్రీశైలంలో నీటి కోసం ఎదురుచూపులు.. ఇటు జూరాల నుంచి దిగువకు వెళ్లిపోయే వరద జలాలు?ఈ రెండింటి మధ్య పాలమూరు రైతును నిలబెట్టిన పాపం బీఆర్‌ఎస్ పాలకులదే" అని ఉత్తమ్ ధ్వజమెత్తారు.జూరాలైతే తక్కువ వ్యయం.. శ్రీశైలంతో శాశ్వత విద్యుత్ భారంజూరాల నుంచి పాలమూరు రంగారెడ్డి పథకాన్ని చేపట్టి ఉంటే నీటిని ఎత్తిపోసే ఎత్తు, నిర్మాణ వ్యయం, విద్యుత్ అవసరం, నిర్వహణ భారం తక్కువగా ఉండేదని మంత్రి తెలిపారు. ప్రాజెక్టును శ్రీశైలానికి మార్చడంతో నీటిని మరింత ఎత్తుకు పంపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.దీనివల్ల భారీ సామర్థ్యం కలిగిన పంపులు, పంప్‌హౌస్‌లు, విద్యుత్ వ్యవస్థలు అవసరమయ్యాయని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరగడమే కాకుండా, ప్రతి ఏటా విద్యుత్, నిర్వహణ రూపంలో తెలంగాణపై శాశ్వత ఆర్థిక భారం పడేలా చేశారని విమర్శించారు."జూరాలను వదిలి శ్రీశైలానికి మార్చడం వల్ల ఒక్కసారి ప్రాజెక్టు వ్యయమే పెరగలేదు. నీటిని ఎత్తిపోసిన ప్రతిసారీ తెలంగాణ చెల్లించాల్సిన విద్యుత్ బిల్లు కూడా పెరిగింది. బీఆర్‌ఎస్ తీసుకున్న ఒక్క తప్పుడు నిర్ణయం తరతరాలపై ఆర్థిక భారం మోపింది" అని పేర్కొన్నారు.జూరాల నుంచి తక్కువ వ్యయంతో పూర్తయ్యే ప్రాజెక్టును శ్రీశైలానికి మార్చడం వెనుక ప్రజాప్రయోజనం లేదని ఉత్తమ్ ఆరోపించారు. ప్రాజెక్టు వ్యయాన్ని పెంచితే కమిషన్లు పెరుగుతాయనే కక్కుర్తితోనే నీటి వనరును మార్చారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చినట్లుగానే, పాలమూరు?రంగారెడ్డి పథకాన్ని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి తెలంగాణపై భారీ ఆర్థిక భారం మోపారని అన్నారు."ప్రాజెక్టులను ప్రజల దాహం తీర్చే సాధనాలుగా కాకుండా తమ ధనదాహం తీర్చుకునే మార్గాలుగా చూశారు. మోటార్లతో నీటిని ఎత్తే ముందు ప్రాజెక్టుల అంచనాలను ఎత్తిపోశారు. ఎక్కువ అంచనా?ఎక్కువ కమిషన్ అన్నదే వారి నీటిపారుదల విధానంగా మారింది" అని తీవ్రంగా విమర్శించారు.

## ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్

– రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న గ్రహీతలు

అహ్మదాబాద్(జనంసాక్షి):భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. దశాబ్దాలుగా దేశ రాజధాని న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ వేదికగా ఈ వేడుకను నిర్వహిస్తుండగా, ఈసారి మాత్రం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం గుజరాత్‌లోని కెవాడియాలో నిర్వహించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ స్ఫూర్తితో తొలిసారిగా దిల్లీ వెలుపల నిర్వహించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ సందర్భంగా విజేతలకు పురస్కారాలు అందించారు. 2024లో విడుదలైన సినిమాలు, నాన్ ఫీచర్ ఫిల్మ్‌కు సంబంధించి పలు కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ అవార్డులతో సత్కరించారు. 2024 సంవత్సరానికి సంబంధించి మొత్తం 400కుపైగా చిత్రాలు జ్యూరీ ముందుకురాగా, వాటిల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వాటిని ఎంపిక చేసినట్లు అవార్డుల కమిటీ పేర్కొంది. ఇటీవల జులై 18న ఈ జాతీయ చలన చిత్ర పురస్కారాలను కేంద్రం ప్రకటించగా, ఇప్పుడు సెప్టెంబర్ 22న అవార్డుల ప్రదానం జరిగింది.

అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం

ఈ ఏడాది కర్ణాటకకు చెందిన వెటరన్ యాక్టర్ అనంత్ నాగ్‌ను (కేజీఎఫ్ ఫేమ్) దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వరించగా, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఆయన నేడు పురస్కారం అందుకున్నారు. అనంత్ నాగ్ వేదికపైకి వెళ్లే సమయంలో అంతా నిల్చొని చప్పట్లతో ఘనస్వాగతం పలికారు. భారతీయ సినీ రంగానికి అందించిన సేవలకు గానూ ఆయనకు ఈ పురస్కారం వరించింది. ఈ అవార్డ్ కింద గోల్డెన్ లోటస్ (స్వర్ణ కమలం), శాలువా, రూ. 10 లక్షల నగదు బహుమతి ఆయనకు లభించింది. భారత సినీ పరిశ్రమలో దీనిని అత్యంత ప్రతిష్టాత్మకమైన పురస్కారంగా భావిస్తారు.

**ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్:** ఈ ఏడాది ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు నటులు పంచుకున్నారు. మలయాళ చిత్రం భ్రమయుగంలో అద్భుత నటన ప్రదర్శించినందుకు మమ్ముట్టికి, హిందీ సినిమా చందూ ఛాంపియన్ హీరో కార్తిక్ ఆర్యన్‌ను ఈ పురస్కారం వరించింది. మమ్ముట్టి ఇది నాలుగో నేషనల్ అవార్డ్ కావడం విశేషం. ఈ ఇరువురూ వేర్వేరుగా రాష్ట్రపతి చేతుల మీదుగా నేషనల్ అవార్డును అందుకున్నారు. వీరు అవార్డు స్వీకరిస్తున్న సమయంలో ప్రేక్షకులు, ఇతర నటీనటులు నిల్చొని చప్పట్లతో స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

**జాతీయ అవార్డు అందుకున్న నిహారిక:**తెలుగు సినిమా పుష్ప: ది రూల్ పార్ట్–2 కూడా 72వ జాతీయ అవార్డుల్లో సత్తాచాటింది. బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్లుగా ఈ చిత్రానికి పనిచేసిన దీపాలి నూర్, సీతల్ శర్మ అవార్డు అందుకున్నారు. అలాగే స్క్రీన్ ప్లే అందించిన దర్శకుడు సుకుమార్‌కు ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా జాతీయ అవార్డు లభించింది. ఉత్తమ తెలుగు చిత్రంగా కమిటీ కుర్రోళ్లును జాతీయ అవార్డు వరించగా, నిర్మాత నిహారిక కొణిదెల రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా కల్కి 2898 ఏడీ నిలవగా, దిగ్గజ నిర్మాత అశ్వినీ దత్ పురస్కారం అందుకున్నారు.

ఉత్తమ నటి అవార్డు అందుకున్న యామీ గౌతమ్

ఆదిత్య సుహాస్ జంభాలే దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ సినిమాకు మొత్తం 3 నేషనల్ అవార్డ్స్ లభించాయి. ఈ చిత్రంలో తన నటనకుగానూ యామీ గౌతమ్ ఉత్తమ నటి అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. సినిమాకు సంగీతం సమకూర్చిన శాశ్వత్ సచ్‌దేవ్‌కు బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్ కేటగిరీలో అవార్డు లబించింది. భక్షక్ చిత్రంలో నటనకుగానూ బాలీవుడ్ యాక్టర్ సంజయ్ మిశ్రా ఉత్తమ సహాయ నటుడిగా అవార్డును అందుకున్నారు. తమిళ చిత్రం మహారాజాలో నటనకు సచనా నమిదాస్ ఉత్తమ సహాయ నటి పురస్కారం స్వీకరించారు.

తమిళ చిత్రం అమరన్‌కు కూడా పలు అవార్డులు లభించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన రాజ్‌కుమార్ పెరియసామి జాతీయ ఉత్తమ దర్శకుడిగా అవార్డును స్వీకరించారు. ఉత్తమ ఎడిటింగ్ కేటగిరీలో ఇదే చిత్రానికి పనిచేసిన ఆర్. కళైవణ్ణన్ జాతీయ అవార్డును అందుకున్నారు. ఉత్తమ నేపథ్య సంగీతం కేటగిరీలో జీవీ ప్రకాశ్ కుమార్ కూడా ఇదే చిత్రానికి పురస్కారం అందుకున్నారు.

# మీ రాజకీయాలకు 'జూరాల'ను వాడొద్దు

- ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు
- పాలమూరు రైతుల ప్రయోజనాల విషయంలో సర్కారు వెనక్కి తగ్గదు : మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : జూరాల ప్రాజెక్టు నీటి విడుదల అంశాన్ని బీఆర్ఎస్ నాయకులు రాజకీయంగా వాడుకుంటూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, భవిష్యత్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం శాస్త్రీయంగా, బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. జూరాల నీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో చేస్తున్నవేనని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం, దక్షిణ భారతదేశంలోని వర్షపాత పరిస్థితులు, కర్ణాటక నుంచి వచ్చే ప్రవాహం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నీటి నిర్వహణ చేస్తున్నామని చెప్పారు. జూరాల డ్యామ్‌కు ప్రమాదం ఉందని, గేట్లు ఎత్తిపోతాయని, డ్యామ్ కింద ఉన్న గ్రామాలకు ముప్పు ఉందని ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధంగా మాట్లాడటం సరికాదని మంత్రి అన్నారు. జూరాల ప్రాజెక్టు గతంలో భారీ వరద ప్రవాహాలను ఎదుర్కొన్న ప్రాజెక్టు అని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు నీటి నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. పాలమూరు రైతుల ప్రయోజనాల విషయంలో ప్రజా ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గదని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ రైతులకు అవసరమైన సాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

# మహిళల జీవితాల్లో 'మహాలక్ష్మి' వెలుగులు

- ఉచిత బస్సు ప్రయాణంతో తెలంగాణ మహిళల సాధికారత...
- రోజుకు 37 లక్షల మందికి పైగా ప్రయాణిస్తూ ఆల్ టైమ్ రికార్డ్!
- రికార్డు స్థాయిలో మహిళల ఆదా! నేడు 37.09 లక్షల ప్రయాణాలకు...
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు, సౌకర్యాలు కల్పించడమే ధ్యేయం : ఎండీ వై. నాగిరెడ్డి




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం 2023 డిసెంబర్ 9న అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్రంలో ఒక సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించింది. పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం వారి జీవితాల్లో నూతన వెలుగులు నింపింది. నిత్యం పనుల కోసం, చదువుల కోసం, కుటుంబ అవసరాల కోసం పయనించే మహిళలకు ఇది ఆర్థికంగా ఎంతో అండగా నిలుస్తూ, వారిని నిజమైన మహారాణులుగా మార్చింది. ఈ పథకం ద్వారా రోజుకు 37 లక్షల మందికి పైగా ప్రయాణిస్తూ ఆల్ టైమ్ రికార్డు సృష్టించడమే కాకుండా, మహిళల సాధికారతకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. పథకం ప్రారంభమైన మొదటి రోజు నుంచే మహిళల నుంచి అపూర్వ స్పందన లభించింది. 2023-24 ప్రారంభ దశలోనే రోజుకు సగటున 29.42 లక్షల ప్రయాణాలు నమోదవగా, ఆ సంఖ్య క్రమంగా పెరుగుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి రికార్డు స్థాయిలో రోజుకు దాదాపు 37.09 లక్షలకు చేరింది. మహిళలు ప్రయాణ ఖర్చుల రూపంలో దాదాపు రూ. 2,428.47 కోట్లు (2026-27 ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు వరకు) పొదుపు చేసుకోవడం ఈ పథకం సాధించిన అసాధారణ విజయానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రయాణ పొదుపుతో నేడు ఎన్నో కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం, సంతోషం చేకూరాయి.

ఈ బృహత్తర విజయం వెనుక తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) అధికారుల, క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర కృషి ఉంది. మంగళవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో అన్ని జోన్ల ఈడీలు, ఆర్ఎంలతో జరిగిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో సంస్థ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వై. నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న ఈడీలు సిహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్, సాలోమన్, ఖుస్రో షా ఖాన్, ఏ. శ్రీధర్, ఎఫ్ఏ విజయపుష్పలతో పాటు అన్ని రీజియన్ల ఆర్ఎంలను, క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండీ ప్రత్యేకంగా ప్రశంసించారు. పెరుగుతున్న మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించడం, పాఠశాలలు, కళాశాలల వేళల్లో విద్యార్థినులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ట్రిప్పులు నడపడం ద్వారా సంస్థ ప్రయాణికుల నమ్మకాన్ని గెలుచుకుందని ఎండీ నాగిరెడ్డి తెలిపారు. మహాలక్ష్మి స్కీమ్ వల్ల బస్ సర్వీసులు తగ్గించారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రయాణికుల రవాణా అవసరాలను గుర్తించి ఆ మేరకు బస్సులు, సౌకర్యాలు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే, ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా అన్ని రూట్లలోనూ నిరంతరాయంగా బస్సులు నడుపుతున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రయాణికుల అవసరాలను బట్టి మరిన్ని కొత్త బస్సులను అందుబాటులోకి తెస్తూ, ప్రతి మహిళా ప్రయాణికురాలికి సురక్షితమైన, గౌరవప్రదమైన ప్రయాణ అనుభూతిని అందించడమే ధ్యేయంగా ఆర్టీసీ ముందుకు సాగుతోందని వెల్లడించారు. 2025-26 సంవత్సరం కంటే 2026-27 ఆగస్టు వరకు 96.50 లక్షల కిలోమీటర్లు అదనంగా మహాలక్ష్మి ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీసులు నడిపామని తెలిపారు.

# ఎన్నికల అఫిడవిట్‌లోనే తమ ఆస్తుల వివరాలు

- ప్రయివేటు వ్యక్తుల ఇండ్లలోకి వెళ్తారా?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : తమ ఆస్తుల వివరాలు ఎన్నికల అఫిడవిట్‌లో ఉన్నాయని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీష్ రెడ్డి అన్నారు. అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లల్లోకి వెళ్లవద్దని వారికి తెలియదా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డి అనుచరుడిగా ఎక్కడ హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. నేరస్తుల మాదిరిగా పక్కా వ్యూహంతో ఫామ్ హౌస్‌లపై దాడి చేద్దామని ప్రజా భవన్ వద్ద కాంగ్రెస్ వాళ్లు జమ అవుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాటు చేసింది ఎవరు..

ప్రభుత్వం తరపున వెళ్ళారా...పార్టీ తరపున వెళ్ళారా..? అంటూ ప్రశ్నలు సంధించారు. వ్యక్తుల భూముల్లోకి వెళ్లి విచారణ చేసే హక్కు వారికి ఎక్కడిది..? అని నిలదీశారు. ఐదు రోజులు తిరిగి వారు సాధించింది ఏంటి..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పర్యటనలను కాంగ్రెస్ వాళ్లే వ్యతిరేకిస్తున్నారని, వాళ్ళ టూర్ సర్కస్‌ను తలపిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఫార్మ్‌హౌజ్‌లకు వెళ్లడం వారి కుటుంబసభ్యులకు కూడా ఇష్టం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సింది ..ప్రైవేట్ ఆస్తుల దగ్గరకు కాదు అని,ప్రజల సమస్యల దగ్గరకు వెళితే బాగుంటుందని అన్నారు.

# నియామక పత్రాలు ఆలస్యం చేయొద్దు

- ఆర్టీసీ సూపర్‌వైజర్ పోస్టులకు ఎంపికైన 186 మందికి నియామక పత్రాల ప్రక్రియ వేగవంతం చేయాలి
- వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గద్వాల్ విజయలక్ష్మి సూచన
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాస్ రావుతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి



హైదరాబాద్ (జనంసాక్షి) :ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ (టీఎస్టీ), మెకానిదకల్ సూపర్‌వైజర్ ట్రైనీ (ఎంఎస్టీ) పోస్టులకు ఎంపికైన 186 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు త్వరగా అందేలా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన లి257వ సీఎం ప్రజావాణిలి కార్యక్రమానికి ూు, మీూ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఎంపిక ప్రక్రియ పూర్తై, ఫలితాలు మే నెలలోనే ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు నియామక ఉత్తర్వులు అందకపోవడంతో తాము తీవ్ర అనిశ్చితి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అభ్యర్థులు వివరించారు. ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో కొంతమంది ఇతర ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలను కూడా వదులుకున్నట్లు తెలిపారు.

### అభ్యర్థుల విజ్ఞప్తిపై స్పందించిన గద్వాల్ విజయలక్ష్మి

పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాస్ రావుతో ఫోన్‌లో మాట్లాడి నియామక ప్రక్రియపై చర్చించారు. లి ఎంపికైన అభ్యర్థులు మరింతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి లివారం రోజుల్లో నియామక పత్రాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటిఫికేషన్ నం. 369/=ectt/Rect. 2/2025 ప్రకారం చేపట్టిన టీఎస్టీ, ఎంఎస్టీ నియామకాలకు సంబంధించి, పరిపాలనా పరంగా సాధ్యమైన మేరకు ఈ పోస్టుల నియామక ప్రక్రియను ఇతర కేడర్ల అంశాలతో ముడిపెట్టకుండా విడిగా ప్రాసెస్ చేయాలని కూడా ఆమె కోరారు. 'ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు కేవలం ఉద్యోగ పత్రాలు మాత్రమే కాదు. వారి కుటుంబాల జీవనోపాధి, ఆర్థిక భద్రతతో ముడిపడి ఉన్న అంశం. అందుకే ఈ సమస్యను మానవతా దృక్పథంతో, త్వరితగతిన పరిష్కరించాలి' అని గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. తమ సమస్యను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చొరవ చూపిన గద్వాల్ విజయలక్ష్మికి ఎంపికైన అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.



## యువ టూరిజం క్లబ్ నృత్య పోటీల్లో దస్తురాబాద్ విద్యార్థుల సత్తా

- జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దస్తురాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): నిర్మల్ జిల్లా కేంద్రంలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి నృత్య పోటీల్లో దస్తురాబాద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో దస్తురాబాద్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. పోటీల్లో దస్తురాబాద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. దీంతో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సమన్వయంతో నృత్య ప్రదర్శన చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల ప్రతిభకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో ప్రదర్శన ఇచ్చి పాఠశాలకు, దస్తురాబాద్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మెడికో-లీగల్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలి

- మాజీ ఎంపీ వినోద్ కుమార్



వరంగల్ (జనంసాక్షి) : మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

దాస్యం వినయ్ భాస్కర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల నివేదికతో పాటు మెడికో-లీగల్ నివేదికను పరిగణనలోకి తీసుకుని, చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని వినోద్ కుమార్ కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, ప్రత్యక్ష సాక్షులు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని ఆయన సూచించారు. ఈ విషయంపై వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని మాజీ ఎంపీ కోరారు. ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా, ఫిర్యాదులు మరియు వైద్య నివేదికల ఆధారంగా చట్టపరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు ప్రజలు, ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా పోరాటం చేశారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పాలన, శాంతియుత వాతావరణం తెలంగాణ సమాజానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అలాంటి రాష్ట్రంలో ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయని ఆరోపణలు రావడం, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారనే ఫిర్యాదులు రావడం ఆందోళనకర అంశమని అన్నారు.

వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అసలు ఏం జరిగిందనే విషయాన్ని స్పష్టంగా నిర్ధారించాలని వినోద్ కుమార్ కోరారు. ఎవరి ప్రమేయం ఉన్నా, విచారణలో ఆధారాలు బయటపడితే వారికి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# పంటలకు నీరు వదలాలని రోడ్డెక్కిన రైతులు

- చెరువు నిండినా పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం
- రెండు రోజుల్లో నిర్ణయం చెబుతామని అధికారుల హామీ



బయ్యారం సెప్టెంబర్ 22(జనంసాక్షి) : బయ్యారం పెద్ద చెరువు నిండుకుండలా ఉన్నప్పటికీ పంటలకు ఎందుకు ఇవ్వరంటూ బయ్యారం పెద్ద చెరువు ఆయా కట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం బయ్యారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పంటలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం బయ్యారం పెద్ద చెరువు తూము ఎత్తి నీటిని విడుదల చేసి, ఒకటి రెండు రోజుల్లోనే ఎందుకు నిలిపివేశారని అధికారులను ప్రశ్నించారు. చెరువులో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ నీరు వదలక పోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు ఇస్తారా ఇవ్వరా..ఇస్తే ఏ తేదీ నుంచి విడుదల చేస్తారో స్పష్టంగా చెప్పాలి అంటూ అధికారులను నిలదీశారు.ఈ సందర్భంగా తీవ్ర హగ్ర హానికి లోనైన రైతుల నీటిపారుదల అధికారుల నిర్లక్ష్యం,అలసత్వం వల్లనే రైతులకు ఈ పరిస్థితి దాపురించిదంటూ ఆరోపించారు. రాస్తా రోకో సందర్భంగా రోడ్ కిరు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో గార్ల బయ్యారం సి ఐ రవీందర్,ఎస్సై ప్రశాంత్ బాబు, ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసిల్దార్ నాగరాజు, సి ఐ రవీందర్, ఏ . ఈ పృథ్వీ రైతులకు సర్ది చెబుతూ మీ సమస్యను అర్థం చేసుకున్నామని సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించిన అనంతరం రెండు రోజుల్లో సాగునీటి విడుదలపై స్పష్టమైన నిర్ణయం తెలియజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకు దిగిన రైతులు రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు తాతా గణేష్,నంబూరి మధు, ముల్కూరి జగ్గన్న, నందగిరి వెంకటేశ్వర్లు,సారిక శ్రీను,ఏనుగుల ఐలయ్య,కత్తి రమేష్ రాజా, తిరుపతి రావు,యరసంగి పాపయ్య,బసవ విశ్వనాదం,ఆకుల యల్లయ్య, సిలివేరు వెంకన్న,తమ్మి శెట్టి లక్ష్మయ్య, రామ చంద్రపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన గ్రామ పరిపాలనాధికారి



భీమిని (జనం సాక్షి) : సాదా బైనామా పట్టా చేయడానికి గ్రామ పరిపాల నాధికారి లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు చిక్కాడు. మంచిర్యాల జిల్లా భీమిని మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన రైతు మహమ్మద్ ఫకీర్‌కు సంబంధించిన సాదాబైనామా పట్టా మార్పిడి చేయించేందుకు జిపివొ దుర్గాప్రసాద్ లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం కార్యాలయం బయట మహమ్మద్ ఫకీర్ నుంచి రూ. 80,000 లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్పీ మధు ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. జిపివొ నుంచి డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# టాటా ఏఐఏ రూ.4.10 కోట్ల క్లెయిమ్ అందజేత

- కేవలం 15 రోజుల్లోనే సెటిల్




ముషీరాబాద్ (జనంసాక్షి) : అత్యవసర సమయాల్లో కుటుంబానికి ఆర్థిక రక్షణ, భరోసా అందించడంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఎంతటి కీలక పాత్ర పోషిస్తుందో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ మరోసారి నిరూపించింది. హిమాయత్ నగర్ బ్రాంచ్‌కు చెందిన సీనియర్ లైఫ్ ప్లానర్ (అడ్వైసర్) కె. ఆనంద్ రెడ్డి 48 ఏండ్ల వయస్సులో టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఆయన 56 ఏండ్ల వయస్సులో ఆకస్మికంగా మృతి చెందగా, ఆయన నామినీ, భార్య అయిన శోభారాణి ఆగస్టు 25న క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాధిత కుటుంబానికి వేగంగా ఆర్థిక సహాయం అందించేందుకు టాటా ఏఐఏ సంస్థ రికార్డు స్థాయిలో కేవలం 15 రోజుల్లోనే క్లెయిమ్ ప్రక్రియ అంతటినీ పూర్తి చేసింది. సెప్టెంబర్ మొదటి వారంలో రూ.4.10 కోట్ల భారీ క్లెయిమ్ మొత్తాన్ని విజయవంతంగా సెటిల్ చేసింది. ఈ సందర్భంగా క్లైమ్ చెక్కు మంగళవారం వారి కుటుంబ సభ్యులకు టాటా ఏఐఏ క్లస్టర్ హెడ్ సూర రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇన్సూరెన్స్ అనేది కేవలం పాలసీ మాత్రమే కాదని, ఆపదలో కుటుంబాలకు రక్షణగా నిలిచే గొప్ప భరోసా అన్నారు. ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్ తో ధీమా కల్పించాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ దయానంద్, బీఏఎంలు కైలాష్, సురేష్, పార్ట్‌నర్ అర్షద్, సీనియర్ బిజినెస్ అసోసియేట్ లీడర్ పుష్ప-అనిల్ కుమార్, లీడర్లు పొడగుర్తి చెంచు రామయ్య(రాము), బధవత్ నవీన్ నాయక్, ఇతర లీడర్లు, అడ్వైజర్లు పాల్గొన్నారు.

# ఖేలో తెలంగాణ -నిరంతర క్రీడా ఉద్యమానికి శ్రీకారం



హైదరాబాద్ (జనంసాక్షి) : క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగాఖేలో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. సచివాలయంలో జరిగినఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జేయేసి రంజన్ స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి మరియు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు. నిరంతర ప్రక్రియ లాగా సాగే ఖేలో తెలంగాణ కార్యక్రమం లో భాగంగా "ఖేలో తెలంగాణ బంధన్" ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం రోజుకు కనీసం 30 నిమిషాలు కేటాయించేలా ప్రజలను ప్రోత్సహించనున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమకు అనువైన శారీరక వ్యాయామాన్ని అలవాటుగా మార్చుకునేలా ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దనున్నారు. "ఖేలో తెలంగాణ బంధన్"లో భాగంగా 9ం9ం9 ఫిట్‌నెస్ ఛాలెంజ్ ను నిర్వహించనున్నారు. వాకింగ్, జాగింగ్, యోగా తదితర కార్యకలాపాల్లో పాల్గొంటూ, వాటికి సంబంధించిన27 సెకండ్ల వీడియోను తమ సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేసి, 9 మంది తమ మిత్రులను ట్యాగ్ చేస్తూ, మరో 9 మందిని ఈ ఛాలెంజ్‌కు ఆహ్వానించే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఒకరి నుంచి మరొకరికి ఈ ఫిట్‌నెస్ సందేశం విస్తరించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. "ఖేలో తెలంగాణ"ను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర క్రీడా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లేలా వివిధ క్రీడాంశాల్లో లీగ్ పోటీలను ప్రోత్సహించనున్నారు. పాఠశాల స్థాయి నుంచి అన్ని వయస్సుల వారికి క్రీడల్లో పాల్గొనే అవకాశాలను పెంచుతూ, వివిధ క్రీడాంశాలపై అవగాహన, ఆసక్తి మరియు ప్రేక్షకాదరణను విస్తరించడమే ఈ లీగ్‌ల ప్రధాన ఉద్దేశం

"ఖేలో తెలంగాణ" ద్వారా ఫిట్‌నెస్‌ను ప్రజల జీవనశైలిలో భాగం చేయడం, క్రీడలను ప్రజలందరికీ చేరువ చేయడం, క్రీడా ప్రతిభకు వేదికలు కల్పించడం, తెలంగాణలో బలమైన క్రీడా సంస్కృతిని నిర్మించడం లక్ష్యంగా దశలవారీగా నిరంతరం కార్యక్రమాలు జరిగేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు క్రీడాభిమానులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత, విద్యాసంస్థలు, క్రీడా సంఘాలు, ఫిట్‌నెస్ ప్రేమికులు, యావత్తు తెలంగాణ క్రీడా సమాజం భాగస్వాములు కావాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్రీడా సలహాదారులు జితేందర్ రెడ్డి క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీ జయష్ రంజన్ స్పోర్ట్స్ ఎండి సోనీ బాలాదేవిలు విజ్ఞప్తి చేశారు.

# ఇష్టంలేని చరణాలు పాడక్కర్లేదు

సంపాదకీయం

వందేమాతరం గీతాన్ని ఎన్ని చరణాలు ఆలపించాలన్నది పౌరుడి వ్యక్తిగత విశ్వాసానికి, విచక్షణకు వదిలేయాలన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛల సారాన్ని గుర్తుచేస్తున్నాయి. గీతంలోని కొన్ని చరణాల్లో దైవ ప్రస్తావన ఉన్నందున వాటిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆలపించాలనే నిబంధన లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి సరిపోదన్న వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకోవడం ప్రాధాన్యమైన విషయం.

ఇష్టం లేని పదాలను పౌరుల నోట్లో బలవంతంగా పలికించడం దేశభక్తి కాదు. అది వ్యక్తి మనసులో నుంచి స్వచ్ఛందంగా వ్యక్తమయ్యే భావన. మెజారిటీ మనోభావాలను గౌరవించడం ఎంత ముఖ్యమో, మైనారిటీల విశ్వాసాలు, ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యం. చట్టం అందరినీ సమానంగా చూడాలి; ఒక వర్గం విశ్వాసాన్ని మరొక వర్గంపై రుద్దే సాధనంగా మారకూడదు.

అరిస్టాటిల్ చెప్పిన సమిష్టి శ్రేయస్సు సూత్రం కూడా ఇక్కడ గుర్తుకు వస్తుంది. పాలన కొందరి మనోభావాలను సంతృప్తిపరచడానికి కాకుండా సమాజంలోని అన్ని వర్గాల హక్కులను కాపాడటానికి ఉండాలి. ఒక వర్గాన్ని నిరంతరం పరాయీకరణకు గురిచేస్తే అది సామాజిక సమైక్యతకు ముప్పుగా మారుతుంది.

అందుకే వందేమాతరం వివాదాన్ని కేవలం ఎన్ని చరణాలు పాడాలన్న ప్రశ్నగా చూడకూడదు. దేశభక్తిని గౌరవించడం, వ్యక్తిగత విశ్వాసాన్ని గౌరవించడం పరస్పర విరుద్ధమైనవి కావు. భిన్న విశ్వాసాలను గౌరవిస్తూ అందరినీ కలుపుకుపోవడమే రాజ్యాంగ లౌకికతకు, ప్రజాస్వామ్యానికి, నిజమైన జాతీయ సమైక్యతకు బలం.

## డీజే మోతలలో యువత గుండె కోతలేనా !

"ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు "

గణేష్ నిమజ్జనాలలో డిజే మోతలు ఏంటి ? డాన్స్ చేసే యువత గుండెల్లో కోతలు ఏంటి ? మనుషులు చేసిన వినాయకుడిని పూజించి అంగ రంగ వైభవముగా ఊరేగించి చెరువులో పడెయ్య డము భక్తి భావన తో చేసే వేడుక.గౌరవించాలి. కాలుష్యం సృష్టించే మన సంస్కృతి మనిషిని మాయం చేసే మన సంప్రదాయం మనకు అవసరమా ! తార్కిక దృష్టి బలముగా ఉంటే మనో భావాలు కూడా మరింత పటిష్టంగా ఉంటాయి కాని బలహీన పడవు కదా ! దేవుడు కోరుకున్న ఆర్భాటమా ? కోరి తెచ్చుకున్న బాధలా ? సాధారణంగా మానవుని చెవులు 70 నుండి 85 డెసిబెల్స్ వరకు శబ్దాలను మాత్రమే తట్టుకోగలదు. కాని డిజే సౌండ్స్ 100 పై చిలుకు డెసిబెల్స్ తో మోతలు మోగడం వలన బ్లడ్ ప్రెషర్ ఒక్కసారిగా పెరిగి గుండె పోటుతో అసువులు కోల్పోతు న్నారు .అధిక శబ్ద తరంగాలు మెదడు పై తీవ్ర ఒత్తిడి కలిగించి అనేక రుగ్మతలకు దారి తీస్తున్నాయి. దేవుడిని ఆరాధించే పద్ధతులు ప్రాణాలు తీస్తే ఇంకేముంది. సంతోషంతో పాటు ఆనందడం ఇంటిల్లిపాదిలో వెల్లివిరియాలి. కాని అదెక్కడా కానరాదే! ఏదో ఒక చోటి అపశృతి చోటుచేసు కుంటుంది.అంతా మనిషి చేసుకున్న స్వయంకృతాపరాధం. చేసుకున్నోనికి చేసుకున్నంత జరుగు తుంది .మనకు మనమే ప్రశ్నించుకొవాలి నిండా నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలి అటువంటి జీవన శైలి మనకు ఉండాలి మనలో నిబిడీకృతమైన శక్తిని యుక్తి వెలికి తీయాలి .అదే దేవుడిచ్చిన వరంగా భావించాలి. డిజేల పై నిషేధం ఉన్న అమలు చేసి కఠిన చర్యలు తీసుకునే దెక్కడా? ఈ చావు శబ్దాలకు బాధ్యులు ఎవరు? అనుమతి ఇవ్వాలని సిఫారస్ చేసిన రాజకీయ నాయకులా? చూసి చూడనట్లు ఉండే సంబంధిత ఉన్నతాధికారులా? లేక ఉత్సవాలను ప్రోత్సహించే ప్రభుత్వానిదా? అసలు ఎవరు బాధ్యులు? ఈ ప్రశ్నకు సమాధానం మనలోనే దాగిఉంది. శబ్ద కాలు ష్యం సృష్టించకుండా పండుగల సంబరాలు జరుపుకోరాదా? ప్రార్ధనా మందిరాలలో మార్మోగే మైకు లు ఉంటేనే దేవునికి చెవులు వినబడుతాయా?భక్తిని చాటి చెబుతాయా? ఇది మతాలను అవ మానించడం అనుకుంటే పొరపాటే అవుతుంది.అందుకే అన్నారు "యదార్థవాదిలోక విరోధి" అని. ,,

ఒక దిక్కు పంచభూతాలు కాలుష్యమై మనిషిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే మరో దిక్కు ఎల్ నినో ప్రభావంతో ఋతువులు గతులు తప్పి కరువు కరాళ నృత్యం చేస్తుంటే ఇంకో వైపు ప్రజా సంక్షేమం పక్కకు పెట్టి అసెంబ్లీని వేదిక చేసుకొని ఒకరి పై ఒకరు దుమ్మెత్తి పోసుకొంటున్నారు. ఉచిత పథకాలతో ప్రభుత్వ ఖజానా ఖాళీ.గ్యారంటీలకు గ్యారెంటీ లేని ఆర్థిక వ్యవస్థ .అప్పుల బాటలో ప్రభుత్వాలు. అభివృద్ధి లెక్కలు చెప్పేవి అంకెల గారడి మాత్రమే అని నిపుణులు చెబుతున్నారు.ఈ క్లిష్ట సమయములో జెన్‌జీల ప్రవేశం దేశానికే శుభ పరిణామం. యువత శక్తి డిజే సౌండ్స్‌తో బలి కావద్దు .యువతరం దేశ భవిష్యత్తుకు చక్కటి ఆశాకిరణం చట్టాలు పాలకులు చేయలేని పనులు ఉడుకు రక్తం తోనే సాధ్యం అవుతుందని రుజువుచేశారు. నిండు ప్రాణాలు బలి తీసుకునే డీజే సౌండ్స్ నిషేధించాలి. ఉత్సవాల నిర్వాహకులు ప్రభుత్వాలు చొరవ తీసుకొని శబ్ద కాలుష్య నివారణకు నడుం బిగించాలి. అందరం కలిసి ఐక్యంగా ఉండి దేశాన్ని అన్ని కోణాలలో అభివృద్ధి చేద్దాం రండి.

పూసాల సత్యనారాయణ, 9000792400

# అయోధ్యలో చందా చోరీకి- అసలు బాధ్యులు ఎక్కడ?



అయోధ్య రామమందిరం దేశంలోని అత్యంత ప్రాధాన్యమైన ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఒకటిగా మారింది. ప్రతిరోజూ భారీ సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తున్నారు. ఇలాంటి స్థలంలో భక్తులు సమర్పించే ప్రతి రూపాయి, ప్రతి గ్రాము బంగారం, ప్రతి వెండి కానుక భక్తి విశ్వాసానికి ప్రతీక మాత్రమే కాదు, నిర్వహణ సంస్థకు అప్పగించిన ప్రజా నమ్మకానికి సంబంధించిన ఆస్తి కూడా. అందుకే ఆలయ విరాళాల లెక్కల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు సాధారణ ఆర్థిక అవకతవకలుగా చూడలేం. తాజాగా ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్‌ఐటీ) 105 అనుమానాస్పద నగదు తొలగింపు ఘటనలను గుర్తించినట్లు సుప్రీంకోర్టుకు తెలియజేయడం ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రమైనదిగా చేసింది. అయితే ఇవి దర్యాప్తులో గుర్తించిన ఆరోపణలు, తుది న్యాయపరమైన నిర్ధారణలు కావన్న విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి.

ఇక్కడ అసలు ప్రశ్న "ఎంత డబ్బు పోయింది?" అనే ఖచ్చితమైన లెక్కలు ఇంతవరకు ట్రస్ట్ సభ్యులు కానీ, సిట్ కానీ తేల్చలేదు. ఇది ఒక్కటే కాదు. ఇంత పెద్ద స్థాయిలో విరాళాలు వస్తున్న సంస్థలో అంతర్గత నియంత్రణ వ్యవస్థలు ఎంత బలంగా ఉన్నాయి? నగదు లెక్కింపు ప్రక్రియకు ఎవరు బాధ్యత వహిస్తున్నారు? సీసీటీవీ పర్యవేక్షణ ఎలా జరిగింది? ఉద్యోగుల ప్రవేశ, నిష్క్రమణ సమయంలో తనిఖీలు ఎందుకు కఠినంగా అమలు కాలేదు? నగదును లెక్కించే సమయంలో వ్యక్తిగత వస్తువులను లోపలికి తీసుకెళ్లకుండా ఉన్న నిబంధనలు ఎందుకు పాటించబడలేదు? మొదలైన సాధారణ ప్రశ్నలకు కూడా అధికారికంగా ఎవరూ ఇంత వరకు ప్రకటన వెలువడలేదు. ఇవే ఇప్పుడు హిందూ భక్తుల ముందుకు వస్తున్న కీలక ప్రశ్నలు. జూలైలో వెలుగులోకి వచ్చిన తొలి ఎస్.ఐ.టీ. (సిట్)నివేదికలో 45 రోజుల సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి 70 అనుమానాస్పద నగదు దుర్వినియోగ ఘటనలను గుర్తించినట్లు వెల్లడైంచారు. పర్యవేక్షణ లోపాలు, సీసీటీవీ బ్లైండ్‌స్పాట్లు, తనిఖీల బలహీనత, నగదు లెక్కింపులో విధివిధానాల ఉల్లంఘనలను కూడా నివేదిక ప్రస్తావించింది.

అయితే ఇప్పుడు తాజాగా దర్యాప్తులో ఆ సంఖ్య 105 ఘటనలకు పెరిగినట్లు సిట్ చెపుతుంది. గతంలో ఇదే సిట్ 70 అనుమానాస్పద నగదు దుర్వినియోగ ఘటనలు జరిగినట్లు నిర్ధారించింది.అయితే సీసీటీవీ దృశ్యాలు, సాక్షుల వాంగ్మూలాలు, విరాళాల రికార్డులు, బ్యాంకు జమ వివరాలు వంటి ఆధారాలను కలిపి పరిశీలించిన తర్వాత ఈ కొత్త సంఖ్య వెల్లడైనట్లు సుప్రీంకోర్టుకు సమర్పించిన స్థితిగతుల నివేదికలో (స్టేటస్ రిపోర్ట్)లో పేర్కొన్నట్లు వార్తా నివేదికలు తెలిపాయి. అంటే ప్రారంభ దర్యాప్తులో బయటపడిన 70 ఘటనలతో వ్యవహారం పూర్తిగా ముగిసిపోలేదు. మరింత విస్తృతమైన పరిశీలనలో అదనపు ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల సెప్టెంబర్ 25లోగా తొలి చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.

ఈ పరిణామంలో మరో ముఖ్యమైన అంశం ఆలయ ఆర్థిక వ్యవస్థ పరిమాణం. 2025--26 ఆర్థిక సంవత్సరంలో ట్రస్ట్‌కు విరాళాల ద్వారా సుమారు రూ.98.24 కోట్లు వచ్చినట్లు, పెట్టుబడులపై వడ్డీ ద్వారా రూ.151.80 కోట్లు వచ్చినట్లు అందుబాటులో ఉన్న ఆర్థిక వివరాలను ఉటంకిస్తూ హిందుస్తాన్ టైమ్స్ తెలిపింది. అదే సమయంలో ట్రస్ట్ మొత్తం నిధి నిల్వ సుమారు రూ.1,876.30 కోట్లకు చేరినట్లు నివేదించింది. ఇది చిన్న స్థాయి ధార్మిక సంస్థ కాదు; వందల కోట్ల రూపాయల ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే పెద్ద సంస్థగా మారిన వాస్తవాన్ని సూచిస్తుంది.

భక్తుల నుంచి వస్తున్న విలువైన కానుకల పరిమాణం కూడా తక్కువ కాదు. ట్రస్ట్ తెలిపిన వివరాల ప్రకారం, 2026 మార్చి 31 నాటికి 32.259 కిలోలకుపైగా బంగారంలాంటి వస్తువులు, 1,518 కిలోలకుపైగా వెండిలాంటి వస్తువులు తమ వద్ద ఉన్నాయని ట్రెజరర్ వెల్లడించారు. అదే సమయంలో తాజా ఎ సిట్ విచారణలో 200 కిలోల వెండి ఇటుకలు, 38.288 కిలోల వెండి ఇటుకలు, ఇతర వెండి కానుకల నిర్వహణలో ఎలాంటి వ్యత్యాసాలు కనిపించలేదని సుప్రీంకోర్టుకు నివేదించినట్లు, "ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్" తెలిపింది. అందువల్ల సామాజిక మాధ్యమాల్లో వ్యాపించే ప్రతి ఆరోపణను నిజమని కానీ, అబద్ధమని కానీ అభావించడం కూడా సరికాదు; ఏది నిర్ధారిత లోపం, ఏది ఆరోపణ అన్న తేడా స్పష్టంగా ఉండాలి. కానీ ఇంత పెద్ద నేరం జరిగినప్పు, ప్రత్యేకంగా ఈ కేసు కోసమే సిట్ ను ఏర్పాటు చేసిన తర్వాత కూడా విచారణలో ఇంత జాప్యం ఎందుకు జరుగుతుంది? అసలు బాధ్యులు ఎవరు? ఈ చోరీ వెనుక ఎవరి హస్తం ఉంది? ఈ నిజాలు బయటకు రాకుండా ఎవరు అడ్డుపడుతున్నారు? అసలు సిట్ రిపోర్ట్ లో ఏముంది? అనే ఆందోళన, ఉత్కంఠ హిందూ భక్తుల్లో పెరిగిపోతోంది.

అయోధ్యకు భక్తుల రాక కూడా నిర్వహణ వ్యవస్థకు పెరుగుతున్న సవాలును చూపుతోంది. 2026 శ్రావణ మాసంలోనే 35 లక్షలకు పైగా భక్తులు అయోధ్యకు వచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఒక సోమవారం సుమారు ఆరు లక్షల మంది వరకు రావడం వల్ల భద్రత, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాల నిర్వహణపై ఒత్తిడి పెరిగింది. ఇంతటి భారీ భక్తుల ప్రవాహం ఉన్న చోట నగదు, విలువైన కానుకలు, సిబ్బంది నిర్వహణ, భద్రతా వ్యవస్థలను కూడా అదే స్థాయి వృత్తిపరమైన ప్రమాణాలతో నిర్వహించాల్సిన అవసరం ఉంది కదా!?.

ఇక్కడ మరో ఆందోళనకరమైన విషయం గతంలోనే పరిపాలనా విధానాలపై వ్యక్తమైన హెచ్చరికలు. 2020లో నిర్వహించిన ఆడిట్‌లో విరాళాల నిర్వహణకు వ్యవస్థీకృత రికార్డు, ప్రతి దశలో బాధ్యతను నిర్ధారించే స్పష్టమైన విధివిధానాలు అవసరమని సూచించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఆ సూచనలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్న ఆరోపణలు ఇప్పుడు వెలుగులోకి వచ్చిన ఘటనల నేపథ్యంలో పరిశీలనకు వస్తున్నాయి. ఒక సంస్థకు ప్రమాదం జరిగిన తర్వాత నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడం కంటే, ప్రమాదం జరగకుండా ముందుగానే పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించడం పరిపాలనా బాధ్యత కాదా!?.

ఈ చోరీ తర్వాత అధికారిక ప్రకటన అయితే ఎక్కడా లభించటం లేదు. కానీ స్థానిక వ్యాపారులు, హోటళ్ళు ఇతర స్థానిక రైల్వే సిబ్బంది మాత్రం భక్తులు, ఇతర టూరిస్ట్ ల సంఖ్య బాగా తగ్గినట్లు, తమ ఆదాయం తగ్గినట్లుగా వ్యాపారులు చెప్పినట్లు స్థానిక పత్రికలు, మీడియా తెలిపినట్లు తెలుస్తోంది. (ఇవి కేవలం అనధికార వార్తలే) అందువల్ల ముందున్న పరిష్కారం వ్యక్తులపై, సంస్థలపై ఆరోపణలు చేయడం మాత్రమే కాదు; వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి విధివిధానాలను మార్చడం అవసరం. నగదు లెక్కింపును పూర్తిగా డిజిటల్ రికార్డింగ్‌తో అనుసంధానం చేయాలి. ప్రతి హుండీకి ప్రత్యేక లెక్క, ప్రతి లావాదేవీకి డిజిటల్ ట్రయిల్, కనీసం 180 రోజుల సీసీటీవీ ఫుటేజీని నిల్వ చేయాలి, స్వతంత్ర ఆడిట్, సిబ్బంది ప్రవేశ--నిష్క్రమణకు బయోమెట్రిక్ వ్యవస్థ, క్రమం తప్పని ఆకస్మిక తనిఖీలు, బ్యాంకు-ట్రస్ట్-ఆడిటర్ మధ్య బాధ్యతల విషయంలో స్పష్టమైన విభజన అవసరం. విలువైన బంగారం, వెండి కానుకలకు కూడా స్వతంత్ర బరువు, స్వచ్ఛత నిర్ధారణ, భద్రపరిచే విధానం ఉండాలి. జూలైలోనే ట్రస్ట్ బంగారం, వెండి కానుకల పరిమాణం, స్వచ్ఛతను అంచనా వేయడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన మింట్‌తో శాశ్వత ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నట్లు ఆకాశవాణి నివేదించింది.

చివరికి ఇది రామమందిరం గురించిన రాజకీయ వివాదం కంటే కూడా పెద్ద పరిపాలనా సంబంధమైన ప్రశ్న. భక్తులు సమర్పించే విరాళం వారి విశ్వాసంతో వచ్చినది. ఆ విశ్వాసాన్ని కాపాడటం ఆలయ నిర్వహణకు అత్యున్నత బాధ్యత. 105 ఘటనలు దర్యాప్తులో గుర్తించబడ్డాయన్న సమాచారం నిజమైతే, ప్రతి ఘటన వెనుక ఉన్న వ్యక్తిగత బాధ్యతను చట్టపరంగా నిర్ధారించడం ఎంత అవసరమో, అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా సంస్థాగత నియంత్రణలను ఏర్పాటు చేయడం అంతకంటే అవసరం. భక్తి ఎంత పవిత్రమైనదైనా, దానిని నిర్వహించే వ్యవస్థలో పారదర్శకత ఉండాలి, లెక్కలు, ఆడిట్, జవాబుదారీతనం లేకపోతే భక్తులు మనో భావాలు దెబ్బతింటాయి. విశ్వాసానికి విఘాతం కలుగుతుంది. అందుకే అయోధ్య ఇప్పుడు ఒక కీలక పరీక్షను ఎదుర్కొంటోంది---భక్తుల విశ్వాసాన్ని కేవలం ఆధ్యాత్మికంగా కాకుండా, పరిపాలనా పారదర్శకతతో కూడా నిలబెట్టగలదా!?



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## ఇప్పటికీ ఇప్పుడు అయితే...!

ఇప్పటికీ
ఇప్పుడు
ఒక వెయ్యి పోరాటాలు
జరిగి ఉంటాయి ఏమో!
ఓడిపోయాను, అనుకున్నప్పుడల్లా
గెలుపు వాక్యం, తడబడుకుంటూనే
చివరి ఒక విత్తనం
నాటి పోతుంది లోపల దూరి.
అందరూ మనిషి ముఖాలు
తగిలించుకున్న వారే
నాతో సహా!
అప్పుడప్పుడు
ముఖాలు
మరో రూపంలో కనిపిస్తుంటాయి
ఎందుకో, నాతో సహా!
కాలం వెంట జీవితం
నది అలా చేసి నడుస్తున్నందుకేమో
కాలం విసురుతున్న పోరులో
ఉన్నందుకేమో!
మనిషి
లోపలి
ముఖం, ఇట్లే కనిపిస్తుంది
ఒకరోజు ముందుగానే.
ఇక శత్రువు వద్దురా!
యుద్ధం వద్దు!
అనుకున్నప్పుడల్లా,
ఏదో రూపం మార్చుకుంటూ
వస్తూనే ఉంటారు
గీత యుద్ధ అంచులు గీసి.
ఏమో
ఇప్పటికీ
ఇప్పుడైతే...,
నేను గెలుస్తూనే ఉన్నా!
మౌనంతో, కాస్త మాటతో..,
నా ప్రాణ కవిత్వంతో..,
నా ప్రియ పాటతో..,
వెయ్యి పోరాటాల విజేత కలం వీరుడిగా!

జనజ్వాల
9949163770

## బరువైన భావంతో

ఆలోచిస్తూ కూర్చున్నాను
కిటికీ గుండా వీస్తున్న తుఫాను గాలికి
కొట్టుకుపోతూ
బరువైన భావంతో రాస్తేనే
కాగితం మిగిలేది
అనువాదం/ కోటం చంద్రశేఖర్
కన్నడ కవయిత్రి /దేశెట్టి పద్మ

అముద్రితం

# సమానత్వం కోసం సమరూపత అవసరమా?

*ఆదేశిక సూత్రం వర్సెస్ ప్రాథమిక హక్కు- 44వ అధికరణ కోరుకుంటున్న ఏకరూప పౌర స్మృతికి, 25వ అధికరణ ఇచ్చిన మత స్వేచ్ఛ హామీకి, 29వ అధికరణ ఇచ్చిన సాంస్కృతిక పరిరక్షణ హామీకి మధ్య రాజ్యాంగమే లోలోపల సాగిస్తున్న సంఘర్షణ*

ముంబైలో సెప్టెంబర్ 13న కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ఒక ప్రకటనతో దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) చర్చ మళ్లీ తెరమీదకు వచ్చింది. 2029 లోక్‌సభ ఎన్నికలలోపు, బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) పాలిత 21 రాష్ట్రాల్లోనూ యూసీసీ అమలులోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ దశాబ్దాలుగా అనుసరిస్తున్న సైద్ధాంతిక వైఖరికి కొనసాగింపే అయినా, ఒక స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించడం ఇదే తొలిసారి. దేశంలో మొదటిసారిగా యూసీసీని అమలు చేసిన రాష్ట్రంగా ఉత్తరాఖండ్ 2025 జనవరి 27న రికార్డులకెక్కింది. ఆ తర్వాత గుజరాత్ (మార్చి 24, 2026), అస్సాం (మే 27, 2026), మధ్యప్రదేశ్ (జూలై 21, 2026) శాసనసభలు తమ తమ యూసీసీ బిల్లులను ఆమోదించాయి. అయితే ఈ మూడు బిల్లులూ ఇప్పటికీ రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం ఎదురుచూస్తున్నాయి. రాజస్థాన్ ఆగస్టు 21న తన బిల్లును సభలో ప్రవేశపెట్టినా, ఇంతవరకూ చర్చకు నోచుకోలేదు. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలు కూడా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలోని కమిటీలను ఏర్పాటు చేసుకున్నాయి.

ఈ పరిణామాలను అర్థం చేసుకోవాలంటే, ముందుగా వ్యక్తిగత చట్టాల నేటి స్వరూపం ఏమిటో చూడాలి. వాస్తవానికి నేరచట్టాల నుంచి ఒప్పందాలు, క్రయవిక్రయ పత్రాల వరకూ యావత్ దేశానికి ఇప్పటికే ఉమ్మడి చట్టాలు అమలులో ఉన్నాయి. సమస్యంతా వివాహం, విడాకులు, ఆస్తి వారసత్వం వంటి కుటుంబ సంబంధిత విషయాల్లోనే. ఇక్కడ ఒక్కో మతసమూహం ఒక్కో చట్టాన్ని అనుసరిస్తుంది. హిందువులకు హిందూ వివాహ చట్టం (1955), హిందూ వారసత్వ చట్టం (1956) వర్తిస్తే, జైనులు, బౌద్ధులు, సిక్కులు కూడా న్యాయపరంగా హిందూ చట్టాల పరిధిలోకే వస్తారు; సిక్కు వివాహాలను ఆనంద్ వివాహ చట్టం (2012) కింద ప్రత్యేకంగా నమోదు చేసుకునే వెసులుబాటు మాత్రం ఉంది. క్రైస్తవులు, పార్శీలకు వారి సొంత వ్యక్తిగత చట్టాలుండగా, ముస్లింలకు 1937నాటి ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ చట్టం వర్తిస్తుంది. గిరిజన సమూహాలకైతే రాజ్యాంగపరమైన మినహాయింపుల కింద తమ ఆచార చట్టాలను పాటించే స్వేచ్ఛ ఉంది. రాజ్యాంగంలోని 44వ అధికరణ పౌరులందరికీ ఉమ్మడి పౌర స్మృతిని సాధించేందుకు రాజ్యం కృషి చేయాలని నిర్దేశిస్తుంది గానీ, ఇది న్యాయబద్ధత లేని 'రాజ్య నిర్దేశక సూత్రాల' (పార్ట్ IV) పరిధిలో ఉన్న ఆదేశిక సూత్రం మాత్రమే.

ఈ బహుళత్వం కొత్తగా పుట్టుకొచ్చింది కాదు- రాజ్యాంగ పరిషత్‌లోనే దీనిపై తీవ్రమైన చర్చ జరిగింది. పౌర చట్టాల్లో ఏకరూపతను, మహిళలకు సమాన హక్కులను భరోసా ఇచ్చేందుకు దీన్ని ప్రాథమిక హక్కుగా చేర్చాలని కొందరు సభ్యులు వాదించగా, ముస్లిం సభ్యుల్లో అత్యధికులు అందుకు విముఖత చూపారు- పార్ట్ III కింద హామీ ఇచ్చిన మత స్వేచ్ఛ హక్కుకు ఇది భంగం కలిగిస్తుందన్నది వారి వాదన. చివరకు యూసీసీని ఆదేశిక సూత్రాల్లో చేర్చడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రస్తావనార్హం- ఆయన యూసీసీకి మద్దతిచ్చినా, తొలుత దీన్ని స్వచ్ఛందంగా ఉంచొచ్చని, తమకు కట్టుబడి ఉండేందుకు అంగీకరించే పౌరులకు మాత్రమే పార్లమెంటు దీన్ని వర్తింపజేయవచ్చని సూచించారు.

ఆనాటి నుంచి ఈనాటి వరకూ, యూసీసీ మద్దతుదారులు ప్రధానంగా రెండు వాదనలు వినిపిస్తూ వస్తున్నారు. మొదటిది లౌకికవాద వాదన- పౌరులందరినీ ఒకే వ్యక్తిగత చట్టాల పరిధిలోకి తీసుకురావడం ద్వారానే భారత్ నిజమైన అర్థంలో లౌకిక రాజ్యంగా నిలుస్తుందన్నది వీరి భావన. రెండోది, అత్యంత కీలకమైనది- లింగ న్యాయం. వివాహం, విడాకులు, భరణం, వారసత్వం వంటి అంశాల్లో మతాలవారీగా మహిళలకు లభించే హక్కుల్లో ఉన్న అసమానతలను సరిచేసేందుకు ఒకే చట్టం అవసరమని వీరి వాదన. ఈ వాదనలకు దీటుగా వ్యతిరేకుల వాదనలు కూడా అంతే బలంగా ఉన్నాయి. రాజ్యాంగంలోని 25వ అధికరణ మతాచరణ హక్కును, 29వ అధికరణ సామాజిక వర్గాల సాంస్కృతిక పరిరక్షణ హక్కును కల్పిస్తున్నాయి కాబట్టి, వ్యక్తిగత చట్టాల్లో యూసీసీ జోక్యం మతగ్రంథాలు, సాంస్కృతిక ఆచారాలతో ఢీకొనే ప్రమాదం ఉందని విమర్శకుల మొదటి వాదన. రెండోది- ఇప్పటికే యూసీసీని ఆమోదించిన నాలుగు రాష్ట్రాలూ గిరిజన సమూహాలను దీని పరిధి నుంచి మినహాయించాయి, గిరిజన సంస్కృతికి రాజ్యాంగపరమైన రక్షణలు, వారి ఆచార చట్టాల్లో మహిళలకు తగినంత హక్కులు ఇప్పటికే ఉన్నాయన్నది ఇందుకు కారణం. అయితే ఒక వర్గాన్ని మినహాయిస్తూ, మతపరమైన మైనారిటీలతో సహా మిగతా అందరికీ దీన్ని తప్పనిసరి చేయడం స్వయంగా వివక్షాపూరితమేనని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు- రాష్ట్ర జనాభాలో 12.45 శాతంగా ఉన్న షెడ్యూల్డ్ తెగలను మినహాయించిన అస్సాం బిల్లు ఇందుకు తాజా ఉదాహరణ.

ఈ రెండు వాదనల మధ్య నలుగుతున్న సమయంలోనే, చర్చకు ఒక కొత్త న్యాయసూత్రం జోడైంది. మత స్వేచ్ఛ హక్కు (ఆర్టికల్ 25) సంపూర్ణమైనది కాదు, రాజ్యాంగ నైతికత, సమానత్వం వంటి ఇతర ప్రాథమిక హక్కులకు ఇది లోబడి ఉంటుంది. 1955నాటి పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ చెల్లుబాటుపై 2024లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో- కులవివక్ష, లింగవివక్ష వంటి ఆచారాలు రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి విరుద్ధమైనవి కాబట్టి వాటికి ఆర్టికల్ 29 కింద రక్షణ లభించదని స్పష్టం చేసింది. ఈ తర్కాన్ని అనుసరిస్తే, మహిళల సమానత్వాన్ని పరిరక్షించే వ్యక్తిగత చట్ట సంస్కరణలను మత స్వేచ్ఛపై దాడిగా చూడాల్సిన అవసరం లేదు- అవి రాజ్యాంగ నైతికతలో అంతర్భాగమైన సమానత్వాన్నే ముందుకు తీసుకెళ్తున్నాయని ఈ వాదన సారాంశం. అయినప్పటికీ, మైనారిటీలలో- ముఖ్యంగా ముస్లిం సమాజంలో- యూసీసీపై నెలకొన్న అపనమ్మకం ఇప్పటికీ చెక్కుచెదరలేదు.


అయితే యూసీసీయే ఏకైక పరిష్కారమా అంటే అధికారిక వర్గాల్లోనే భిన్నాభిప్రాయం ఉంది. 2018లో కుటుంబ చట్టాల సంస్కరణపై విడుదల చేసిన సంప్రదింపు పత్రంలో లా కమిషన్- ప్రస్తుత దశలో యూసీసీ అవసరం లేదని, అది కోరదగినది కూడా కాదని అభిప్రాయపడింది.




బదులుగా ప్రతి మత వ్యక్తిగత చట్టంలో ఉన్న వివక్షాపూరిత నిబంధనలను విడివిడిగా సంస్కరించాలని సూచించింది. మతసమూహాల మధ్య ఏకరూపత కంటే, ప్రతి సమాజం లోపలే స్త్రీ పురుషుల మధ్య సమానత్వం సాధించడానికే ప్రాధాన్యం ఇవ్వాలని కమిషన్ నొక్కిచెప్పింది- వివాహం, విడాకులు, సంరక్షణ, దత్తత, వారసత్వం, భరణం వంటి ప్రతి అంశంలోనూ నిర్దిష్ట శాసనమార్పులను ప్రతిపాదిస్తూ.

జాతీయస్థాయిలో ఈ చర్చ ఇలా సాగుతుండగా, తెలంగాణలో పరిస్థితి మరింత భిన్నంగా ఉంది. ఇప్పటివరకూ యూసీసీని ఆమోదించిన నాలుగు రాష్ట్రాలూ బీజేపీ ఏకపక్ష అధికారంలో ఉన్నవే. 2023 డిసెంబర్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తెలంగాణ, అమిత్ షా ప్రస్తావించిన 21 ఎన్డీయే రాష్ట్రాల జాబితాలో లేదు. కాబట్టి రాష్ట్రస్థాయిలో యూసీసీ దిశగా అడుగులు పడాలంటే అది కేంద్ర ఒత్తిడి కంటే తెలంగాణ సొంత ఎన్నికల రాజకీయాలపైనే ఆధారపడి ఉంటుంది. అయినప్పటికీ ఈ అంశం తెలంగాణ రాజకీయాల్లో పదేపదే ప్రస్తావనకు వస్తూనే ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో, అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో యూసీసీ అమలుకు కమిటీ వేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది; ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో ఆ హామీ అమలుకు నోచుకోలేదు. అయినా రాష్ట్ర బీజేపీ ఈ డిమాండ్‌ను వదల్లేదు- రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఇటీవల మరోసారి యూసీసీ అమలును కోరుతూ, గిరిజన ఆచారాలకు మినహాయింపునిస్తూనే మహిళలు, పిల్లలకు ఆస్తి, దత్తత హక్కుల్లో స్పష్టత తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 15న రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్, యూసీసీ హిందువులకు గానీ ముస్లిం లకు గానీ వ్యతిరేకం కాదని, పౌరులందరికీ సమాన హక్కులు కల్పించడమే దీని లక్ష్యమని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శలను తిప్పికొట్టారు. ఒవైసీ మాత్రం యూసీసీపై మొదటి నుంచీ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూనే ఉన్నారు- ఇది వాస్తవానికి 'హిందూ' పౌర స్మృతి అని, గిరిజనులను మినహాయిస్తూ మతపరమైన మైనారిటీలపైనే దీన్ని రుద్దాలని చూస్తున్నారని ఆయన ఎప్పటినుంచో విమర్శిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు కూడా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధి బృందంతో భేటీ అనంతరం, యూసీసీని ప్రజలను చీల్చే ప్రయత్నంగా అభివర్ణిస్తూ తమ పార్టీ పూర్తి వ్యతిరేకతను ప్రకటించారు. అంటే తెలంగాణలో ఈ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ నాలుగు పార్టీలదీ వేర్వేరు వైఖరి- ఇతర రాష్ట్రాల్లో కనిపించే బీజేపీ వర్సెస్ మైనారిటీ వర్గాల ద్విముఖ పోరు ఇక్కడ నాలుగు కోణాలుగా విడిపోయింది. ఈ రాజకీయ సంక్లిష్టతకు మూలం తెలంగాణ ప్రత్యేక సామాజిక పటంలోనే ఉంది. 2025 ఫిబ్రవరిలో శాసనసభలో ప్రవేశపెట్టిన కుల గణన నివేదిక ప్రకారం, రాష్ట్ర జనాభాలో ముస్లింలు 12.56 శాతం (వెనుకబడిన తరగతుల ముస్లింలు 10.08 శాతం, ఇతర ముస్లింలు 2.48 శాతం), షెడ్యూల్డ్ తెగలు 10.45 శాతం, షెడ్యూల్డ్ కులాలు 17.43 శాతం, ముస్లిమేతర వెనుకబడిన తరగతులు 46.25 శాతంగా నమోదయ్యాయి. దక్షిణాదిలోనే అత్యధిక ముస్లిం జనాభా నిష్పత్తి కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి- హైదరాబాద్ పాతబస్తీ వంటి ప్రాంతాల్లో ఈ జనాభా కేంద్రీకృతమై ఉంటే, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గణనీయమైన గిరిజన జనాభా ఉంది. అంటే జాతీయస్థాయి చర్చ ప్రధానంగా హిందూ-ముస్లిం చట్రంలో నడుస్తుంటే, తెలంగాణలో గిరిజన మినహాయింపు అనే మూడో పొర కూడా దీనికి జతపడుతుంది. ఒవైసీ లేవనెత్తుతున్న 'ఎంపిక ధోరణి' విమర్శకు తెలంగాణలో మరింత బలం చేకూరే అవకాశం ఉంది, ఎందుకంటే ఇక్కడి గిరిజన, ముస్లిం సమూహాలు రెండూ సంఖ్యాపరంగా, రాజకీయంగా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నాయి. ఏదైనా భవిష్యత్ ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయాలనుకుంటే, జాతీయ నమూనాను యథాతథంగా అమలు చేయడం కంటే తెలంగాణ ప్రత్యేక సామాజిక సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది.

ఈ యావత్ చర్చను వెనక్కి తిరిగి చూస్తే, అది రెండు రాజ్యాంగ విలువల మధ్య ఘర్షణగా మిగిలిపోతున్నట్టు కనిపిస్తుంది- ఒకవైపు 44వ అధికరణ నిర్దేశించిన ఏకరూప పౌర చట్టం లక్ష్యం, మరోవైపు 25, 29 అధికరణలు కల్పించిన మత, సాంస్కృతిక స్వేచ్ఛ హక్కులు. మహిళల సమాన హక్కుల కోణం నుంచి చూస్తే వ్యక్తిగత చట్టాల్లో సంస్కరణ ఆవశ్యకతను కాదనలేం, కానీ అది ఏకైక ఉమ్మడి చట్టం రూపంలోనే రావాలా, లేక ప్రతి మత చట్టంలోనూ వివక్షను తొలగించే ప్రత్యేక సవరణల రూపంలో రావాలా అన్నది ఇంకా తేలని ప్రశ్న. ప్రస్తుతం రూపొందుతున్న 'ఉమ్మడి' చట్టాలే రాష్ట్రానికో రూపంలో, గిరిజన మినహాయింపులతో ముక్కలు ముక్కలుగా తయారవుతుండటం- ఇది సాధించాలనుకుంటున్న ఏకరూపతకే ఒక వైరుధ్యంగా నిలుస్తోంది. 2029 గడువు సమీపిస్తున్న కొద్దీ న్యాయస్థానాలు, శాసనసభలు, పౌర సమాజం మధ్య ఈ చర్చ మరింత తీవ్రతరం కావడం ఖాయం. ఒకే దేశం అన్న ఆకాంక్ష నెరవేరాలంటే, ఎన్ని చట్టాలు కలవాలో, ఎన్ని చోట్ల వైవిధ్యానికి చోటివ్వాలో తేల్చాల్సింది ఇప్పుడే- మరీ ముఖ్యంగా, తెలంగా ణ వంటి బహుళ సామాజిక పొరలున్న రాష్ట్రాల్లో.



మంచాల కిరణ్ కుమార్
(Ph.D), UGC NET-SRF స్కాలర్,
డిపార్ట్మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఉస్మానియా విశ్వవిద్యాలయం.

# చేనేత కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు మాఫీ చేయాలి
- వనం శాంతికుమార్



**ముషీరాబాద్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, విజయదశమి పండుగను వారు సంతోషంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలపై ఉన్న సుమారు రూ.50 కోట్ల క్యాష్ క్రెడిట్ రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఈమెరకు మంగళవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వనం శాంతికుమార్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో చేనేత రంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్రిఫ్ట్ పథకంలో చేనేత కార్మికులు 17 నెలలుగా తమ వాటాను జమ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కేవలం రెండు నెలలకు మాత్రమే సంబంధించిన మొత్తాన్ని జమ చేసిందన్నారు. మరో ఆరు నెలల్లో పథకం పూర్తికానున్నందున ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న 15 నెలల రికరింగ్ డిపాజిట్ మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. చేనేత పారిశ్రామిక సహకార సంఘాలు క్యాష్ క్రెడిట్ రుణాల భారంతో నష్టాల్లో కూరుకుపోయి, కార్యకలాపాలను కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘాలపై ఉన్న సుమారు రూ.50 కోట్ల క్యాష్ క్రెడిట్ రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమ, మైనార్టీ గురుకుల పాఠశాలల విద్యార్థుల ఏకరూప దుస్తులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన వస్త్రాలు, బెడ్‌షీట్లను చేనేత సహకార సంఘాల ద్వారా, టెస్కో ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న విధంగానే చేనేత ఉత్పత్తులను టెండర్లు లేకుండా టెస్కో ద్వారా కొనుగోలు చేసేందుకు సంఘాలకు ఉత్పత్తి ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నేతన్న భరోసా కోసం ఆందోళన చేపట్టిన నేపథ్యంలో మూడు నెలలు మాత్రమే చేనేత కార్మికుల ఖాతాల్లో రూ.4,500, అనుబంధ కార్మికుల ఖాతాల్లో రూ.1,500 చొప్పున జమ చేశారని తెలిపారు. 2024 జనవరి నుంచి నేతన్న భరోసా పథకాన్ని నిరంతరాయంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద హౌస్ కమ్ వర్క్ షెడ్‌లు మంజూరు చేయాలని, రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. చీరలు, దోతులు తదితర 11 రకాల వస్త్రాలకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ నిబంధనలను రాష్ట్రంలో కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. సిరిసిల్ల వంటి జిల్లాల్లో రిజర్వ్ చేసిన చీరలు, దోతులను పవర్‌లూమ్‌లపై నేయడం వల్ల చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా చేనేత కార్మికుల కూలీ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. చేనేత రంగానికి సంబంధించిన అన్ని సమస్యలను దసరా పండుగలోపు పరిష్కరించి కార్మిక కుటుంబాల్లో ఆనందం నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. దసరా నాటికి సమస్యలు పరిష్కరించకపోతే పండుగ అనంతరం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని చేనేత కార్మికులు, చేనేత పరిశ్రమ శ్రేయోభిలాషులకు పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి, రాష్ట్ర కమిటీ సభ్యులు బడుగు శంకరయ్య, గుర్రం నర్సింహా, కర్నాటి వెంకటేషం, వర్కాల చంద్రశేఖర్, వనం ఉపేందర్, మాచర్ల సారయ్య, కె. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** పటాన్ చెరువు నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం తన సొంత నిధుల నుంచి రూ.3 లక్షలు విరాళంగా అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని, అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ పటాన్చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని జీఎంఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, డీఈ కృష్ణవేణి, ఏఈ ఫైజాన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు రవీందర్‌రెడ్డి, కొమరయ్య, శ్రీకాంత్, నాగరాజు, శ్రీశైలం, నాయకులు రమేష్, చెన్నారెడ్డి, సాయిచరణ్‌గౌడ్, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి

**కేశంపేట, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆవరణలో మండలంలోని 22 మంది రైతులకు గొర్రెల పెంపకానికై మూడు కోట్ల 13 లక్షల చెక్కులను సొసైటీ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట గ్రామ సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్, ఉప సర్పంచ్ కర్నాటి దర్శన్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రంగు శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిలు, సీఈవో అనిల్, సింగిల్ విండో డైరెక్టర్లు రావుల పెంటయ్య, బండెల రాజేందర్ రెడ్డి, వి. లింగం, నాయకులు యారం భాస్కర్ రెడ్డి, అంజయ్య గౌడ్, కాడెమోని జంగయ్య, నిర్ధవెల్లి జంగయ్య , అంజయ్య, శ్రీశైలం, రాజు, యాదయ్య, సంతోష్ పాల్గొన్నారు.



# చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- పర్యావరణ సంరక్షణ, పర్యటక అభివృద్ధికి దోహదం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** జిల్లాలోని చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, జల వనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు డిఎఫ్ వో నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ మధు మోహన్ తో కలిసి కలెక్టర్ జిల్లా స్థాయి చిత్తడి నేలల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని చిన్న కుంటలు, చెరువులు, రిజర్వాయర్స్ వంటి జల వనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి విస్తీర్ణం, హద్దులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో ఇలాంటి చిత్తడి నేలలను 101 గుర్తించామని, వాటి సరిహద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా కొలిచి రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామాల్లో రీసర్వే పనులు జరుగుతున్నందున వీటి పరిధిలో చిత్తడి నేలలు ఉంటే సర్వే కొంత సులభతరం అవుతుందన్నారు. చిత్తడి నేలల ఆవాసాల పరిధిలోని ప్రజలతో గ్రామసభలు కూడా నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించడమే కాక ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుకెళ్లాలన్నారు. సర్వే, హద్దుల నిర్ధారణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ప్రతి జల వనరును స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని తెలిపారు. చిత్తడి నేలల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడమే కాక అవసరమైన చోట పర్యాటక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, జిల్లా ఇన్చార్జి అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస రావు, నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, సర్వే ఏడి నూకరాజు, డిపిఓ శ్రీకాంత్, మత్స్య శాఖ అధికారి షకీలా భాను, ఫారెస్ట్ రేంజ్ అధికారి పర్వీజ్ అహ్మద్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వనపర్తిలో కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

- ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ఎస్సీ జనాభా గణనీయంగా ఉన్న వనపర్తి నియోజకవర్గంతో పాటు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ పిలుపునిచ్చారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో ఎస్సీ వర్గాలను పార్టీతో అనుసంధానం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వనపర్తిలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన నూతన కమిటీ ప్రక్రియకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురేందర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. నిరుపేదలు, అణగారిన వర్గాల ప్రజలకు ఇళ్లు, భూములు కల్పించడంతో పాటు పార్టీలో సముచిత రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. ఇతర పార్టీలు ఎస్సీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని సురేందర్ విమర్శించారు. ఎస్సీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎస్సీ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వనపర్తి నియోజకవర్గంతో పాటు జిల్లాలో ఎస్సీ జనాభా అధికంగా ఉన్నందున పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తేనే రాబోయే రోజుల్లో రాజకీయంగా మరింత బలపడే అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి కొంకి వెంకటేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు గంధం రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి కొల్ల వెంకటేష్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఎత్తం రవి, మున్సిపల్ కౌన్సిలర్ విభూది మహేశ్వరి, ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమజ్జనంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

- కమలాపురం చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన
- ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** వినాయకుల నిమజ్జనం సందర్భంగా పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం నారాయణఖేడ్, మానూర్, నాగల్గిద్ద మండలాలకు సంబంధించిన వినాయక నిమజ్జనాలు నిర్వహించనున్న మానూర్ మండలం కమలాపురం చెరువును జిల్లా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 9, 11 రోజుల వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శోభాయాత్రలు జరిగే మార్గాల్లో రహదారుల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, చెరువు వద్ద బారికేడింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన క్రేన్లు, గజ ఈతగాళ్లను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు, ఇతర సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# దళితులపై వివక్షను ఖండిస్తూ నిరసన

**మద్దూరు, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** దళితుల పట్ల వివక్షను ఖండిస్తూ మద్దూరు పాత బస్టాండ్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలో దళితులు, కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించిన నిరసన అనంతరం పసుపు నీటితో రహదారిని 'శుద్ధీకరణ' చేసిన ఘటనపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమ నిర్వాహకులు కే. ప్రభుదాస్, కృష్ణ, మరికంటి వెంకట్, నరేష్, సురేష్‌బాబు, హన్మప్ప, నర్సిములు, సామేలు, మాణిక్ష తదితరులు పాల్గొన్నారు. పీసీఏఎస్ నర్సిములు, మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి జనార్దన్, ఏఎంసీ భీములు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, డప్పు కళాకారులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు.



# ఆహార నియమాలతో ఆరోగ్య పరిరక్షణ




**అల్వాల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ఆహార నియమాలు, క్రమబద్ధమైన జీవన విధానాన్ని పాటిస్తే అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ శైలజ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అల్వాల్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ.. వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఆయుర్వేద వైద్య విధానంపై ప్రస్తుతం ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందన్నారు. ఆరోగ్య పరిరక్షణలో ఆహార నియమాలు, జీవనశైలి కీలకమని తెలిపారు. ప్రతిరోజూ బ్రహ్మముహూర్తంలో నిద్రలేవడంతో పాటు యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని సూచించారు. నియమబద్ధమైన జీవన విధానంతో దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అనఘ్, వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రోటీన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కే.కిరణ్మయి
- 9వ జాతీయ పోషణ మాసం ప్రారంభం
- "మన అంగన్‌వాడీ... మన బాధ్యత థీమ్" ఆవిష్కరణ



**రంగారెడ్డి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ప్రోటీన్‌తో కూడిన ఆహారం తీసుకునేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కే.కిరణ్మయి సూచించారు. 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా "మన అంగన్‌వాడీ... మన బాధ్యత" థీమ్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, తగినంత ప్రోటీన్‌తో కూడిన ఆహారం తీసుకునేలా కుటుంబాల్లో అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా ప్రాథమిక విద్య, బాలల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్యం, పోషణకు కీలక కేంద్రాలుగా పని చేస్తున్నాయని తెలిపారు. పోషణ మాసం సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి జి. శాంతిశ్రీ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాజెక్టుల పరిధిలో పోషకాహారం, ఆహార వైవిధ్యం, ఆరోగ్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీల్లో అందించే వేడి వండిన భోజనం నాణ్యత, పోషక విలువలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవలపై ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు ప్రధానమంత్రి మాతృ వందన యోజన ప్రయోజనాలపై కూడా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన అలవాట్లపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆనందదాయకమైన వాతావరణంలో ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందించినప్పుడే చిన్నారుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యాశాఖ, అంగన్‌వాడీ కేంద్రాల మధ్య సమన్వయం బలోపేతం చేయడం ద్వారా పిల్లల ఆరోగ్యం, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచవచ్చన్నారు. ఆటలు, కథలు, పాటల ద్వారా చిన్నారుల్లో సామాజిక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యరత్న, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, సీడీపీఓలు, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త డి. శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
23 సెప్టెంబర్ 2026

# సరిహద్దు ప్రాంతాలలో పటిష్ట భద్రత పెంచండి

- గంజాయి సాగు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నాగల్గిద్ద పోలీస్‌స్టేషన్ లో వార్షిక తనిఖీ
- ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, తనిఖీలను ముమ్మరం చేయాలని సంగారెడ్డి ఎస్పీ పారితోష్ పంకజ్ సంబంధిత అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నాగల్గిద్ద పోలీస్‌స్టేషన్, నారాయణఖేడ్ డీఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేశారు. నాగల్గిద్దలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ సామగ్రి, రికార్డుల నిర్వహణ, కేసులకు సంబంధించిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, పెండింగ్, అదృశ్య కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పగలు, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని, రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా తనిఖీలు పటిష్ఠం చేయాలని ఆదేశించారు. కేసులకు సంబంధించిన ఆస్తులను కోర్టుకు సమర్పించే వరకు భద్రంగా పరిరక్షించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య, సైబర్ నేరాల నియంత్రణ వ్యవస్థ, వేలిముద్రల పరికరాలు తదితర సాంకేతిక సాధనాలపై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని అన్నారు. స్టేషన్ రికార్డుల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి సమస్యల పరిష్కారంపై భరోసా కల్పించాలని, గ్రామ పోలీసు అధికారులు గ్రామాలపై పూర్తి అవగాహనతో ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. అనంతరం నారాయణఖేడ్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచారం, వరకట్న మరణాల కేసుల్లో నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను ప్రమాదకర ప్రాంతాలుగా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారుల వెంట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నారాయణఖేడ్ ప్రాంతం రాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్నందున అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి సాగు చేస్తున్నట్లు తేలిన రైతుల భూములను చట్టప్రకారం జప్తు చేసేందుకు సిఫారసు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. డీఎస్పీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని పేర్కొన్న ఎస్పీ అధికారులు, సిబ్బందిని అభినందించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. ఈ తనిఖీల్లో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

## మహిళలు పరస్పరం సహకరించుకుంటూ ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** మహిళలు తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, ఒకరికొకరు తోడ్పాటునందించుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 'మహబూబ్‌నగర్ ఫస్ట్' స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించి, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా అమలు చేస్తున్న హెల్త్ కిట్, హెల్త్ కార్డు, డిజిటల్ లర్నింగ్ సెంటర్లు, పయనీర్, చీవీమీ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ విద్యార్థినులు రూపొందించిన కళారూపాలను కలెక్టర్ తిలకించి అభినందించారు. ఈ కేంద్రంలో టైలరింగ్, కంప్యూటర్ బేసిక్స్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ సహా 5 విభాగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. శిక్షణ పూర్తయ్యాక స్వయం ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు లభించేలా తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రెడ్డి మహిళా హాస్టల్ ప్రాంగణంలోని గణనాథునికి కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు ఎన్.పి.నేహా శ్రీ, పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌ఛార్జ్ నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి

- కొమటూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీవో రమాదేవి



**మెదక్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** భూ భారతి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న రీ-సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం మెదక్ మండలంలోని కొమటూర్ గ్రామంలో భూ భారతి రీ-సర్వే పనులను ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియ, ఫీల్డ్ విజిట్ పనులను పరిశీలించారు. రీ-సర్వేలో భాగంగా భూముల హద్దులను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియను పరిశీలించి, సంబంధిత వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని ఆర్డీవో సూచించారు. భూముల హద్దుల గుర్తింపు సమయంలో సంబంధిత రైతులు, భూ యజమానుల సమక్షంలో వివరాలను పరిశీలించి, అవసరమైన చోట సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. రీ-సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో సర్వే బృందాలు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే ద్వారా భూముల హద్దులు, రికార్డుల వివరాలు సక్రమంగా నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా రీ-సర్వేకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆర్డీవో సూచించారు. అది ఓ వెంట స్థానిక తాసిల్దార్ లక్ష్మణ్ బాబు ఆరే లక్ష్మణ్ స్థానిక సర్పంచ్ మరియు సెక్రటరీ రైతులు ఉన్నారు.

# జూరాల నీటిని వెంటనే విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**మక్తల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని తక్షణమే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మక్తల్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ?ప్రస్తుతం పంటలు పొట్ట దశకు చేరుకున్న కీలక తరుణంలో సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మక్తల్ నియోజకవర్గ రైతులు సాగునీటి కోసం జూరాల డ్యాం వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగగా, వారికి భారాస నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. జూరాల ప్రాజెక్టులో పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, రైతులకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. అమరచింత, ఆత్మకూరు, కొత్తకోట, దేవరకద్ర మండలాల పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదని, కనీసం వారబందీ విధానాన్ని కూడా అధికారులు అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. రైతులు పంటలు పండిస్తేనే సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. పంట పెట్టుబడి సాయం అందిస్తున్న ప్రభుత్వం, పంట చేతికి వచ్చే సమయంలో దానికి అత్యంతావసరమైన సాగునీటిని అందించడంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ ప్రాంతం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. రైతులకు సాగునీరు విడుదల చేయకుండా, కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయిస్తామని చెప్పడం సరికాదన్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు కింద సుమారు 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. సాగునీరు విడుదల చేసే సమయంలో రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి, పంటల అవసరాలకు తగినట్లుగా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై శాంతియుతంగా మద్దతు తెలిపేందుకు వస్తున్న భారాస నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వం ముందస్తు గృహ నిర్బంధాలు, అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేయడం అప్రజాస్వామికమని విమర్శించారు.


### ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించాలి

మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం పాము కాటుకు సంబంధించిన మందులు (యాంటీ స్నేక్ వెనమ్) కూడా అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళనకరమని ఆయన అన్నారు. ఈ వైద్య నిర్లక్ష్యం వల్లే నియోజకవర్గంలో ఇటీవల కాలంలో చిన్నారులు మృతి చెందుతున్నారని ఆరోపించారు. భారాస హయాంలోనే మక్తల్‌కు ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయించామని, ఆసుపత్రిలో 103 మందికి ఉపాధి కల్పించే విధంగా పోస్టులు మంజూరు చేసేందుకు కృషి చేశామని గుర్తుచేశారు. వెంటనే రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించి, జూరాల నుంచి నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# జూరాల వద్ద జలం కోసం బీజేపీ జగడం

- నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు
- బీజేపీ నాయకుల అరెస్టును ఖండించిన ఎంపీ డీకే అరుణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** జూరాల ప్రాజెక్టు ఆయ కట్టు కింద ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులకు మద్దతుగా బీజేపీ చేపట్టిన జూరాల ప్రాజెక్టు సందర్శ న ఉద్రిక్తంగా మారింది.రోడ్డుపై బైటాయించి బిజెపి నాయకులు ఆందోళన చేపట్టారు.దాంతో బీజేపీ నాయకులను అరెస్ట్ చేశా రు.అలాగే ముందస్తుగా పోలీసులు బిజెపి నాయకు లను హౌస్ అరెస్ట్ చేశారు.బిజెపి నాయకుల అరెస్ట్ ను పాలమూరు ఎం పీ డీకే అరుణ,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండు రెడ్డి తీవ్రంగాఖండించారు.నారాయణపేట లో సీనియర్ నాయకులు నాగురావు నామాజీ,ఇతర నాయకుల ను గద్వాల జిల్లా బీజేపీ అధ్యక్షులు రామాంజనే యులు, బీజేపీ యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బండల వెంకట్రా ములు, వెంకటేశ్వర్ రెడ్డి తదితర జిల్లా నాయకు లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడు తుందని స్పష్టం చేశారు. జూరాల ఆయకట్టు కింద సాగు చేస్తు న్న పంటలు నీరందక ఎండి పోతున్న పరిస్థితుల్లో ప్రభు త్వం తక్షణమే స్పందించి సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని విమర్శించారు. జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలి. రైతుల సమస్యలను పరిష్కరం చూపకుండా, శాంతియుతంగా నిరసన తెలిపే నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వా మ్య హక్కులను అణచివే యడమే" అని అన్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు పిలుపు మేరకు జూరాల ప్రాజెక్టు సందర్శనకు సిద్ధమవు తున్న బీజేపీ నాయకులను ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు.జూరాల ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని, సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోతున్నా యని, రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.రైతుల సమస్య లను పరిష్కరించకుండా నాయకులను గృహనిర్బం ధం చేయడం ద్వారా రైతుల గొంతు నొక్కాలని చూస్తోందన్నారు జూరాల ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించే వరకు బీజే పీ రైతుల పక్షాన తన పోరా టాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టు కు సాగునీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

# మూత్రశాలగా మారిన పశు వైద్యశాల!

- పశు వైద్యశాల ఆవరణలో బహిరంగ మూత్ర విసర్జన
- గేటు లేకపోవడంతో ఆకతాయిల ఆగడాలు..
- వెదజల్లుతున్న తీవ్ర దుర్గంధం
- విధుల్లో ఉన్న మహిళా డాక్టర్‌కు, సిబ్బందికి తప్పని అవస్థలు
- శిథిలావస్థకు చేరిన భవనం.. ఏ క్షణాన కూలుతుందోనన్న ప్రాణ భయం
- వెంటనే గేటు ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి



పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) : మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని పశు వైద్యశాల పరిస్థితి దయనీయంగా మారింది. మూగ జీవాలకు వైద్యం అందించాల్సిన ఈ ఆసుపత్రి ఆవరణ ఇప్పుడు కొందరు ఆకతాయిల నిర్వాకం వల్ల మూత్రశాలగా మారిపోయింది. ఆసుపత్రి చుట్టూ కనీస ప్రహరీ రక్షణ, ప్రధాన ద్వారానికి గేటు లేకపోవడంతో.. కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశించి బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. దీని కారణంగా ఆసుపత్రి పరిసరాలన్నీ తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ దుర్వాసన భరించలేక ఆసుపత్రికి పశువులను తీసుకొచ్చే రైతులు, చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా పశువైద్యాధికారికి ఈ పరిస్థితి ప్రాణసంకటంగా మారింది. ఒకవైపు భరించలేని దుర్గంధం, మరోవైపు ఆకతాయిల సంచారంతో మహిళా సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఆసుపత్రి భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం గోడలు పగుళ్లు బారి, పెచ్చులు ఊడిపడుతుండటంతో ఏ క్షణాన పైకప్పు కూలి మీద పడుతుందోనన్న భయంతో సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు, అరకొర వసతుల మధ్య సరైన వైద్య సేవలు అందించడం వారికి పెద్ద సవాలుగా మారింది. ప్రతిరోజూ ఈ దుర్వాసన మరియు శిథిల భవనం మధ్య డ్యూటీ చేయడం నరకప్రాయంగా మారిందని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఆసుపత్రి ఆవరణలోకి అపరిచితులు రాకుండా ఉండేందుకు తక్షణమే ఒక ఇనుప గేటును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టి, మహిళా సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సిబ్బంది ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

## చివరి ఆయకట్టుకూ జూరాల నీరందించాలి



**గద్వాల, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** ఎల్-నినో ప్రభావం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల డ్యామ్ నీటిని వెంటనే విడుదల చేయాలని గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్, టీజీఎస్ గడీసీఫల్ ఛైర్మన్ సరితా తిరుపతయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. జూరాల ప్రాజెక్టు కింద సాగవుతున్న కుడి, ఎడమ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించి రైతులను ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సరితా తిరుపతయ్య మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు పడక, ప్రాజెక్టుల నుండి నీరు విడుదల కాకపోవడంతో జిల్లాలోని వేలాది ఎకరాల్లో పంటలు నిలువునా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి, పంట చేతికొచ్చే సమయంలో నీరందక రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. ముఖ్యంగా గద్వాల నియోజకవర్గంలోని చివరి భూములకు తక్షణమే నీటిని విడుదల చేయకపోతే రైతులు కోలుకోలేని విధంగా నష్టపోతారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.పంటలు ఎండిపోకుండా యుద్ధప్రాతిపదికన స్పందించి, నీటి విడుదలపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించాలని కోరారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే నీటి విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యతో పాటు శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించాలి

**బిజినేపల్లి, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** విద్యార్థులు విద్యతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని, యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడంతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పలువురు నిపుణులు సూచించారు. బిజినపల్లి మండలం పాలెంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల (అటానమస్) లో శారీరక విద్య, ఆర్ట్స్ విభాగాలు, ఐక్యూఏసీ, పతంజలి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో యోగా, మార్షల్ ఆర్ట్స్‌పై ఒకరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, ధైర్యం, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడం, యోగాను రోజువారీ జీవితంలో భాగంగా చేసుకునేలా అవగాహన కల్పించడం ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి విద్యతో పాటు ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. నేటి విద్యార్థులు చదువుతో పాటు యోగా, వ్యాయామం, క్రీడలు, ఆత్మరక్షణ శిక్షణకు కూడా తగిన సమయం కేటాయించాలని సూచించారు. విద్యార్థుల దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలను నియంత్రించుకోవడానికి యోగా, ధ్యానం, శ్వాసాభ్యాసాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అనంతరంపతంజలి యోగా సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వాస్పరి శివుడు యోగా నిపుణుడిగా మాట్లాడారు విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలు, శ్వాసాభ్యాసాలు, ధ్యాన పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. యోగా వల్ల శరీర ఆరోగ్యంతో పాటు మనస్సుకు ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని, రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని నియంత్రించుకోవడానికి యోగా ఎంతో ఉపయోగకరమని వివరించారు. విద్యార్థులకు పలు ఆసనాలను స్వయంగా ప్రదర్శించి, వాటిని సరైన పద్ధతిలో ఎలా అభ్యసించాలో వివరించారు. నిపుణుడి సూచనల మేరకు విద్యార్థులు వివిధ యోగా ఆసనాలు, శ్వాసాభ్యాసాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం మార్షల్ ఆర్ట్స్, శక్తి శిక్షణ నిపుణుడు, బ్లాక్ బెల్ట్ చిమ్మిరి అజయ్ మార్షల్ ఆర్ట్స్ నిపుణుడిగా పాల్గొని ఆత్మరక్షణకు సంబంధించిన పలు ప్రాథమిక పద్ధతులను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా వ్యవహరించడం, స్వీయ రక్షణ చేసుకోవడం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడం, క్రమశిక్షణతో జీవించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డా. వి. శ్రీనివాసులు, కన్వీనర్, డా. కె. సుష్మా, ఐక్యూఏసీ సమన్వయకర్త మరియు ఆర్ట్స్ విభాగాల సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు నాగలింగం, ప్రకాశ్ బాబుతో పాటు కళాశాల అధ్యాపకులు డా. డి. పద్మజ, డా. సి. నాగరాజు, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.కళాశాల స్థాయిలో నిర్వహించిన ఈ జాతీయస్థాయి వర్క్‌షాప్‌కు అధ్యాపకులు, విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన యోగా, మార్షల్ ఆర్ట్స్ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు, పతంజలి సేవా సమితి ప్రతినిధులకు కళాశాల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఐదు రోజుల వ్యవధిలో భార్యాభర్తలు కన్నుమూత



- సర్పంచ్ దంపతులను కడతేర్చిన రోడ్డు ప్రమాదం
- తీవ్ర విషాదంలో లెంకాలపల్లి గ్రామం

నల్లబెల్లి, సెప్టెంబరు 22 (జనంసాక్షి) : మండలంలోని లెంకాలపల్లి గ్రామ సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి, ఆమె భర్త రవీందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వారిని వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు విజయలక్ష్మి ఈ నెల 17 తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు. విజయలక్ష్మి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇదిలా ఉండగా.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్ కూడా మంగళవారం మృతి చెందారు. ఐదు రోజుల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ మృతి చెందడంతో లెంకాలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి మృతిని జీర్ణించుకోకముందే ఆమె భర్త కూడా కన్నుమూయడంతో కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి.

## ఆర్ట్స్ కళాశాల, కేడీసీ మధ్య ఎంఓయూ!



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** విద్యార్థుల విద్యా, పరిశోధనా నైపుణ్యాల అభివృద్ధికి కళాశాలల మధ్య పరస్పర సహకారం అవసరమని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అన్నారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ) రాజనీతి శాస్త్ర విభాగం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరిందని తెలిపారు. ఎంఓయూ ద్వారా బోధన, పరిశోధన రంగాల్లో పరస్పరం సహకరించుకోవడంతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సదస్సులు, చర్చాగోష్టులు, పరిశోధనా కార్యక్రమాల నిర్వహణకు ఈ ఒప్పందం దోహదపడు తుందని తెలిపారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధ్యక్షుడు డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ సంజీవ్, కేడీసీ రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ కవిత, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఐఎన్టీయుసీ ప్రధాన కార్యదర్శి డా. బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు భూపాలపల్లి ప్రాంతంలోని కేటీకే ఓసీ-3 బొగ్గు గనిపై నిర్వహించిన ఐఎన్టీయుసీ బాయి బాట కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి, ప్రాంత ఆసుపత్రుల్లోనే వైద్య మండలి పరీక్షలు, విశ్రాంత కార్మికుల వైద్య సాయం 8 లక్షల నుండి 25 లక్షలకు పెంపు, 250 గజాల ఇంటి స్థలం కేటాయింపు, భూపాలపల్లి ప్రాంత ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల నియామకం వంటి డిమాండ్లను శాసనసభలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎన్టీయుసీ ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్ రెడ్డి, నాయకులు పశునూటి రాజేందర్, జోగ బుచ్చయ్య, రత్నం సమ్మిరెడ్డి, వేణుగోపాల్ యాదవ్, చెల్పూరి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలి

- కేంద్ర బృందం..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా వైద్య సిబ్బందితో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ ఉమ్మడిగా కృషి చేయాలని కేంద్ర కుష్టు వ్యాధి నివారణ బృందం పిలుపునిచ్చింది.

రాష్ట్రంలోనే అత్యధిక కేసులు నమోదైన జిల్లాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉందని, జిల్లాలో మొత్తం 35 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉండగా 29 ఎంబీ కేసులు, 6 పీబీ కేసులుగా నమోదయ్యాయని అధికారులు తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం రేగొండ, కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మండల వైద్యాధికారులు డా. హిమబిందు, డా. అనూష ఆధ్వర్యంలో వైద్య బృందం క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పీహెచ్సీ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఉన్నవారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స పొందాలని, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ఎండీటీ మాత్రలతో పూర్తిగా నయం చేయవచ్చని, అంగవైకల్యాన్ని నివారించవచ్చని సూచించారు. అనంతరం పీహెచ్సీ రికార్డులు, కేస్ కార్డులను పరిశీలించి సిబ్బందికి కీలక సూచనలు చేశారు. జిల్లా ఆర్బీఎస్కే బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. మధుసూదన్, కేంద్ర అధికారి, డైరెక్టర్ డా. వీరకుమార్, సివిల్ సర్జన్లు డా. నాగరాజు, డా. రాజు, డిప్యూటీ పీఎంఓ వెంకటేశ్వర చారి, ప్రోగ్రాం ఆఫీసర్ డా. సందీప్, పీఎంఓ బొజ్జ నాయక్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామప్పను సందర్శించిన ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి



**వెంకటాపూర్ (రామప్ప ), సెప్టెంబర్ 22(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని మంగళవారం ప్రముఖ నటుడు తనికెళ్ళ భరణీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకి ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం,కాకతీయుల చరిత్ర గురించి వివరించారు.ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడారు రామప్పను సందర్శించడం రెండోసారి అని అన్నారు.రామప్ప శిల్పకళ అద్భుతమని,ఎన్ని సార్లు చూసిన తనివి తీరదని పేర్కొన్నారు.తాను రామప్ప శిల్పకళపై రాసిన ఆటగదరా శివ ఆటగదరా రామప్ప శిల్పాల అంగవైకల్యాలు పాటను ఈ సందర్భంగా గుర్తు చేశారు.అదేవిధంగా రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు,శ్రీనివాస్,శ్రీకాంత్,బద్రు, అరుణ్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పాఠశాలలో అదనపు గదులు, భోజనశాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి
- భూముల రీ సర్వే పారదర్శకంగా సాగాలి
- ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**తాండూర్,సెప్టెంబర్ 22(జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంగళవారం తాండూరు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, భోజనశాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం అధికారులు సమన్వయంతో పనిచేసి పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.భూముల రీ సర్వే పారదర్శకంగా జరగాలి:అనంతరం మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను మండల తహసిల్దార్ జ్యోత్స్నతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ రీ సర్వేను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ నక్షాలు, రైతుల భూముల నిర్ధారణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రికార్డులను క్షేత్రస్థాయి పరిశీలనతో సరిచూసి భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే క్రమంలో గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, ఆసరా పింఛన్ల దరఖాస్తుల పరిశీలన వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.మెరుగైన వైద్య సేవలు అందించాలి:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది అంతా సమయపాలన పాటించాలని హెచ్చరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా, సమయానికి పరీక్షలు చేయించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు.ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి:మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌తో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమీక్షించారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలోని ఓటర్ల ధ్రువపత్రాల పరిశీలనను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కార్యాలయానికి వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చే ప్రజల దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, నిర్ణీత గడువులోగా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి,సెప్టెంబర్ 22(జనం సాక్షి):** పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో జిల్లా లో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు,నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు,అటవీ,ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావే శంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ,డిఐఈఓలకు సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 25 వ తేదీన వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం గొల్లల గుడి వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు. హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.26వ తేదీన ఉదయం 8 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శిం చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా,జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు,ఇంచార్జీ జిల్లా పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మ నాయక్ డీఈవో సిద్ధార్థ రెడ్డి,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ కాటారం, (జనంసాక్షి):** బాలికపై లైంగిక దాడి చేసి ఆత్మహత్యకు కారకుడైన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ మంగళవారం సంచలన తీర్పు ఇచ్చారు. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మైనర్ బాలిక 09-12-2021న ఆధార్ కార్డు మార్చుకునేందుకు కాటారం వెళ్లేందుకు బస్టాండ్ వద్ద వేచి ఉండగా, తెలిసిన వ్యక్తి బైక్ పై వెళ్తుండగా చింతకాని గ్రామానికి చెందిన గొల్కొండ రాజశేఖర్ అడ్డగించి బెదిరించి తన బైక్ పై ఎక్కించుకుని చింతకాని క్రాస్ రోడ్డులోని తన గదికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం కాటారం సెంటర్ లో దింపి ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు. అవమానం భరించలేక బాలిక గడ్డి మందు తాగి ఇంటికి వెళ్లింది. తల్లిదండ్రులు లేని ఆ బాలిక బాబాయి సంరక్షణలో ఉంటోంది. బాబాయి ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం ఎస్ఎహెచ్ఓ ఏఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేశారు. సీఐ రంజిత్ రావు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించి చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలో డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్ఐ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోర్టు లైజన్ అధికారి ఏఎస్ఐ జి. వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ కె. రమేష్ సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్. విష్ణువర్ధన్ రావు, జి. వెంకట్రామ్ వాదనలు వినిపించారు. సాంకేతిక ఆధారాలతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ తీర్పు ఇచ్చారు.

## రిమ్స్ అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ

- ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలి
- రిమ్స్‌ను 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం: మంత్రి దామోదర రాజనర్సింహ



గుడిహత్నూర్, సెప్టెంబర్ 22( జనం సాక్షి): ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం రిమ్స్‌ను సందర్శించిన మంత్రి అగ్నిప్రమాదం జరిగిన వార్డును పరిశీలించి, ప్రమాద సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, చిన్నారుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, రిమ్స్ వైద్యులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సోమవారం రాత్రి సుమారు 11.40 గంటలకు నవజాత శిశు వార్డులో అగ్నిప్రమాదం సంభవించిందని తెలిపారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి, ప్లాస్టిక్ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించినట్లు గుర్తించారని చెప్పారు. అయితే ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో లోపాలు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర విచారణ అనంతరం స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే రిమ్స్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక, పోలీసు శాఖలు సమన్వయంతో స్పందించి నవజాత శిశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారని మంత్రి తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభావిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అగ్నిప్రమాద ఘటనపై నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.



## జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలో జూకల్ విద్యార్థి ప్రథమ స్థానం

**చిట్యాల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జిల్లా యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలలో , చిట్యాల మండలం జూకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కౌటం అభిలాష్ ప్రథమ స్థానంలో నిలిచాడు.ఈ సందర్భంగా జూకల్ గ్రామ సర్పంచ్ ఎలగొండ సంధ్య--తిరుపతి దంపతులు, ఉప సర్పంచ్ అమీర్ సోహెల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరుకొప్పుల కావ్య అభిలాష్‌ను హృదయపూర్వకంగా అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు.విద్యార్థిని పోటీలకు సిద్ధం చేసిన గైడ్ టీచర్లు మహమ్మద్ రఫీ, ఉమాదేవిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిగాని కృష్ణ అభినందించారు. అభిలాష్ రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాధిక రాణి, మమత, రూపశ్రీ, రవీందర్, శ్రీనివాస్, యోగానంద చారి, రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొని విద్యార్థి అభిలాష్‌ను అభినందించారు.

## ఎవరెస్టు ను జయించేందుకు బయలుదేరిన అడవి బిడ్డలు

- మంత్రి సీతక్క అభినందన



**కెరమెరి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** ఎవరెస్ట్ బేస్ క్యాంపు యాత్రకు సిద్ధమైన ఆదివాసీ బిడ్డలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అభినందించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం భీమన్ గోందికి చెందిన మడావి కన్నీబాయి, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కాత్లే ఆనందరావు ఈ నెల 23న ఎవరెస్ట్ యాత్రకు బయలుదేరనున్నారు. ఈ క్రమంలో సచివాలయంలో సోమవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి ఆర్థిక సాయం అందించి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కోలాం, తోటి తెగలకు చెందిన యువత ఎవరెస్ట్ యాత్రకు సిద్ధం కావడం అభినందనీయమని కొనియాడారు. యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని కలిసే అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని కన్నీబాయి తెలిపారు.

## అభివృద్ధి పేరుతో ప్రజాధనం వృధా

- మాణిక్ గుడలో రైట్ కెనాల్ మరమ్మత్తుల పనులపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలి
- మాణిక్గూడ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించాలి
- మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాపూరావు డిమాండ్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22(జనంసాక్షి ):** కొమరం భీమ్ జిల్లా కేంద్రానికి కుత వేటు దూరంలో గల మాణిక్ గుడా గ్రామంలో కొమరం భీమ్ ప్రాజెక్ట్ రైట్ కెనాల్ మరమ్మత్తుల పేరుతో లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. మంగళవారం మాణిక్ గుడా గ్రామంలో మరమ్మత్తులు చేసిన కాల్వ పనులను ప్రజా సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కుడి కాలువ మరమ్మత్తుల పేరుతో ప్రజా ధనం దుర్వినియోగం అయినట్లు వారు ఆరోపించారు. అంతేకాకుండా ఇంజనీర్ అధికారులు సైతం చూసి చూడనట్లు వ్యవహరించడం ద్వారా ఈరోజు అతి తక్కువ వర్షం కురవడం వల్ల ఆ కాలువ మట్టి అనేది పూర్తిస్థాయిలో కొట్టుకుపోవడం వలన ఆ గ్రామానికి అంతేకాకుండా సిసి రోడ్డు సైతం పూర్తిస్థాయిలో కొట్టుకుపోయింది అని అన్నారు. దీనివలన చిన్న పిల్లలు బయటకు రావాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టి బయటకు రావాల్సిన పరిస్థితి ఎవరు జేబులు నింపడానికి అభివృద్ధి పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారో జిల్లా అధికారులు సమాధానం చెప్పాలని వారు అన్నారు. ఏదైనా అభివృద్ధి చేపట్టిన మంటే ఆ గ్రామ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలి కానీ కేవలం జేబులు నింపుకోవడానికి ఒక పనిని చేపట్టి ఆ గ్రామ ప్రజలకు అసౌకర్యం కల్పించడం ఎంతవరకు సమంజసం, ఇప్పటికైనా జరిగిన పనులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టీఏజీఎస్) గా డిమాండ్ చెస్తున్నాం అన్నారు. అంతేకాకుండా ఆ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ వెంటనే సందర్శించి ఆ కాలువ మరమ్మత్తులకు శాశ్వత పరిష్కారం చూపాలని కొరతం ఉన్నాం. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్టీ ఏ జీ ఎస్ జిల్లా కార్యదర్శి నేర్పిల్లి అశోక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు కె రాజన్న తదితరులు ఉన్నారు

## ఏదులాపురం ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి

- నాణ్యతలో రాజీ పడొద్దు
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** ఏదులాపురం మున్సిపాలిటీలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల తరుణీ హట్ ప్రాంగణంలో కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ భవన సముదాయం అందుబాటులోకి వస్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే చోట లభిస్తాయని, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సంగీత ను కలిసి వినతిపత్రం అందజేశారు. టీజేఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరంపల్లి అశోక్ అధ్యక్షతన నాయకులు జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల జాబితాను రూపొందించి, ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలని టీజేఏ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సిద్దిక్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ సాబ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముజహిద్, నాయకులు మహిపాల్ రెడ్డి, అశోక్ బాబు, ఆహేద్ పటేల్, చంద్రారెడ్డి, రామకృష్ణ, కాళీలుద్దీన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైలులో అక్రమంగా తరలిస్తున్న బాలికను రక్షించిన అధికారులు



**ఖమ్మం, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** నేపాల్‌కు చెందిన 14 ఏళ్ల బాలికను అక్రమంగా భారత్‌కు తీసుకొచ్చి రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో కేరళలోని కొల్లంకు తరలిస్తున్న ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని బాలికను రక్షించారు. సెప్టెంబర్ 11న ఏవీఏ ఢిల్లీ నుంచి అందిన సమాచారంతో ఏఐడీ సంస్థ జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి సమాచారం అందించగా, రైల్వే చైల్డ్ హెల్ప్‌డెస్క్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సమన్వయంతో బాలికను, ఇద్దరు మహిళలను రక్షించారు. బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు బాలల సదనంలో ఉంచగా, ఇద్దరు మహిళలపై జీఆర్‌పీ పోలీసులు మానవ అక్రమ రవాణా చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం నేపాల్‌కు చెందిన మైటీ నేపాల్ సంస్థ ద్వారా బాలిక కుటుంబ వివరాలను నిర్ధారించారు. సెప్టెంబర్ 21న సంస్థ ప్రతినిధి ఖమ్మం వచ్చి అవసరమైన పత్రాలను సమర్పించడంతో, వివరాలను పరిశీలించిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బాలికను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సమక్షంలో కుటుంబానికి అప్పగించింది. మానవ అక్రమ రవాణా బాధితులకు అందించే రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ బాలికకు అందించి, ఆ మొత్తాన్ని పునరావాసం కోసం వినియోగించాలని సూచించారు. బాలికను కుటుంబంతో తిరిగి మమేకం చేసి చక్కని సంరక్షణ అందించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు లింగయ్య, లక్ష్మణ్, ఏఐడీ డైరెక్టర్ పీఎస్ఎస్ హరిప్రసాదరావు, మైటీ నేపాల్ ప్రతినిధి మహేశ్వరి, బాలల సదనం సూపరింటెండెంట్ నవ్య, శ్రీలక్ష్మి, ఏఐడీ జిల్లా కోఆర్డినేటర్లు శ్రీనివాస్, రాజేష్, ఏవీఏ కోఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి

**వనపర్తి, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** జిల్లాలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్ సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రీ-సర్వే పురోగతి, పెండింగ్ దరఖాస్తులు, భూ సరిహద్దు వివాదాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని సూచించారు. రైతులు, భూ యజమానుల నుంచి వచ్చే వినతులు, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భూ సరిహద్దు వివాదాలపై పారదర్శకంగా విచారణ జరిపి స్పష్టమైన నివేదికలు అందించాలని ఆదేశించారు.



పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తూ, రీ-సర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సర్వే ఏడీ శ్రీనివాస్‌తో పాటు సర్వే అధికారులు, మండల స్థాయి సర్వేయర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

- మంత్రి తుమ్మల

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఖమ్మం నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుగ్గవాగు ఎత్తిపోతల పథకం పనులు చాలా కాలంగా ఆలస్యమవుతున్నాయని, పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా ఏఏ కాలువలకు అందించవచ్చో పరిశీలించి, అవసరమైన అంచనాలను సవరించి సమర్పించాలని ఆదేశించారు. పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు. మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు అవసరమైన 10-ఏ మినహాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించే ధోరణిని మార్చుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా బాధ్యతతో పనిచేయాలని అన్నారు. డ్రైనేజీ డిజైన్లు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ లేఅవుట్‌ను త్వరగా తుది రూపంలో సిద్ధం చేయాలని, వచ్చే వర్షాకాలం లోగా పనులు



పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగునీరు, త్రాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అన్నారు. గోదావరి జలాలను సక్రమంగా ప్రణాళిక చేసుకుని వినియోగించాలని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 15 వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలువలు, షట్టర్లు, నీటి మట్టాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వచ్చే సీజన్ నుంచి అన్ని నిర్వహణ పనులను వేసవిలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. త్రాగునీటినీ జాగ్రత్తగా వినియోగించాలని, నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైతే నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో హ్యామ్ రోడ్లకు సంబంధించి 10 పనులకు రూ.36.60 కోట్ల మంజూరు లభించిందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని, నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో ఏడు కొత్త సబ్‌స్టేషన్లు ప్రతిపాదించామని, వాటికి అవసరమైన భూములు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సీజన్‌లో జిల్లాలోని 20 మండలాల్లో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం కేవలం 7 వేల ఎకరాలు మాత్రమే తగ్గిందని తెలిపారు. పెసర సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈ ఏడాది అదనంగా 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టినట్లు వివరించారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే దిగువ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంజూరైన 137 పనుల్లో 54 పనులు పూర్తయ్యాయని, మరో 54 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నీటి నిల్వ సమస్యలను పరిష్కరించామని, ప్రధాన రహదారులపై యంత్రాలతో స్వీపింగ్ నిర్వహించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఈ సమీక్షలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్ష
- పలు గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** విఘ్నాలను తొలగించే ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి.. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

### పలు మండపాల్లో పూజలు

ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద మారుతినగర్, కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మంత్రి సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

### ప్రశాంతంగా నిమజ్జనం చేసుకోవాలి



గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లుగానే నిమజ్జన కార్యక్రమాలను కూడా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. భక్తులందరూ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్‌చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్,తల్లంపాడు సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్,లువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా కోటి 6 లక్షలకుపైగా స్మార్ట్ రేషన్ కార్డుల జారీ

- కోదాడ నియోజకవర్గంలో 98,959 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**కోదాడ, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలో ఆరు మండలాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిలుకూరు, కోదాడ, అనంతగిరి, మునగాల, నడిగూడెం, మోతె మండల కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మంచి నాణ్యత కలిగిన సన్న బియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భారీ స్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసిందన్నారు. కోదాడ నియోజకవర్గంలో మొత్తం 98,959 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,80,792 యూనిట్లకు మూడు నెలల కాలానికి 5,386.866 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రత మరింత బలోపేతం అవుతుందని ఆమె పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో సెంట్రలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి సిద్ధం

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా మెదక్ ,సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు అల్పాహారం అందించే సెంట్రాలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ ప్రభుత్వం ,హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెంట్రలైడు కిచెన్ ను పరిశీలించారు. కిచన్ సామాగ్రి, కిచెన్ యంత్రాలను పరిశీలించారు.కిచన్ యంత్రాల సామాగ్రి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. త్వరలో గౌరవ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా సెంట్రలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయిందన్నారు. ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వర్తిస్తుందని, దీని ద్వారా పాఠశాలలో నాణ్యమైన చదువు తో పాటు పౌష్టికమైన అల్పహారం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. మెదక్ జిల్లా



వ్యాప్తంగా 395 పాఠశాలలోని,30 వేల మంది విద్యార్థులకు వర్తిస్తుందన్నారు.ఈ పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని, త ద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ వో రాజు, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు,మెదక్ కిచెన్ ప్లాంట్ మేనేజర్ పునీత్ త్రిపాఠి , హెచ్కె ఎం ట్రస్ట్ ఆర్గనైజర్ వీర ,డిస్ట్రిబ్యూషన్ మేనేజర్ నవీన్ ,జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం బ్రేక్ ఫాస్ట్ ఇన్చార్జ్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జన కొలను పరిశీలించిన జోనల్ కమిషనర్

**అల్వాల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** భూదేవినగర్ పార్కులో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక నీటి కొలను పనులను మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అల్వాల్ సర్కిల్-2 జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ మంగళవారం పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే



భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొలనులో రెండు అడుగుల ఎత్తు వరకు ఉన్న మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే నిమజ్జనం చేయాలని సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ఆయన పరిశీలించారు. నిమజ్జన సమయంలో పారిశుద్ధ్యం, భద్రత, నీటి వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీసీ భోగేశ్వర్లు, డీఈ మహేష్, మల్లెల శివ, నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- జిల్లా ఎస్పీ డి.జానకి
- గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు నిర్వహించాలి
- జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**జడ్చర్ల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** స్టేషన్‌లో పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో వేగవంతంగా దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి అధికారులను ఆదేశించారు. మంగళవారం జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ సందర్శించి శాంతి భద్రతలు, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తుపై సమీక్ష నిర్వహించారు. సాక్ష్యాధారాల సేకరణ, సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల గుర్తింపు పూర్తి చేసి నిర్ణీత సమయంలో చార్జ్‌షీట్‌లు దాఖలు చేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, ముఖ్యంగా మహిళలు, బాలలు, వృద్ధుల ఫిర్యాదులపై సున్నితంగా స్పందించి సత్వర న్యాయం చేయాలని సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమజ్జన శోభాయాత్ర మార్గాలను పరిశీలించి, కీలక కూడళ్లలో సిబ్బందిని నియమించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అమలు చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో భద్రత, లైటింగ్, బారికేడింగ్, క్రేన్ల ఏర్పాట్లను ముందస్తుగా తనిఖీ చేయాలని సూచించారు. అనుమతి లేని డీజేలు, అధిక శబ్దాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నేరాల నివారణకు బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు పెంచాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తూ, సైబర్ నేరాలపై 1930 హెల్ప్‌లైన్ ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ప్రజల భద్రత, బాధితులకు సత్వర న్యాయం



అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్చర్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విపణి

# ఎండీఆర్‌పై జీఎస్టీ.. చిన్న వ్యాపారులపై భారం పడదు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
యూపీఐ మర్చంట్ డిస్కౌంట్ రేటుపై విధించే జీఎస్టీ వల్ల చిన్న వ్యాపారులపై భారం పడుతుందన్న ప్రచారాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ తోసిపుచ్చింది. చిన్నవ్యాపారులకు ఎలాంటి భారమూ ఉండదని స్పష్టంచేసింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలో భాగంగా వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే లావాదేవీలపై మాత్రమే ఎండీఆర్ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ తెలిపింది. అంతకంటే తక్కువ మొత్తంలో చేసే లావాదేవీలపై ఎండీఆర్ భారం పడదు కాబట్టి జీఎస్టీ ప్రభావం ఉండదని స్పష్టంచేసింది. నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ఇప్పటికే పలు వర్గాల నుంచి వ్యతిరేతక వ్యక్తమవుతోంది. ఈ ఎండీఆర్‌పై జీఎస్టీ వల్ల చిరు వ్యాపారులపై అదనపు భారం పడుతుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్‌పీసీఐ క్లారిటీ ఇచ్చింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం యూపీఐ మర్చంట్ లావాదేవీల్లో 96 శాతానికి పైగా రూ.2,000లోపు విలువైనవే ఉన్నాయని పేర్కొంది. అందువల్ల మెజారిటీ చెల్లింపులపై ఎండీఆర్ గానీ, దానిపై జీఎస్టీ గానీ వర్తించవని పేర్కొంది. ఇక నెలకు రూ.1 లక్షలోపు యూపీఐ చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారనే విషయాన్ని ఎన్‌పీసీఐ గుర్తు చేసింది. కాబట్టి వారిపై భారం అనే సమస్యే ఉత్పన్నం కాదంది. ఒకవేళ వ్యాపారులు ఎండీఆర్‌పై జీఎస్టీ చెల్లించినప్పటికీ, వస్తువుల విక్రయంపై చెల్లించాల్సిన జీఎస్టీతో ఇన్‌పుట్ టాక్స్‌ను సర్దుబాటు చేసుకోవచ్చని తెలిపింది. తద్వారా వ్యాపారులకు అదనపు వ్యయం ఉండదని తెలిపింది. కాబట్టి చిన్న వ్యాపారులపై అదనపు భారం పడుతుందనే వార్తల్లో నిజం లేదని తెలిపింది. అపోహలు నమ్మొద్దని పౌరులకు ఎన్‌పీసీఐ విజ్ఞప్తి చేసింది.




# వరుస లాభాలకు బ్రేక్..

## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ.. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో నాలుగు రోజుల నిఫ్టీ లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 74,901.50 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,858.99) లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 74,423.71 వద్ద కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. చివరికి 329.91 పాయింట్లు పతనమై 74,529.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 85.30 పాయింట్లు కోల్పోయి 23,329 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.59గా ఉంది. సెన్సెక్స్ 30లో బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎటర్నల్, ఇండిగో, టైటాన్, టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, మారుతీ



షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 97.78 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,333.19 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# హోండా నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్..

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా మార్కెట్లోకి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ హోండాని విడుదల చేసింది. దీని ధరను రూ.1.35 లక్షలుగా (ఎక్స్-షోరూమ్, దిల్లీ) నిర్ణయించింది. గతంలో యాక్టివా-వలో స్వాపబుల్ బ్యాటరీ ఇవ్వగా.. ఇందులో మాత్రం 3ఎచిష్ట్ర ఫిక్స్‌డ్ బ్యాటరీ వాడారు. ఈ స్కూటర్ సర్టిఫైడ్ రేంజ్ 145 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది. భారత్‌లో హోండా తీసుకొచ్చిన ఈవీల్లో అత్యధిక రేంజ్ కలిగిన స్కూటర్ ఇదే కావడం గమనార్హం. ఈ స్కూటర్‌ను 0-80 శాతం ఛార్జ్ చేయడానికి 2.40 గంటల సమయం పడుతుందని కంపెనీ చెబుతోంది. పూర్తి ఛార్జింగ్‌కు 4 గంటలు తీసుకుంటుంది. ఇందులో 5 అంగుళాల టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. హోండా రోడ్‌సింక్ కనెక్టివిటీ, టర్న్ బై టర్న్ నావిగేషన్, 32 లీటర్ల అండర్‌సీట్ స్టోరేజీ ఉన్నాయి. తొలుత దిల్లీ, ఆగ్రా, కటక్, సూరత్, కొల్లాంలోని ఎంపిక చేసిన రెడ్‌వింగ్ డీలర్‌షిప్‌ల వద్ద ఈ స్కూటర్ లభ్యమవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న టీవీఎస్ ఐక్యూబ్, బజాజ్ చేతక్, ఏథర్ రిజ్తా, విడా వీ2 మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.



# ట్రాయ్ ఆదేశాలు.. ఇక మరిన్ని రీఛార్జి ప్లాన్స్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో మరిన్ని స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ టెల్కోలను ఆదేశించింది. వాయిస్+ ఎస్సెమ్మెస్ ప్రయోజనాలు కలిగిన రీఛార్జి ఆప్షన్లు పరిమితంగా ఉన్నాయని, అధిక వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లే ఎక్కువగా ఉన్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో తక్కువ కాలవ్యవధితో అందుబాటు ధరలో ఈ స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం కంపెనీలను ఆదేశించింది. వాయిస్, ఎస్సెమ్మెస్ ప్లాన్లపై గతేడాది ఏప్రిల్ 7న సంప్రదింపుల పత్రాన్ని ట్రాయ్ విడుదల చేసింది. దీనిపై భాగస్వామ్యపక్షాల నుంచి అభిప్రాయాలను సేకరించింది. 1132 మంది తమ అభిప్రాయాలను తెలియజేశారు. జూన్ 15న ఓపెన్ హౌస్ డిస్కషన్ కూడా నిర్వహించింది. ఈ క్రమంలోనే టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్, 2026 నిబంధనలను తాజాగా జారీ చేసింది. దీని ప్రకారం.. వాయిస్, ఎస్సెమ్మెస్, డేటా ప్లాన్ల మాదిరిగానే వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో కూడిన ప్లాన్లనూ అన్ని కాలవ్యవధులకు అందుబాటులో ఉంచాలని సూచించింది. 30 రోజులతో పాటు.. 30 రోజుల కంటే తక్కువ వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లు కూడా ఉండాలని సూచించింది. ఆపరేటర్లు ప్రతి నెలా ఒకే తేదీన రెన్యువల్ చేసుకోగలిగే వ్యాలిడిటీతో వాయిస్, ఎస్సెమ్మెస్‌లు ఉండే ఎస్‌టీవీలను అందించాల్సి ఉంటుంది. దీనివల్ల తక్కువ ఆదాయ వర్గాల వారు తమ అవసరాలకు అనుగుణంగా రీఛార్జు చేసుకునే వెసులుబాటు లభిస్తుందని ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ ఆదేశాల నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పంగా క్షీణించగా.. వొడాఫోన్ ఐడియా షేర్లు 2 శాతం మేర రాణించాయి.

ట్రాయ్ ఆదేశాలు.. ఇక మరిన్ని రీఛార్జి ప్లాన్స్

వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో మరిన్ని స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ టెల్కోలను ఆదేశించింది. వాయిస్+ ఎస్సెమ్మెస్ ప్రయోజనాలు కలిగిన రీఛార్జి ఆప్షన్లు పరిమితంగా ఉన్నాయని, అధిక వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లే ఎక్కువగా ఉన్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో తక్కువ కాలవ్యవధితో అందుబాటు ధరలో ఈ స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం కంపెనీలను ఆదేశించింది. వాయిస్, ఎస్సెమ్మెస్ ప్లాన్లపై గతేడాది ఏప్రిల్ 7న సంప్రదింపుల పత్రాన్ని ట్రాయ్ విడుదల చేసింది. దీనిపై భాగస్వామ్యపక్షాల నుంచి అభిప్రాయాలను సేకరించింది. 1132 మంది తమ అభిప్రాయాలను తెలియజేశారు. జూన్ 15న ఓపెన్ హౌస్ డిస్కషన్ కూడా నిర్వహించింది. ఈ క్రమంలోనే టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్, 2026 నిబంధనలను తాజాగా జారీ చేసింది. దీని ప్రకారం.. వాయిస్, ఎస్సెమ్మెస్, డేటా ప్లాన్ల మాదిరిగానే వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో కూడిన ప్లాన్లనూ అన్ని కాలవ్యవధులకు అందుబాటులో ఉంచాలని సూచించింది. 30 రోజులతో పాటు.. 30 రోజుల కంటే తక్కువ వ్యాలిడిటీ



కలిగిన ప్లాన్లు కూడా ఉండాలని సూచించింది. ఆపరేటర్లు ప్రతి నెలా ఒకే తేదీన రెన్యువల్ చేసుకోగలిగే వ్యాలిడిటీతో వాయిస్, ఎస్సెమ్మెస్‌లు ఉండే ఎస్‌టీవీలను అందించాల్సి ఉంటుంది. దీనివల్ల తక్కువ ఆదాయ వర్గాల వారు తమ అవసరాలకు అనుగుణంగా రీఛార్జు చేసుకునే వెసులుబాటు లభిస్తుందని ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ ఆదేశాల నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పంగా క్షీణించగా.. వొడాఫోన్ ఐడియా షేర్లు 2 శాతం మేర రాణించాయి.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹ 1,62,254 (22 క్యారెట్లు)
₹ 1,77,008 (24 క్యారెట్లు)

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 2,50,000

# సింగపూరే కింగ్..

## అత్యుత్తమ విమానయాన సంస్థల్లో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నం.1

### మనవి 10లో లేవు.. 50లో లేవు

### 100 లోపు ర్యాంకింగ్‌లో ఎయిరిండియా, ఇండిగో మాత్రమే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ప్రస్తుత సంవత్సరానికి (2026) గాను ప్రపంచంలోని అత్యుత్తమ విమానయాన సంస్థల్లో సింగపూర్ ఎయిర్‌లైన్స్ అగ్రగామిగా నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుంది. 2025లో అగ్రస్థానంలో ఉన్న ఖతార్ ఎయిర్‌వేస్ రెండో స్థానానికి దిగిరాగా.. క్యాథే పసిఫిక్ మూడో స్థానాన్ని నిలబెట్టుకుంది. స్కైట్రాక్స్ ఈ ర్యాంకింగ్‌లను ఇచ్చింది. అయితే తొలి 10, 50 ర్యాంకుల్లో భారత్‌కు చెందిన ఏ ఒక్క విమానయాన సంస్థకూ చోటు దక్కకపోవడం గమనార్హం. 100కు పైగా దేశాల నుంచి సేకరించిన ప్రయాణికులకు అభిప్రాయాల ఆధారంగా ఈ ర్యాంకులు ఇచ్చారు. దీని ప్రకారం.. 2025లో రెండో స్థానంలో ఉన్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఈ ఏడాది మొదటి స్థానానికి ఎగబాకింది. ఏఎన్ఏ ర్యాంకు గతేడాది 5 కాగా.. ఈ ఏడాది దానిని నాలుగో స్థానానికి మెరుగుపర్చుకుంది. టర్కిష్ ఎయిర్‌లైన్స్ ర్యాంకు 6 నుంచి 5కి మెరుగవ్వగా.. ఎమిరేట్స్ ర్యాంకు 4 నుంచి 6కి పడిపోయింది. ఎయిర్‌ఫ్రాన్స్, జపాన్ ఎయిర్‌లైన్స్, కొరియన్ ఎయిర్ తొలి 10 స్థానాల్లో నిలిచాయి.



**ఈ ర్యాంకింగ్‌ను ఎలా ఇస్తారంటే..**

అంతర్జాతీయ ప్రయాణికుల సర్వే ఆధారంగా స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌లైన్ అవార్డ్స్ ర్యాంకులను నిర్ణయిస్తారు. 2025 సెప్టెంబరు నుంచి 2026 ఆగస్టు వరకు జరిగిన ఈ సర్వేలో 300కి పైగా విమానయాన సంస్థల ప్రయాణికులు పాల్గొన్నారు. క్యాబిన్, విమానాశ్రయ సేవలు, సౌకర్యవంత సీట్లు, పరిశుభ్రత, భోజనం, వినోదం, వై-ఫై, ఛార్జీలకు తగిన వసతుల వంటి అంశాల ఆధారంగా విమానయాన సంస్థలకు రేటింగ్‌ను ఇస్తారు. ఈ ర్యాంకులు విమానయాన సంస్థలకు సంబంధించి విమానాల సంఖ్య, ఆర్థిక పనితీరు, సమయపాలనే కాకుండా ప్రయాణికుల ప్రాధాన్యం, సంతృప్తిని కూడా ప్రతిబింబిస్తాయి.

**100లో మనవి రెండే..**

ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ 100 విమానయాన సంస్థల్లో మన దేశం నుంచి కేవలం రెండు సంస్థలకే చోటుదక్కింది. ఎయిరిండియాకు 57వ ర్యాంకు, ఇండిగోకు 61వ ర్యాంకు లభించాయి. 2025లో ఎయిరిండియా 84వ స్థానంలో ఉండగా.. ఈ ఏడాది 27 స్థానాలను మెరుగుపర్చుకుంది. మరోవైపు ఇండిగో 22 స్థానాలు కిందకు దిగివచ్చింది. స్కైట్రాక్స్ ప్రాంతీయ ర్యాంకింగ్‌ల విషయానికొస్తే.. భారత్, దక్షిణాసియాలోని విమానయాన సంస్థల్లో ఎయిరిండియా మొదటి స్థానంలో, ఇండిగో రెండో స్థానంలో నిలిచాయి. ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్, స్పైస్‌జెట్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో రూ.80వేల లోపు ఐఫోన్ 17?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ ధరలు పెరుగుతున్న వేళ.. ఆఫర్ల కోసం ఎదురు చూస్తున్నవారి సంఖ్య అధికమనే చెప్పొచ్చు. అందుకు తగ్గట్టుగానే టెక్ ప్రియులను అలరించేందుకు భారీ ఆఫర్లు రాబోతున్నాయి. దిగ్గజ ఇ-కామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ పండగ సేల్స్‌కు సిద్ధమవుతున్నాయి. అక్టోబర్ 9న ప్రారంభమయ్యే బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో ఐఫోన్ 17పై ఫ్లిప్‌కార్ట్ భారీ డిస్కౌంట్ ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన టీజర్ తన మైక్రోసైట్‌లో విడుదల చేసింది. ఈ టీజర్‌లో ఐఫోన్ 17ను ఏ బడ్జెట్‌లో తీసుకురాబోతుందో చెప్పింది. కచ్చితమైన ధరను వెల్లడించనప్పటికీ, రూ.80 వేలలోపు (7చీ,చీచీచీ) రాబోతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్‌లో ఐఫోన్ 17 ధర రూ.98,900గా ఉంది. బ్యానర్‌లో చూపించిన రేటు కార్డు.. ఆఫర్‌తోనా? వేరేగానా? అనేది తెలియరాలేదు. ఆఫర్‌లో భాగంగా ఒకవేళ ఐఫోన్ 17 ధర రూ.79,999గా ఉన్నా.. రూ.20 వేల వరకు డిస్కౌంట్ లభిస్తుంది. త్వరలోనే ఆఫర్ల వివరాలు ఒక్కొక్కటిగా వెల్లడి కానున్నాయి. ఐఫోన్ 18 సిరీస్ విడుదల సందర్భంగా పాత ఐఫోన్ ధరలను యాపిల్ భారీగా పెంచిన విషయం తెలిసిందే. ఐఫోన్ 17పై 20 శాతం పెంచింది. దీంతో బేస్ వేరియంట్ 256 జీబీ స్టోరేజీ ధర రూ.82,900 నుంచి రూ.99,900కు చేరింది. బీబీడీ సేల్ కంటే ముందుగానే ఫ్లిప్‌కార్ట్ మరో సేల్‌తో అలరించనుంది. సెప్టెంబర్ 24న ఎర్లీ బర్డ్ డీల్స్ ప్రారంభం కానున్నట్లు తెలిపింది. రూ.1,250 వెల్‌కమ్ వోచర్స్‌పై 10 శాతం డిస్కౌంట్ ఉంది. యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డు హోల్డర్స్‌కు 10 శాతం ఆఫర్లు ఉండనున్నాయి. ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్స్, గృహోపకరణాలు వంటి వాటిపై ఆఫర్లు రాబోతున్నాయి.




# నాసిరకం స్క్రీన్ ప్రొటెక్టర్లపై నిషేధం..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మనం నిత్యంవాడే మొబైల్ ఫోన్ స్క్రీన్ ప్రొటెక్టర్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిర్ణీత ప్రమాణాలు అందుకోని నాసిరకం ప్రొటెక్టర్ల అమ్మకాలపై నిషేధం విధించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలు అందుకున్న ప్రొటెక్టర్లనే ఇకపై విక్రయించాలని స్పష్టంచేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఇప్పుడు అనివార్యమైపోయింది. మొబైల్ ఫోన్ స్క్రీన్‌పై గీతలు పడకుండా, పొరపాటున చేజారినా పాడవకుండా ఉండేందుకు దాదాపు అందరూ ఈ స్క్రీన్ ప్రొటెక్టర్లను వినియోగిస్తుంటారు. రోడ్డు మీద రూ.50 మొదలుకొని రూ.500 వరకు వివిధ ధరల్లో లభ్యమవుతుంటాయి. ధరను బట్టి వీటి నాణ్యతలోనూ తేడాను గమనించొచ్చు. ఈ నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ ప్రొటెక్టర్లను బీఐఎస్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ నిబంధనలు పాటించేందుకు గడువు ఇచ్చింది.

# దరఖాస్తుల్లో మహిళే మెరుగ్గా..

## ఉద్యోగాల కోసం 43.5% వారి నుంచే : నివేదిక

ముంబయి: ఫ్రంట్‌లైన్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే వారిలో మహిళల వాటా 43.5 శాతంగా ఉందని, అయితే మహిళా అభ్యర్థుల కోసం విడుదల అవుతున్న ఉద్యోగ ప్రకటనలు కేవలం 13 శాతమే ఉంటున్నాయని పేర్కొంది. ఉద్యోగాల కోసం మహిళల నుంచి పెరుగుతున్న ఆసక్తికి, కంపెనీల వద్ద ఉద్యోగాల లభ్యతకు మధ్య స్పష్టమైన అంతరాన్ని ఇది తెలియజేస్తోందని వెల్లడించింది. 2026 ఏప్రిల్- జూన్ మధ్య 772 నగరాల్లో, 50కి పైగా ఫ్రంట్‌లైన్ ఉద్యోగ విభాగాల్లో నమోదైన 65 లక్షలకు పైగా ఉద్యోగ ప్రకటనలు, 98 లక్షలకు పైగా దరఖాస్తుల ఆధారంగా వర్క్ ఇండియా రోజ్‌గార్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం.. ఈ ప్లాట్‌ఫామ్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే వారిలో మహిళల వాటా ఇప్పుడు 43.5 శాతానికి పెరిగింది. ఏడాదిక్రితం ఈ సంఖ్య 40.4 శాతంగా ఉండేది. 'మాకు అత్యంత ప్రోత్సాహకరమైన అంశం ఏమిటంటే.. ఎక్కువ మంది మహిళలు చురుకుగా ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నారు. ఉపాధి అనేది ఒక వ్యక్తి ఆదాయాన్ని మాత్రమే కాకుండా, ఒక కుటుంబం ఆర్థిక గమనాన్ని కూడా మార్చగలద'ని అని వర్క్ఇండియా సహవ్యవస్థాపకుడు, సీఈఓ నీలేశ్ దుంగర్వాల్ అన్నారు. అయితే కంపెనీల నుంచి డిమాండు ఇంకా కొంత పెరగాల్సి ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. సౌలభ్యం, భద్రత, పని ప్రదేశాలు వంటి అంశాల్లో అవరోధాలు పరిష్కరించగలిగితే ఫ్రంట్‌లైన్ ఉద్యోగాల విషయంలో మహిళలు అత్యంత ముఖ్యమైన ప్రతిభా వనరుల్లో ఒకటిగా మారుతారని నీలేశ్ చెప్పారు. ఈ నివేదిక ప్రకారం.. దరఖాస్తులో పెరుగుదల అనేక ఉద్యోగ విభాగాల్లో విస్తరించి ఉందని నివేదిక కనుగొంది. ఇందులో సేల్స్ విభాగానికి అత్యధికంగా 56 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా.. ఆ తర్వాతి స్థానాల్లో ఆఫీస్ ఆధారిత ఉద్యోగాలు, ప్రయాణ, ఆతిథ్య రంగాలు ఉన్నాయి. బ్యూటీషియన్ ఉద్యోగాలకు వచ్చిన దరఖాస్తుల్లో 86.6%, బోధన ఉద్యోగాలకు వచ్చిన దరఖాస్తులో 80.7 శాతం మహిళలవే. వీటితో పాటు సేల్స్, ఆఫీస్, మార్కెటింగ్, కస్టమర్ సేవల ఆధారిత ఉద్యోగాలు సహ పలు ఫ్రంట్‌లైన్ ఉద్యోగాల కోసం మహిళలు ఎక్కువగా అన్వేషిస్తున్నారని నివేదిక తెలియజేస్తోంది. 2026 జూన్- జులైలో ఉద్యోగ దరఖాస్తులు గతేడాదితో పోలిస్తే 65 శాతం పెరిగాయి. ఇది ఉద్యోగ ప్రకటనల్లో నమోదైన 40-48% పెరుగుదల కంటే చాలా ఎక్కువ. ఐటీ, మానవ వనరులు (హెచ్‌ఆర్), అకౌంట్స్, సేల్స్, ఆఫీస్ ఆధారిత ఉద్యోగాల వంటి విభాగాల్లో పోటీ ప్రత్యేకంగా కేంద్రీకృతమై ఉంది. డెలివరీ, డ్రైవింగ్, తయారీ రంగాల్లో దరఖాస్తులు పరిమితంగా ఉన్నాయి. 92 శాతం ఫ్రంట్‌లైన్ ఉద్యోగ ప్రకటనల్లో ఆంగ్ల ప్రావీణ్యం అవసరం లేదని లేదా కేవలం ప్రాథమిక సంభాషణా ఆంగ్లం సరిపోతుందని ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మరింత మందికి ఉపాధి అవకాశాలను



అందుబాటులోకి తేవడంలో హిందీ, ఇతర ప్రాంతీయ భాషలు సరిపోతాయనే విషయాన్ని ఇది తెలియజేస్తోంది.
తమ ప్రతిభావంతుల సంఖ్యను పెంచుకోవాలనుకునే సంస్థలు.. ముఖ్యంగా మహిళలు, తొలిసారి ఉద్యోగంలో చేరేవాళ్లు, మెట్రోయేతర నగరాల్లోని అభ్యర్థుల కోసం ప్రాంతీయ భాషల్లో నియామకాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వడం పెంచుతున్నాయని నివేదిక వివరించింది.

**యూనికార్న్‌లలో 'భారతీయ' హవా**

భారత సంతతి వ్యక్తులకు 560 బి. డాలర్ల విలువైన షేర్లు

దిల్లీ: భారత సంతతి వ్యవస్థాపకులకు విదేశాల్లోని ప్రస్తుత, అంతక్రితం యూనికార్న్‌లలో ఉన్న షేర్ల విలువ 560 బి. డాలర్ల(సుమారు రూ.53.2 లక్షల కోట్లు)గా ఉంది. తాము రూపొందించిన కొత్త ఇండియన్ డయాస్పోరా ఇండెక్స్ ద్వారా ప్రోసస్, డీల్‌రూమ్ వీటిని లెక్కించారు. ఇది వ్యవస్థాపకుల వాస్తవ షేర్ల విలువను ప్రతిబింబించదని ఈ సందర్భంగా సంస్థ తెలిపింది. ప్రతీ కంపెనీ విలువను, వ్యవస్థాపకుల మధ్య సమానంగా విభజించి అందులో ఉన్న భారతీయ వ్యవస్థాపకులను ఈ సూచీ పరిగణనలోకి తీసుకుంది. భారత్‌లోని 102 యూనికార్న్‌లలో భారత సంతతి వ్యవస్థాపకులు 349 బి. డాలర్ల విలువైన షేర్లను కలిగి ఉన్నారు. ఇందులో ఫ్లిప్‌కార్ట్(36 బి. డాలర్లు), జొమాటో(30. బి.డాలర్లు), గ్రో(16 బి. డాలర్లు)లలో ఎక్కువ షేర్లున్నాయి. 243 బి. డాలర్ల విలువైన 70 యూనికార్న్‌లను భారతీయ వ్యవస్థాపకులే ఏర్పాటు చేశారు. అందులో జయ్ చౌధ్రీ(స్కేలర్) అరవింద్ జైన్, అరవింద్ నిత్రాకశ్యప్, బిపుల్ సిన్హా, సోహమ్ మజుందార్(రూబ్రిక్), అజీత్ సింగ్, ధీరజ్ పాండే, మోహిత్ అరోన్(న్యూటానిక్స్), దీపక్ పాఠక్, అభినవ్ గుప్తా(స్కిల్డ్) ఉన్నారు. ఇంకో 135 యూనికార్న్‌లలో భారతీయ సంతతి వ్యవస్థాపకులు ప్రధాన బృందంలో భాగంగా ఉన్నారు. వీరు 317 బి. డాలర్ల షేర్లను కలిగి ఉన్నారు. పాలో ఆల్టో, బ్లూమ్ ఎనర్జీ, ఆస్టెరా ల్యాబ్స్, పర్‌ప్లెక్సిటీ వంటి సంస్థలు ఇందులో ఉన్నాయి. మొత్తం 323 కంపెనీల్లో 200 సంస్థలు అమెరికాకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండడం లేదా అక్కడకు వెళ్లిన జాబితాలో ఉన్నాయి.



# పత్తి రైతులకు అండగా ప్రభుత్వం

**గుండ్లపల్లి రైతు వేదికలో మందుల పంపిణీ.. మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ కార్యక్రమం**

**గన్నేరువరం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ" పథకం ద్వారా పత్తి విత్తనాలు పొందిన రైతులకు గుండ్లపల్లి రైతు వేదికలో మంగళవారం వేప నూనె, క్రిమిసంహారక మందుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ మానకొండూర్ ఎన్. శ్రీధర్ రైతులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం సీసీఐ ఎగ్జిక్యూటివ్ ఆర్. విశాల్, ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం జిల్లా కన్సల్టెంట్ పి. సాయినాథ్ రైతులతో మాట్లాడుతూ.. ఈ పథకం వివరాలు, ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న మందులను ఎలా వాడాలనే దానిపై సూచనలు చేశారు. అనంతరం ఏఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి. రాంప్రసాద్, ఏడీఏ మానకొండూర్ శ్రీధర్, ఆగ్రానమీ సైంటిస్ట్ రజనీకాంత్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఏఈఓలు అంజలి, వంశీ కలిసి ఖాసీంపేట, గుండ్లపల్లిలోని పత్తి చేనులను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. రైతుల చేనులో ఉన్న చీడపీడలను పరిశీలించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సబ్సిడీపై ఇచ్చిన మందులు ఏ మందు ఎంత మోతాదులో వాడాలి, పూత, కాయ రాలకుండా ఉండేందుకు "చమత్కార్" అనే మందును ఎంత మోతాదులో వాడాలనే అంశంపై రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పత్తి రైతులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు 25 గొర్రెలు మృతి

- తమ కళ్లముందే గొర్రెలు మృత్యువాత పడడంతో సదయ్య, నరేష్ కన్నీటి పర్యంతమయ్యారు
- గొర్రెల పెంపకమే జీవనాధారం



**పెద్దపల్లి,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం మూలసాల గ్రామంలో పిడుగుపాటుకు 25 గొర్రెలు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయిని సదయ్య,కాసు నరేష్‌లకు చెందిన గొర్రెలను అన్నయ్యకుంట చెరువు సమీపంలో మేపుతుండగా అకస్మాత్తుగా వర్షం కురిసింది. ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో మందలోని 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. అకాలంగా సంభవించిన ఈ ఘటనతో గొర్రెల కాపరులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ కళ్ల ముందే గొర్రెలు మృత్యువాత పడటంతో సదయ్య, నరేష్ కన్నీరుమున్నీరుగా విలపించారు. గొర్రెల పెంపకమే తమ జీవనాధారమని, ఒక్కసారిగా ఇంత పెద్ద సంఖ్యలో గొర్రెలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల మృతితో తమ కుటుంబాలపై ఆర్థిక భారం పడిందని, ప్రభుత్వం స్పందించి నష్టపోయిన గొర్రెల కాపరులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు. జిల్లా యాదవ్ సంఘం నాయకులు స్పందించి బాధితులకు అండగా ఉండి సంబంధిత అధికారులకు,జిల్లా కలెక్టర్ కు స్థానిక ఎమ్మెల్యే మరియు మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

- నాలుగు వరసలు రహదారి నిర్మాణంతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి
- బాధితులకు ప్రభుత్వం తరఫున న్యాయం జరిగేలా కృషి చేస్తాం
- చిగురుమామిడి గ్రామసభలో కరీంనగర్ ఆర్డీవో షర్మిల

**చిగురుమామిడి సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** చిగురుమామిడి మండల కేంద్రంలో చేపట్టనున్న నాలుగు వరసల రహదారి విస్తరణ పనులకు ప్రజలందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని కరీంనగర్ ఆర్డీవో షర్మిల కోరారు. మంగళవారం చిగురుమామిడి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్డీవో షర్మిల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంతో చిగురుమామిడి మండల కేంద్రం అన్ని రంగాల్లోనూ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ వల్ల ఇళ్లు,స్థలాలు కోల్పోయే బాధితులకు ప్రభుత్వం తరఫున పూర్తి న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనులకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తేనే ఇల్లు కూల్చివేతకు సహకరిస్తామని బాధితులు గ్రామసభలో వెల్లడించారు. ఈ గ్రామసభలో తహసిల్దార్ కనకయ్య,సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సింగిల్ విండో చైర్మన్ చిట్టమల్ల రవీందర్,వార్డు సభ్యులు,వివిధ శాఖల అధికారులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోషకాహారంతో బంగారు భవితకు బాటలు

- అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- ఆరేళ్లలోపు పిల్లల ఎదుగుదలపై పర్యవేక్షణ
- తల్లులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- ఎదుగుదల లోపాలుంటే సకాలంలో వైద్యం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** పిల్లలకు చిన్ననాటి నుంచే క్రమం తప్పకుండా పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. 9వ పోషణ మాసం సందర్భంగా 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా మంగళవారం తంగళ్ల పల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రు లకు పోషణ మాసం ప్రాధాన్యతను వివరించారు. కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, నువ్వులు, బాలామృతంతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ప్రతి మంగళవారం అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో 10 నిమిషాల కార్యక్రమం నిర్వహించి కేంద్రాల సేవలు, వసతుల మెరుగుదల, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఆరేళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లి ఎత్తు, బరువు నమోదు చేయించాలని, దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని తెలిపారు. ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా పిల్లలకు ప్రాథమిక విద్య అందుతుందని చెప్పారు. తీవ్రమైన, మధ్యస్థ పోషకాహార లోపం, తక్కువ బరువుతో ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు కేంద్రాలను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత అని, మొదటి వెయ్యి రోజుల దశలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. చక్కెర పదార్థాలకు దూరంగా ఉంచాలని సూచించారు.

గర్భిణులు, బాలింతలు, మహిళలు ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలను ఆహారంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపాలు, వినికిడి, మాట, నడక, మానసిక, పుట్టుకతో వచ్చే లోపాలు, రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను గుర్తిస్తే అంగన్వాడీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి ప్రత్యేక వైద్య నిపుణులతో చికిత్స అందిస్తారని, అవసరమైన వారికి హైదరాబాద్‌లో ఉన్నత వైద్యం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, సర్పంచ్ మోర లక్ష్మీరాజం, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన చట్టాలపై దళిత జాతులను చైతన్యం చేస్తాం

- తలకొండపల్లిలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టంపై మండల స్థాయి సమావేశం
- పార్టీలకతీతంగా దళిత జాతి సమైక్యత కోసం సివిఎంసి కృషి చేస్తుంది
- తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ సివిఎంసి మానిటరింగ్ కో-ఆర్డినేటర్ చిట్టిబాబు



**తలకొండపల్లి,సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మండల స్థాయి సమావేశం సివిఎంసి మండల కో-ఆర్డినేటర్ మిన్నాల డేవిడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం సివిఎంసి, దళిత బహుజన శ్రామిక యూనియన్ తెలంగాణ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సివిఎంసి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ మానిటరింగ్ కో-ఆర్డినేటర్ చిట్టిబాబు,తెలంగాణ రాష్ట్ర సివిఎంసి కన్వీనర్ నరసింహా,రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జోగు రమేష్,లు హాజరై ప్రసంగించారు. ఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న దాడులు,వివక్షను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ చైతన్యవంతం కావాలని,చట్టంపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. బాధితులకు తక్షణ న్యాయం అందించడం లో సివిఎంసి కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. దళితులపై ఏదైనా దాడి జరిగినప్పుడు బాధితులు భయపడకుండా వెంటనే పోలీసులకు, విజిలెన్స్ కమిటీకి సమాచారం అందించాలని సూచించారు. కేసు నమోదు నుండి పరిహారం అందే వరకు కమిటీ బాధితులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి రావాల్సిన పరిహారం, రాయితీలు, సంక్షేమ పథకాలపై కూడా చర్చించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఎస్సీ,ఎస్టీలకు రావాల్సిన రిజర్వేషన్లు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని పర్యవేక్షించడమే సివిఎంసి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తలకొండపల్లిని వివక్షత లేని మండలంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా సివిఎంసి పనిచేస్తుందని వారు పిలుపునిచ్చారు. అనంతరం మండ లంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు చర్చించారు. ప్రతి గ్రామంలో సివిఎంసి కమిటీలను ఏర్పాటు చేసి దళితులు ఆత్మ గౌరవంతో జీవించేందుకు సివిఎంసి అండగా ఉంటుందని భరోసనిచ్చారు. ముఖ్యంగా గ్రామాలలో చదువుకున్న యువతకు చట్టాలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ జ్ఞాన జాతర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్, తలకొండపల్లి మండల కన్వీనర్ డేవిడ్, జిల్లా కమిటీ సభ్యులు దర్పుల శంకర్, గొడిగ వెంకటయ్య, దళిత సంఘాల నాయకులు పబ్బతి వెంకటయ్య, బండగల్ల చందు, తూర్పు శ్రీను, మీసాల మహేష్, పోతుగంటి కుమార్, కిరణ్ పూలే, మల్లేష్, వెంకటయ్య, రాజు, శ్రీశైలం, నరసింహ, బాలమ్మ, లక్ష్మీదేవి ఉన్నారు.

# పెండింగ్ కార్మిక సమస్యలు పరిష్కరించాలి

**అర్జీ-2 ఏరియాలో ఏఐటీయూసీ మెమోరాండాలు**




- గనులు, డిపార్ట్‌మెంట్లలో యాజమాన్యానికి వినతి
- చర్చలతో సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్
- కార్మిక హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం

**గోదావరిఖని, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** సింగరేణి సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అర్జీ-2 ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో యాజమాన్యానికి మంగళవారం మెమోరాండాలు సమర్పించారు. ఏఐటీయూసీ సెంట్రల్ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు ఆధ్వర్యంలో, ఆయా గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రటరీల అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా పెండింగ్ అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ రాజారత్నం మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై యాజమాన్యం తక్షణమే స్పందించి సంఘాలతో చర్చలు జరపాలని కోరారు. చర్చల ద్వారానే సమస్య లకు పరిష్కారం చూపాలని, కార్మిక హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శులు శ్యాంసన్, ఆవుల రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడి మహేందర్, పిట్ సెక్రటరీలు, మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన

- ఉప్పట్ల కేసారం భూముల రికార్డుల పరిశీలన
- రైతుల అభ్యంతరాల తర్వాతే భూసేకరణపై నిర్ణయం
- గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- తాగునీటిలో క్లోరినేషన్ తప్పనిసరి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డు లు, రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం రామగిరి మండలం ఉప్పట్ల కేసారం గ్రామంలోని సర్వే నంబర్ 35లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. భూమికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పా రు. రాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములుతో కలిసి భూ నిర్వాసితులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సింగరేణి భూసేకరణకు సంబంధించిన ప్రాజెక్టు నివేదిక అందిందని, రైతుల అభ్యంతరాలు, అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీవోలు, డీపీవోతో నిర్వహించిన సమీక్షలో గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా, రోడ్లు, వీధులు, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మురుగు కాలువల్లో పూడిక తొలగించడం, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడం, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోతులు, కుక్కల బెడద అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థలను నిరంతరం పరిశీలిస్తూ నీటి నాణ్యతను నిర్ధారించాలని, క్లోరినేషన్ తప్పనిసరిగా నిర్వహించి స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించి నమోదు చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా ఎంపీవోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశాలు, పర్యటనల్లో డీసీపీ రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేష్, తహసీల్దార్ సుమన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీమాల, ఎంపీవోలు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పూర్తికావస్తున్న బస్సు డిపో పనులు

- దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో ప్రారంభం
- నాణ్యత ప్రమాణాలతో డిపో పనులు చేపట్టాలి
- రాష్ట ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు

**పెద్దపల్లి,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ. 8 కోట్లతో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆర్టీసీ డిపో పనులను మంగళవారం ఆర్టీసీ అధికారులు మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శాసనసభ్యులు. చింతకుంట విజయరమణ రావు ముందుగా పెద్దపల్లి, పట్టణ కేంద్రం లో ప్రభుత్వ విప్ విజయరమణ రావు మంగళవారం పలు వినాయక మండపాలను సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి చిరకాల స్వప్నం అయినటువంటి పెద్దపల్లి బస్సు డిపోను రూ.8 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేత మంజూరు చేయించుకోవడం జరిగిందని ఆ బస్సు డిపో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. డిపో నిర్మాణ పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో జరుగుతున్నాయని దసరా నాటికి దేవి నవరాత్రుల్లో బస్సు డిపో ప్రారంభించుకోవడం జరుగుతుందని అన్నారు. డిపోలో మిగిలి ఉన్న పనులు త్వరగా నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు.

# నీటి సంపులో పడి బాలుడి మృతి

**కేశంపేట, సెప్టెంబర్ 22( జనం సాక్షి ) :** నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భూత్పూర్ మండలం కొర్ర పంప తండాకు చెందిన కాట్రావత్ దేవి మంగళవారం తన కుమారుడు కాట్రావత్ హనుమంతు(13) ను మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ పొలంలో మేకలు మేపడానికి పంపింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పొలంలో ఉన్న నీటి సంపులో మేకలు పడ్డాయి. నీటి సంపులో పడ్డ మేకలను బయటకి తీయడానికి హనుమంత్ ప్రయత్నించాడు. హనుమంత్‌కు ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుని తల్లి కాట్రావత్ దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పరమేష్ తెలిపారు.



## ఎర్రగడ్డ మెంటల్ దవాఖాన నుంచి ఖైదీ పరార్!

**బోరబండ:** చెర్లపల్లి జైలు ఖైదీని మానసిక చికిత్స కోసం ఎర్రగడ్డ మెంటల్ దవాఖానకు తీసుకొచ్చారు. చికిత్స సమయంలో భద్రతా సిబ్బందిని మోసం చేసి ఖైదీ పరారైన ఘటన కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఖైదీ ఎలా తప్పించుకున్నాడు? భద్రతలో లోపాలు ఉన్నాయా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# భారీ పెట్టుబడి మోసం కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు

- ప్రధాన నిందితుడు సహా ముగ్గురు అరెస్ట్
- లక్నోలో అదుపులోకి తీసుకున్న ప్రత్యేక బృందం
- ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలింపు
- బాధితులు పోలీసులను సంప్రదించాలి




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** కరీంనగర్‌లో కోట్లాది రూపాయల పెట్టుబడి మోసం కేసును పోలీసులు ఛేదించారు. శ్రేయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పెట్టుబడి పథకాలు నిర్వహిస్తూ ప్రజలను మోసగించిన కేసులో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్ రాయ్‌తో పాటు రాజేష్ కుమార్, బ్రిజేష్ కుమార్ మిశ్రాలను అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. 2020లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో సంస్థను ఏర్పాటు చేసి, తక్కువ కాలంలో పెట్టుబడులు రెండింతలు, మూడింతలు అవుతాయని నమ్మించి భారీగా నగదు సేకరించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నెట్‌వర్క్ చైన్ విధానంలో కొత్త పెట్టుబడిదారుల నుంచి సేకరించిన డబ్బుతో పాత వారికి చెల్లింపులు చేస్తూ మరింత మందిని ఆకర్షించినట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించి పెట్టుబడులు సేకరించిన నిందితులు.. మే 2024 నుంచి చెల్లింపులు నిలిపివేసి మోసానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. బాధితుడు గుగులోత్ శివరాజు ఫిర్యాదుతో కరీంనగర్ ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, సీపీ ఆదేశాలతో దర్యాప్తును సీసీఎస్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి సెప్టెంబర్ 18 రాత్రి లక్నోలో నిందితులను వారి నివాసాల్లో అదుపులోకి తీసుకుంది. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లక్నో చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాశ్ గౌడ్, ఎస్ఐ డి. మహిపాల్ రెడ్డి, సిబ్బందిని సీపీ అభినందించారు. మోసానికి గురైన బాధితులు సమీప పోలీస్‌స్టేషన్ లేదా సీసీఎస్ కరీంనగర్‌ను సంప్రదించాలని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు.. 24 కిలోల గంజాయి స్వాధీనం

- రూ.24 లక్షల విలువైన గంజాయి, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్



**ఘట్‌కేసర్ (పోచారం) సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** అంతర్రాష్ట్ర గంజాయి రవాణా నెట్‌వర్క్‌పై ఎస్ఓటీ ఉప్పల్ జోన్, పోచారం ఐటీ కారిడార్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి 24 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం తదితర వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.24 లక్షలు ఉంటుందని వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు సెప్టెంబర్ 21న యమ్మనంపేట్ గ్రామంలోని పద్మనాభ స్వామి ఆలయం ఆర్చ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గోవా వైపు గంజాయిని తరలిస్తున్నట్లు అనుమానించిన మారుతి సుజుకి బాలెనో కారును తనిఖీ చేశారు. కారు డిక్కీలో నాలుగు బ్లాకులుగా ప్యాక్ చేసిన సుమారు 24 కిలోల ఎండు గంజాయి గుర్తించారు. ఈ కేసులో గోవాకు చెందిన అనిల్‌కుమార్ గౌడ (30), అవినాష్ శర్మ (25)లను పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు ట్యాక్సీ డ్రైవర్‌గా ఉన్న దాదా పర్ ఏ దాదా (35), ఒడిశాకు చెందిన శివ ఏ ప్రమోద్ (25) కూడా ఈ నెట్‌వర్క్‌లో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే దాదా పర్, శివ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. కారు, సెల్‌ఫోన్లు స్వాధీనంపోలీసులు 24 కిలోల గంజాయితో పాటు సుమారు రూ.10 లక్షల విలువైన మారుతి సుజుకి బాలెనో కారు, రెండు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు, ఒక చిన్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఒడిశా నుంచి గోవాకు..నిందితులు ఒడిశా నుంచి గంజాయిని సేకరించి గోవాకు తరలిస్తూ, అక్కడి నుంచి అవసరమైన వినియోగదారులకు సరఫరా చేసే నెట్‌వర్క్‌లో పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం కింద నమోదు చేసినట్లు పోచారం ఐటీ పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు.



- అభివృద్ధి కమిటీల పరిధి దాటుతున్నాయనే ఆరోపణలు
- ఇసుక, మద్యం వేలాల్లో జోక్యంపై విమర్శలు
- ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థుల వెనుకడుగు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని డిమాండ్

# మితిమీరుతున్న ఆగడాలు?

## వీడీసీల పేరుతో సమాంతర పాలన?

**ఉమ్మడి మేడిపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల పర్యవేక్షణ కోసం ఏర్పాటైన వీడీసీలు (గ్రామ అభివృద్ధి కమిటీలు) కొన్ని చోట్ల తమ పరిధి దాటి వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి మండలంలో నాలుగు, భీమారం మండలంలో ఆరు గ్రామాల్లో వీడీసీలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వివిధ కుల సంఘాల నుంచి సభ్యులను తీసుకుని కమిటీ ఏర్పాటు చేసి అధ్యక్షుడిని ఎన్నుకుంటారని, కొన్ని గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలకు సమాంతరంగా నిర్ణయాలు తీసుకోవడం, గ్రామ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, జరిమానాలు విధించడం, ఇసుక, మద్యం తదితర అంశాల్లో వేలం పాటలు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల దుకాణదారుల నుంచి గ్రామాభివృద్ధి పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, చెల్లించని వారికి నిత్యావసర వస్తువుల విక్రయాలపై ఆంక్షలు విధిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీల పరిధిలోని వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో పాటు టెండర్ల ద్వారా వచ్చే నిధుల వినియోగంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




వీడీసీలపై ఫిర్యాదు చేస్తే సామాజిక బహిష్కరణకు గురవుతామనే భయంతో కొందరు బాధితులు వెనకడుగు వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పోలీస్, న్యాయస్థానాల పరిధిలోని వివాదాలను కమిటీలే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలపైనా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. వీడీసీల పేరుతో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తే సమగ్రంగా విచారించి చర్యలు తీసుకోవాలని, పంచాయతీల అధికారాలకు భంగం కలగకుండా స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని ఉమ్మడి మేడిపల్లి ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వీడీసీల కార్యకలాపాలపై నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# అనుమానాస్పద స్థితిలో ప్రైవేటు ఉద్యోగిని మృతి

- హోటల్ గదిలో అపస్మారక స్థితిలో గుర్తింపు
- ఆస్పత్రికి తరలించేలోపే మృతి.. ప్రియుడిపై హత్య కేసు నమోదు
- నిందితుడి కోసం ప్రత్యేక బృందాల గాలింపు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రైవేటు ఉద్యోగిని షారోన్ నిఖిత తోప్నో (29) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన నిఖిత సోమవారం తన ప్రియుడు శ్రీనివాస రవితేజతో కలిసి సిద్ధిక్‌నగర్ రోడ్ నంబర్ 5లోని ఓఎస్ఎల్ఎన్ టెర్మినస్ హోటల్‌లో గది తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత నిఖిత అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన రవితేజ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. హోటల్ సిబ్బంది ఆమెను గుర్తించి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి ముఖంపై స్వల్ప గాయాలు గుర్తించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిపై హత్య కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించి గదిని సీజ్ చేసింది. పరారీలో ఉన్న రవితేజ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు తెలిపారు.

# జూరాల ఆయకట్టు రైతులకు భరోసా

### ఒక్క ఎకరం పంట కూడా ఎండనివ్వం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 22 జనంసాక్షి :** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒక్క ఎకరం భూమి కూడా ఎండిపోకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ప్రస్తుత పంటలకు సాగునీరు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు లేఖ రాశారని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణలోని జూరాల, భీమా, నెట్టెంపాడు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పరిధిలోని పంటలను కాపాడేందుకు రోజుకు 5,000 క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు కృష్ణా జలాలను నియంత్రితంగా విడుదల చేయాలని లేఖలో కోరినట్లు చెప్పారు. ఈ నాలుగు సాగునీటి పథకాల పరిధిలో తెలంగాణలో సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టు కృష్ణా జలాలపై ఆధారపడి ఉందని మంత్రి తన లేఖలో పేర్కొన్నట్లు మేఘారెడ్డి తెలిపారు. ప్రస్తుతం పంటలకు కీలకమైన దశ కావడంతో సకాలంలో సాగునీరు అందించడం అత్యంత అవసరమని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. రైతులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దని మేఘారెడ్డి కోరారు. పంటలు చేతికొచ్చే వరకు ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో సాగునీటిని సమకూర్చేందుకు కృషి చేస్తుందని తెలిపారు. జూరాల ఆయకట్టు కింద ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# వేములవాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో చోరీ.!

**వేములవాడ రూరల్, (జనంసాక్షి):** వేములవాడ రూరల్ మండల పరిషత్ అభివృద్ధి (ఎంపీడీవో) కార్యాలయంలో మంగళవారం చోరీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. మంగళవారం ఉదయం సిబ్బంది వచ్చి కార్యాలయం తలుపులు తెరిచి చూడగా, లోపల ఉన్న ఫ్యాన్, విద్యుత్ కేబుల్స్ మాయమైనట్లు గమనించారు. వెంటనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు పరిశీలించి దొంగతనం జరిగినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ వేగవంతం చేశారు.

# ఉద్యమకారుల హామీల సాధనకు ఆరో రోజూ దీక్ష

**అల్వాల్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్ సర్కిల్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. తెలంగాణ అమరవీరుల శిబిరంలో జరిగిన దీక్షలో అనిల్‌రాజ్, నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, రామయ్య కూర్చున్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. హామీల అమలులో జాప్యం చేయకుండా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
దీక్షలకు పుట్నాల కృష్ణ, ఏ.డీ. దయాకర్, అనంతుల సంతోష్, మల్లేష్, నగేష్, భాస్కర్, మహేష్ తదితరులు సంఘీభావం తెలిపారు.

# 55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలకు సర్వం సిద్ధం

### రెండు రోజులపాటు పోటీలు.. పాల్గొనున్న 10 జట్లు

**రెస్క్యూ, ఫస్ట్‌ఎయిడ్, థియరీ పరీక్షలు..జాతీయ పోటీలకు ప్రతిభావంతుల ఎంపిక**



**8 ఇంక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న 55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్జీ–2 ఏరియా జీఎం టి. లక్ష్మీపతిగౌడ్, రెస్క్యూ జీఎం కె. శ్రీనివాస్‌రెడ్డి పోటీల వివరాలను వెల్లడించారు. మొత్తం 10 జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఇందులో సింగరేణికి చెందిన ఆరు పురుషుల, రెండు మహిళా జట్లతోపాటు యూసీఐఎల్, హెచ్‌జీఎంఎల్ నుంచి రెండు జట్లు ఉంటాయని పేర్కొన్నారు. జీడీకే–7ఎల్‌ఈపీ గనిలో రెస్క్యూ ఈవెంట్స్, ఫ్రెష్ ఎయిర్ బేస్, రికవరీ విభాగాల్లో, మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో ఫస్ట్‌ఎయిడ్, స్టాట్యూటరీ, థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నవంబర్ 30 నుంచి డిసెంబర్ 6 వరకు జార్ఖండ్‌లోని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. గనుల్లో ప్రమాదాల సమయంలో కార్మికుల ప్రాణాలను రక్షించడంలో రెస్క్యూ సిబ్బంది నైపుణ్యాలు కీలకమని పేర్కొన్నారు. సమావేశంలో రెస్క్యూ, పర్సనల్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

### తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడికి అవకాశం : ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాష

- నాలుగేళ్లపాటు ప్రభుత్వ సహకారం
- అల్వాలలో తొలి పంట కోత మహోత్సవం



**కేశంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాష అన్నారు. కేశంపేట మండలం అల్వాలలో రైతు భుజంగరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తొలి పంట కోత మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యాస్మిన్ భాష మాట్లాడుతూ కూరగాయల సాగులో మార్కెట్ ధరల హెచ్చుతగ్గులతో కొన్నిసార్లు రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. దేశీయ వంటనూనెల అవసరాలకు అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆదాయం పొందేందుకు ఈ పంట దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ రైతులకు నాలుగేళ్లపాటు ప్రభుత్వం అవసరమైన సహకారం అందించడంతోపాటు గిట్టుబాటు ధర కల్పిస్తుందని వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఆయిల్‌పామ్ సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# ముఠా గోపాల్‌ను పరామర్శించిన బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** మోకాలి శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటున్న ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్‌ను ఆయన నివాసంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం పరామర్శించారు. ముఠా గోపాల్ నివాసానికి వెళ్లిన బండారు దత్తాత్రేయ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం ఎలా కోలుకుంటున్నారనే విషయాలను ముఠా గోపాల్‌ను అడిగి తెలుసుకున్న ఆయన, వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తిస్థాయిలో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజా సేవలో తిరిగి చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ కూడా తనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నందుకు బండారు దత్తాత్రేయకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు తన ఆరోగ్యం పట్ల చూపుతున్న ఆప్యాయత, అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వ్యక్తిగత కార్యదర్శి కైలాస్ నాగేష్ పాల్గొన్నారు.

# జాన్‌వెస్లీ అరెస్టును ఖండిస్తున్నాం

- జూరాల నుంచి పంటలకు సాగునీరు విడుదల చేయాలి : సీపీఎం డిమాండ్

**ముషీరాబాద్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):** జూరాల ప్రాజెక్టు కింద సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతుల పొలాలకు తక్షణమే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతుల సమస్యలను పరిశీలించేందుకు వెళ్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములును పోలీసులు అరెస్టు చేసి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించింది. జూరాల ప్రాజెక్టు కింద సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం నేతలు ఆరోపించారు. తమ భూములకు నీటిని విడుదల చేసుకునేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని నీటి సరఫరాను నిలిపివేశారని తెలిపారు. ఇదే సమయంలో రైతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వెళ్తున్న సీపీఎం నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. వనపర్తి జిల్లాలోనూ సీపీఐ(ఎం) నాయకులను అరెస్టు చేయడంతో పాటు కొందరిని గృహనిర్బంధంలో ఉంచడాన్ని ఖండించారు. ఇటీవల వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ గ్రామసభలు నిర్వహించి పంటలు సాగు చేయవద్దని అధికారులు రైతులకు ముందస్తుగా సూచించలేదని సీపీఎం పేర్కొంది.

ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన తర్వాత నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.
జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం సుమారు 8 టీఎంసీల నీరు ఉన్నట్లు రైతులు చెబుతున్నారని, అందులో నుంచి కొంత నీటిని విడుదల చేసినా పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని సీపీఎం తెలిపింది. అలాగే కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి నీటి లభ్యతకు సంబంధించిన అవకాశాలను పరిశీలించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. రైతుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోకుండా రైతులను, వారి తరఫున మాట్లాడుతున్న నాయకులను అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలని, రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. అరెస్టు చేసిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు, రైతులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రకటన విడుదల చేసింది.





# గుంతల రోడ్డుతో విసిగిపోయారు.. చివరికి ఆటోవాలాలే కదిలారు!

**చేవెళ్ల, సెప్టెంబరు 22 (జనంసాక్షి) :** చేవెళ్ల నుంచి ఫరా కళాశాల మీదుగా పలుగుట్ట, కందవాడ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీజాపూర్ ప్రధాన రహదారిలోని పలుగుట్ట గేటు నుంచి కందవాడ వరకు కూడా అడుగడుగునా గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో సమస్య పరిష్కారానికి ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. మంగళవారం ఉదయం కందవాడ, పలుగుట్ట గ్రామాలకు చెందిన సుమారు 12 మంది ఆటో డ్రైవర్లు శ్రమదానం చేపట్టారు. ఫరా కళాశాల నుంచి ఎర్రోనికొటాల రోడ్డు వరకు మట్టిని తరలించి గుంతలను పూడ్చారు. అధికారుల కోసం ఎదురుచూడకుండా తమకు తామే రహదారి మరమ్మతు చేపట్టడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. గుంతలు పూడ్చడంతో వాహనాల రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు తొలగాయి. భారీ వాహనాలతోనే రోడ్డు దుస్థితి.. లాన్సమ్, అర్గానో విల్లాల నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతోనే రహదారి దెబ్బతిన్నదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ భారీ వాహనాలు తిరుగుతుండటంతో రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని పేర్కొంటున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారం కాదని, అధికారులు స్పందించి రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# బిజెపి జూరాల పర్యటనకు అడ్డుకట్ట

### రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సహా పలువురి అరెస్ట్





**జడ్చర్ల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** జూరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బయలుదేరిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును మంగళవారం జడ్చర్ల మినర్వా హోటల్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. బిజెపి కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకుని 44వ జాతీయ రహదారిపై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. రామచందర్ రావుతో పాటు మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, శాంతి కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాల త్రిపుర సుందరి, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, బాలవర్ధన్ గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షుడు అమర్ నాథ్ గౌడ్, నాగరాజు, సాహితి రెడ్డి, నవీన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని జడ్చర్ల డిటిసికి తరలించారు. అరెస్ట్‌కు ముందు రామచందర్ రావు మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు వద్ద తగినంత నీరున్నా అధికారులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఎగువన ఉన్న కర్ణాటకలోని నారాయణపూర్, అల్మట్టి రిజర్వాయర్లలో కూడా నీరుందని, రెండు చోట్లా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నా నీటి విడుదలపై మాట్లాడకపోవడం విఫల పాలనకు నిదర్శనమన్నారు. పంటలు ఎండిపోతుండటంతో రైతుల పిలుపు మేరకే తాము బయలుదేరామని చెప్పారు. శాంతియుతంగా ఉన్న తమను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. రైతులను ఆదుకోవడం చేతకాక, ప్రశ్నించే వారిని అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా రైతుల పక్షాన బిజెపి పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆర్ఆర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పారిజాత

### నూతన అధ్యక్షురాలికి నియామక పత్రం అందజేత

**అధిష్ఠానం-కార్యకర్తల సమన్వయానికి కృషి.. మహిళా కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి**

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా చిగురింత పారిజాత నరసింహారెడ్డి నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు, కార్యకర్తలు ఆమె నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. జిల్లా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ అధిష్ఠానానికి పారిజాత కృతజ్ఞతలు తెలిపారు. అధిష్ఠానం, కార్యకర్తల మధ్య సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరమల్ల వీరేందర్‌గౌడ్, పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

### చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు అవగాహన

**క్రమశిక్షణ, పరస్పర గౌరవం పాటించాలి.. యూజీసీ నిబంధనలను వివరించిన పోలీసులు**

**యాంటీ-ర్యాగింగ్ ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు**




**ఘట్కేసర్ (పోచారం), సెప్టెంబర్ 22 (జనంసాక్షి):** శ్రీనిధి యూనివర్సిటీలో ర్యాగింగ్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు బి. నాగేశ్వర్‌రావు, కె. వెంకట్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలను వివరించారు. క్యాంపస్‌లో క్రమశిక్షణ, పరస్పర గౌరవంతో మెలగాలని సూచించారు. యూజీసీ యాంటీ–ర్యాగింగ్ నిబంధనలు, విద్యార్థుల బాధ్యతలను వివరించి, ర్యాగింగ్ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో యాంటీ–ర్యాగింగ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. అనంత్ పద్మనాభన్, రిజిస్ట్రార్ డా. టి. చంద్రశేఖర్, డీన్ డా. ఎం. కార్తికేయన్, అధ్యాపకులు, యాంటీ–ర్యాగింగ్ కమిటీ, స్క్వాడ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నదానంలో ఫుడ్ పాయిజన్

- కంసాన్‌పల్లిలో 39 మందికి అస్వస్థత





**ఉప్పునుంతల, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆహారం తీసుకున్న 39 మంది అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అద్దంకి సునీత మంగళవారం గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆహారం కలుషితం కావడంతో కొంతమందికి కడుపునొప్పి, వాంతులు తదితర సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. ఎవరికీ తీవ్ర ఇబ్బందులు లేవని, బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు డాక్టర్ స్వప్న, డాక్టర్ బిక్కు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సునీత తెలిపారు.

### 39 మంది వైద్య పరీక్షలు

మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో అన్నదాన కార్యక్రమంలో ఆహారం తీసుకున్న 39 మంది అస్వస్థతకు గురైన నేపథ్యంలో మంగళవారం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ స్వప్న, డాక్టర్ బిక్కు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆహారం తీసుకున్న అనంతరం కడుపునొప్పి, వాంతులు తదితర సమస్యలతో అస్వస్థతకు గురైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ఆహార పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

# ఏప్రిల్ నాటికి కాళేశ్వరం ఆలయ పనులు పూర్తి చేయాలి

- గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలి: మంత్రి శ్రీధర్‌బాబు
- బాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు



**కాళేశ్వరం , సెప్టెంబర్ 22 , ( జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేసి వచ్చే ఏప్రిల్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు.మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వరం ఆలయానికి చేరుకోగానే ఈవో మహేష్ ఆధ్వర్యంలో అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ ఆది ముక్తీశ్వరస్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. బాలాలయంలో కొలువుదీరిన కాళేశ్వర ముక్తీశ్వరస్వామివారిని, ఆలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతిని మంత్రి దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం చేయగా దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, చేర్మెన్ మోహన్ శర్మ స్వామివారి శేషవస్త్రాలతో మంత్రిని, తదితరులను సత్కరించి లడ్డు ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి అధికారులను అడిగి పనుల పురోగతిని తెలుసుకున్నారు. కాళేశ్వరంలోని దేవస్థానం ఈవో కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, అటవీ, దేవాదాయ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.198 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

# ఉపాధ్యాయులు లేరు.. చింతచెట్లే దిక్కు!

- పాఠశాలలో విద్యార్థులే.. చెట్లెక్కుతూ ఆటలు
- ఒక్క ఉపాధ్యాయుడు కాంప్లెక్స్ మీటింగ్‌కు..
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై గ్రామస్తుల ఆగ్రహం





**అచ్చంపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :** అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని అమ్రాబాద్ మండలం బీకే ఉప్పునుంతల గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరత సమస్యగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు చింత చెట్లు ఎక్కుతూ, ఆడుకుంటూ కనిపించిన దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారని, సమాచారం. దీంతో విద్యార్థులకు బోధన అందించేందుకు ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు , పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కాంప్లెక్స్ మీటింగ్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు సమావేశానికి వెళ్లిన సమయంలో మరో ఉపాధ్యాయుడిని ప్రత్యామ్నాయంగా పంపించే చర్యలు ఎందుకు చేపట్టలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల భద్రతతో పాటు విద్యాబోధనకు అంతరాయం కలగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, ప్రత్యామ్నాయ బోధనా ఏర్పాట్లపై విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పై విషయమై అమ్రాబాద్ ఎంఈఓ బాలకిషన్ వివరణ కోరగా ఉపాధ్యాయుడు సెలవు పై వెళ్లిన కాంప్లెక్స్ మీటింగ్ వచ్చిన ఇంకొకరిని ఏర్పాటు చేయడానికి ఎవ్వరూ లేరని నేను ఏమి చేయ లేనని సమాధానం ఇచ్చారు.

# ఎంజీఎంలో మళ్లీ పెచ్చులూడాయి

- భయాందోళనలు చెందుతున్న రోగులు
- అధికారులు పట్టించుకోవాలంటూ డిమాండ్





**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్ (ఎంజీఎం) లో ఏ వార్డులో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఎంజీఎం ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వార్డులో పెచ్చులు ఊడి ముగ్గురు పేషెంట్లకు గాయాలైన ఘటన మరువకముందే మరో ఘటన చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లో పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వరుస ఘటనలతో రోగులు, బంధువుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రోగాలు నొప్పులతో గాయాలతో ఆసుపత్రికి వస్తే నయం చేసి పంపించే ఆస్పత్రిలో పేషెంట్లకు భద్రత లేని పరిస్థితి కనిపిస్తుంది. సుమారు 60, 70 ఏళ్ల క్రితం నిర్మాణం నిర్మాణం చేసిన ఈ హాస్పిటల్ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడమే ఇందుకు కారణమా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హాస్పిటల్కు రావాలంటేనే రోగులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు అప్పుడప్పుడు మరమ్మతులు చేసినా కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరం. తాజాగా సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు, డీఎంఈ వాణి ప్రసాద్ ఇతర అధికారులు ఎంజీఎం హాస్పిటల్ సందర్శించిన సంగతి తెలిసిందే.. హాస్పటల్లో పెచ్చులూడి పడిపోవడమే కాకుండా, స్ట్రెచర్లు, వీల్ చైర్లు విరిగిపోయి నడవలేని పరిస్థితిలో ఉన్నాయి. అంతేకాకుండా పారిశుద్ధ్య లోపం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. హాస్పటల్ సిబ్బంది ఎవరు ఎక్కడ ఏం చేస్తున్నార్లో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వందలాది కోట్లతో నిర్మాణం చేసిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ త్వరగా ప్రారంభించి రోగులకు మెరుగైనటువంటి వైద్య సేవలు అందే విధంగా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా రోగులు, ప్రజలు కోరుతున్నారు.

## పోలీసులు బిఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట



వరంగల్ నగరంలోని ఎంజీఎం హాస్పిటల్ వద్ద మంగళవారం ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇటీవల ఎంజీఎం హాస్పిటల్ ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పై పెచ్చులు ఊడిపడి పలువురు పేషంట్లకు గాయాలు కాగా వారిని పరామర్శించేందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ తో పాటు కార్యకర్తలు నాయకులు ఎంజీఎం హాస్పిటల్ వద్దకు వచ్చారు. అయితే హాస్పిటల్కు సంబంధించినటువంటి అన్ని గేట్లు మూసివేసి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండడం గమనించిన బి.ఆర్.ఎస్ శ్రేణులు మార్చురీ నుండి ఎంజీఎం లోపటికి వెళ్ళేందుకు ప్రయత్నం చేయగా అక్కడ ఉన్నటువంటి పోలీసులు అడ్డుకోవడం జరిగింది. దీంతో ఇటు పోలీసులకు అటు వినయ భాస్కర్ , బి ఆర్ ఎస్ శ్రేణుల తో తీవ్ర తోపులాట వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వినయ భాస్కర్ కాలుకు గాయమైనట్లు సమాచారం. అయితే పోలీసులు ఎంజీఎం లోకి వెళ్లకుండా వీరిని అడ్డుకోవడంతో పోతన రోడ్లో రాస్తారోకో చేసే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వినయభాస్కర్ మాట్లాడుతూ తమ శాంతియుతంగా ఎంజిఎం కు వెళ్లి బాధితులను పరామర్శించేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో 1100 కోట్ల తో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అయితే తీవ్ర అస్వస్థతకు గురైనటువంటి వినయ్ భాస్కర్ చికిత్స కోసం హజార హాస్పిటల్ లో చేరారు. ఈ కార్యక్రమంలో రాచర్ల రాము, సదాంత్, కుమారస్వామి, రమేష్, చందు గౌడ్, భీమ్రాజ్, అనిల్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం పోరు

## జోగులాంబ గద్వాల జిల్లాలో అరెస్టుల పర్వం

- జూరాల నీటి విడుదలకై ప్రతిపక్షాలు, రైతు సంఘాల ఉధృత ఆందోళనలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పర్యటన - నేపథ్యంలో ముందస్తు నిర్బంధాలు
- డీకే స్నిగ్ధారెడ్డి, బాసు హనుమంతు నాయుడు, కురువ పల్లయ్య హౌస్ అరెస్టులు
- పంటలు ఎండిపోతుంటే అరెస్టులేంటని ప్రతిపక్షాల మండిపాటు






గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) జోగులాంబ గద్వాల జిల్లాలో సాగునీటి విడుదలకై ప్రతిపక్షాలు, రైతు సంఘాలు చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి.జూరాల ప్రాజెక్ట్ నుంచి సాగునీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పర్యటనను అడ్డుకునేందుకు, అలాగే స్థానిక నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు జిల్లావ్యాప్తంగా ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు.జిల్లాలో ఎడారిగా మారుతున్న పంట పొలాలను చూసి రైతాంగం ఆందోళన చెందుతుండటంతో, వారి తరఫున గొంతుక వినిపిస్తున్న నాయకులను గృహ నిర్బంధంలో ఉంచడం తీవ్ర చర్చనీయాంశమైంది. బీజేపీ నాయకురాలు డికె. స్నిగ్ధారెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వెంకట రాములును పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డికె. స్నిగ్ధా రెడ్డి మాట్లాడుతూ"ప్రతిపక్ష నాయకులపై ఈ ఆంక్షలు ఎందుకు? ఇదేనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాలన?" అని నిలదీశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదన్నారు.పోలీసు వలయంలో నాయకుల నివాసాలు,మరోవైపు, జూరాల నుంచి రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న కీలక నాయకుడు బాసు హనుమంతు నాయుడిని కూడా పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. ఆయన నివాసాన్ని పోలీసులు వలయంగా చుట్టుముట్టడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నీళ్లు ఇవ్వకుండా, ప్రశ్నించే వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంటలను కాపాడాలని స్పష్టం చేశారు.ఇదే అంశంపై పోరాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా పద్మా వెంకటేశ్వర్ రెడ్డిని సైతం గద్వాల జిల్లా కేంద్రంలోని ఆయన ఇంట్లోనే మంగళవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వం ఆంక్షలు మాని, పంటలను కాపాడేందుకు జూరాల నీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిర్బంధాలతో పాలన సాగించలేరని, ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడం సాధ్యం కాదని హెచ్చరించారు.

# ప్రజాపాలనలో లాభాల శిఖరానికి ఏపీఎచ్ఎంఈఎల్

- మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభం
- 2025-26లోనే రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల లాభాలు
- మూసివేత అంచుల నుంచి జాతీయస్థాయి సంస్థగా ఎదిగే దిశగా అడుగులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో విస్తరణ చర్యలు





**హైదరాబాద్ (జనంసాక్షి) :** దాదాపు మూడు దశాబ్దాల క్రితం రూ.21 కోట్ల పేరుకుపోయిన నష్టాలు.. మూతపడే పరిస్థితి.. కానీ, సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు రూ.60.85 కోట్ల లాభాలు (సంచిత లాభాలు). అందులోనూ గత మూడేళ్లలోనే రూ.34.20 కోట్ల నికర లాభాలు ఆర్జించడం విశేషం. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రంగ సంస్థగా మనుగడే ప్రశ్నార్థకంగా మారిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీఎచ్ఎంఈఎల్) ఇప్పుడు సింగరేణి అనుబంధ సంస్థగా ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత లాభాల బాటలో దూసుకుపోతోంది. ముఖ్యంగా గత మూడేళ్లుగా సంస్థ ఆర్థిక పనితీరు గణనీయంగా మెరుగుపడింది. 2023 డిసెంబరులో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి విస్తరణతోపాటు దాని అనుబంధ సంస్థ ఏపీఎచ్ఎంఈఎల్‌ను జాతీయస్థాయి సంస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చేపట్టిన చర్యలు సంస్థకు నూతన జవసత్వాలను అందించాయి. సింగరేణితోపాటు ఇతర భారీ పరిశ్రమలకు యంత్రాలు, వాటి విడిభాగాలను తయారు చేసి సరఫరా చేస్తున్న ఏపీఎచ్ఎంఈఎల్ తన 50 ఏళ్ల చరిత్రలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

### మూడేళ్లుగా వరుస లాభాలు

ఒకప్పుడు తీవ్ర నష్టాలతో మూసివేత అంచులకు చేరిన ఏపీఎచ్ఎంఈఎల్ ఇప్పుడు వరుసగా లాభాలను నమోదు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.05 కోట్లు, 2024-25లో రూ.9.87 కోట్లు, 2025-26లో రూ.23.33 కోట్ల నికర లాభాలను సాధించడం విశేషం. దీంతో 1998-99 లో సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు(2025-26 ) సంస్థ ఆర్జించిన మొత్తం లాభాలు రూ.60.85 కోట్లకు చేరాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి.ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ, దిశానిర్దేశంతో సింగరేణి నాయకత్వంలో ఏపీఎచ్ఎంఈఎల్‌ను జాతీయ స్థాయిలో పోటీపడే సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. గత ఏడాది ఆగస్టులో ఉప ముఖ్యమంత్రి స్వయంగా ఏపీఎచ్ఎంఈఎల్ ప్లాంటును సందర్శించి సంస్థ పనితీరు, అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. సంస్థ కేవలం తెలుగు రాష్ట్రాల్లోని పరిశ్రమలకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త తరహా యంత్రాలు, యంత్ర విడిభాగాలను తయారు చేయడంతోపాటు ఉత్పత్తులను విస్తరించి కొత్త మార్కెట్లను సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్లాంటులో పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించి కార్మికులతో మాట్లాడి వారిని ప్రోత్సహించారు. గతంలో ప్రధానంగా సింగరేణి వంటి సంస్థలకు యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేసిన ఏపీఎచ్ఎంఈఎల్ ఇప్పుడు తన మార్కెట్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. బీహెచ్ఈఎల్, జెన్‌కో, ఎన్ఎండీసీ, ఆర్ఐఎన్ఎల్ వంటి ప్రముఖ సంస్థలకు కూడా యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేస్తూ జాతీయస్థాయిలో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. కొత్త సంస్థల నుంచి ఆర్డర్లు సాధించడం, ఉత్పత్తుల్లో వైవిధ్యం తీసుకురావడం, వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టడం సంస్థ ఆర్థిక పనితీరు మెరుగుపడటానికి దోహదపడుతున్నాయి.

### కొత్త ఊపిరి పోసిన సింగరేణి

ఏపీఎచ్ఎంఈఎల్ సంక్షోభంలో ఉన్న సమయంలో దానిని ఆదుకునేందుకు సింగరేణి ముందుకొచ్చింది. 1994 నుంచి సింగరేణికి అవసరమైన కొన్ని యంత్రాలు, విడిభాగాల కొనుగోలుకు ఏపీఎచ్ఎంఈఎల్‌కు ఆర్డర్లు ఇవ్వడం ప్రారంభించింది. భూగర్భ గనుల్లో కార్మికుల రవాణాకు ఉపయోగించే మ్యాన్ రైడింగ్ సిస్టమ్స్, భారీ షావెల్స్‌కు అవసరమైన బకెట్లు, రూఫ్ బోల్టింగ్ రాడ్లు తదితర ఉత్పత్తులకు ఆర్డర్లు ఇచ్చి సంస్థకు అండగా నిలిచింది. అయితే కేవలం ఆర్డర్లు ఇవ్వడం ద్వారా సంస్థను పూర్తిస్థాయిలో గట్టెక్కించడం సాధ్యం కాకపోవడంతో ఏపీఎచ్ఎంఈఎల్‌లో పెట్టుబడులు పెట్టి నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు సింగరేణి ముందుకొచ్చింది. 1997-98లో రూ.9.18 కోట్ల ఈక్విటీ పెట్టుబడితో ఈ ప్రక్రియను ప్రారంభించింది. అనంతరం సింగరేణి మొత్తం రూ.14.08 కోట్ల పెట్టుబడితో 81.54 శాతం వాటాను కలిగి ప్రధాన భాగస్వామిగా మారింది. ప్రస్తుతం పబ్లిక్ షేర్ హోల్డర్లకు 11.81 శాతం, ఏపీ ఐడీసీకి 5.79 శాతం వాటా, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 0.86 శాతం వాటా కలిగి ఉంది. సింగరేణి నిర్వహణతో మారిన దశ

సంస్థను లాభాల బాట పట్టించేందుకు ఆర్డర్లు ఇవ్వడమే కాకుండా నిర్వహణలోనూ సింగరేణి కీలక పాత్ర పోషించింది. సింగరేణి నుంచి జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని ఏపీఎచ్ఎంఈఎల్ ఎండీగా నియమించడంతోపాటు పర్సనల్, ఇతర కీలక విభాగాల నిర్వహణకు అధికారులను నియమించింది.

ఇటీవల కాలంలో ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత అప్మెల్ లో సింగరేణి నిర్వహణ పద్ధతులు, వ్యయ నియంత్రణ, ఉత్పాదకత పెంపు, కొత్త ఆర్డర్ల సాధన వంటి చర్యలతో ఏపీఎచ్ఎంఈఎల్ క్రమంగా ఆర్థికంగా బలోపేతమైంది. ఒకప్పుడు నష్టాల్లో ఉన్న సంస్థ గణనీయమైన లాభాలు ఆర్జించే స్థాయికి చేరింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370